సత్యం, సమర్థత, విశ్వసనీయత
WWW.SAKSHYAM.COM
# సాక్ష్యం
తెలుగు దినపత్రిక
సంపుటి: 17 | సంచిక: 170
పేజీలు: 08 | వెల: రూ.2:00
హైదరాబాద్ | బుధవారం 17 జూన్ 2026
Published from Hyderabad, Vijayawada.

## అవినీతి అనకొండ నరహరి

- భారీగా ఆస్తులు గుర్తించిన ఏసీబీ
- ఇంట్లో రూ.1.54కోట్ల నగదు స్వాధీనం



హైదరాబాద్,జూన్16(సాక్ష్యం): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిని ఏసీబీ అరెస్ట్ చేసింది. నరహరి ఇంటితో పాటు మరో 9 చోట్ల తనిఖీలు నిర్వహించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఈ సోదాల్లో భారీగా అక్రమాస్తులను గుర్తించినట్లు తెలిపారు. నరహరి ఇంట్లో రూ.1.54కోట్ల నగదు, రూ.5.04 కోట్ల విలువ చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంకు ఖాతాలో రూ.2.29 కోట్లు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. 1.3 కిలోల బంగారం, 8 కిలోల వెండి ఆభరణాలు, భార్య పేరున రెండు బ్యాంకు

మిగతా 2 లో..



## నీట్ రీ ఎగ్జామ్‌తో అప్రమత్తం

**టెలిగ్రామ్ యాప్‌పై కేంద్రం ఆంక్షలు**

న్యూఢిల్లీ,జూన్16(సాక్ష్యం): నీట్ 2026 రీ-ఎగ్జామినేషన్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షను సురక్షితంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు టెలిగ్రామ్ యాప్ యాక్సెస్‌పై తాత్కాలిక ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది. ఐటీ చట్టం సెక్షన్ 69ం కింద

మిగతా 2 లో..



## రాజకీయాలకు అతీతంగా ఉద్యమకారుల గుర్తింపు

**జూన్ 23 నుంచి దశలవారీగా సంప్రదింపులు: కెకె**

హైదరాబాద్,జూన్16(సాక్ష్యం): తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారులను రాజకీయాలకు అతీతంగా గుర్తిస్తామని అందుకోసం ఏర్పాటైన కమిటీ స్పష్టం చేసింది. మంగళవారం తెలంగాణ అమరవీరుల

మిగతా 2 లో..



## జూలై 19నుంచి ఉజ్జయినీ మహంకాళి బోనాలు

**ఆహ్వాన పత్రికను మంత్రి పొన్నంకు అందచేత**

హైదరాబాద్,జూన్16(సాక్ష్యం): తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవస్థానం ఆషాఢ బోనాల జాతర మహోత్సవాలకు

మిగతా 2 లో..

# హార్ముజ్ శాశ్వతంగా టోల్ రహితం

ఫ్రాన్స్ వేదికగా జరగనున్న జీ 7 సమ్మిట్‌కు ముందు అమెరికా అధ్యక్షుడు హార్మూజ్ జలసంధిపై కీలక ప్రకటన చేశారు. ఈ శుక్రవారమే హార్మూజ్ జలసంధి పూర్తిగా తెరుచుకుంటుందని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇప్పటికే హార్మూజ్ జలసంధి కొంతవరకు తెరుచుకుందని.. సముద్ర మార్గంలో అమర్చిన మైన్లను తొలగించే చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ శుక్రవారం జరిగే శాంతి ఒప్పందానికి అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వ్యాన్స్ హాజరవుతారని, తాను వెళ్లడం లేదని ట్రంప్ స్పష్టం చేశారు.

- హార్మూజ్ ఇక టోల్ ఫ్రీ ఏరియా
- నౌకలు స్వేచ్ఛగా వెళ్లేందుకు అనుమతి
- శుక్రవారం నాటికి పూర్తిగా తెరుచుకుంటుంది
- ఇరాన్‌పై కుదిరిన ఒప్పందాన్ని త్వరలో వెల్లడిస్తా
- జి7 సదస్సులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పకటన




ప్యారిస్,జూన్16(సాక్ష్యం): ఫ్రాన్స్‌లో జీ 7 సదస్సు వేదికగా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. హార్ముజ్ శాశ్వతంగా టోల్ రహితంగా ఉంటుందని వెల్లడించారు. సమ్మిట్‌ను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగం చేశారు. ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధి శుక్రవారం నాటికి పూర్తిగా తెరుచుకుంటుందని.. ఇకపై అది శాశ్వతంగా టోల్ ఫ్రీగా అందుబాటులో ఉంటుందని ప్రకటించారు. అలాగే ఇరాన్‌తో కుదిరిన అవగాహన ఒప్పందం పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తానని.. దీనిపై ప్రత్యేకంగా మీడియా సమావేశం కూడా నిర్వహిస్తానని తెలిపారు. ఇరాన్‌తో కుదిరిన ఈ ఒప్పందాన్ని అమెరికా కాంగ్రెస్ పరిశీలనకు పంపనున్నట్లు ట్రంప్ చెప్పారు. ఈ ఒప్పందంలో ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేయబోదని స్పష్టంగా పేర్కొన్నామని వెల్లడించారు. ఇరాన్‌తో చర్చల తొలి దశ విజయవంతంగా పూర్తైందని.. రెండో దశ చర్చలు మరింత వేగంగా పూర్తవు తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్ ఒప్పందానికి సంబంధించిన పూర్తి పాఠ్యాన్ని అధికారిక కార్యక్రమంలో విడుదల చేస్తానని వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య ఇటీవల కుదిరిన శాంతి ఒప్పందం ప్రపంచ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. ముఖ్యంగా హార్ముజ్ జలసంధి పునఃప్రారంభం ప్రపంచ ఇంధన మార్కెట్లకు ఊరటనివ్వనుంది. ఇదిలా ఉండగా.. ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ కీలక ప్రకటన చేసింది. అమెరికాతో ఒప్పందం అనంతరం ఇరాన్‌కు చెందిన చమురు

మిగతా 2 లో..

## ట్రంప్‌తో ప్రధాని మోడీ కరచాలనం

జి7 సదస్సులో ఆత్మీయ పలకరింపు



ప్యారిస్,జూన్16(సాక్ష్యం): ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కలుసుకున్నారు. దాదాపు 16 నెలల తర్వాత ప్రత్యక్షంగా కలుసుకున్న వీరిద్దరూ ఆత్మీయంగా పలకరించుకోవడం అంతర్జాతీయ

మిగతా 2 లో..

# సబ్సిడీపై సన్న వడ్లు

- సన్నరకం వరి విత్తనాలు సిద్ధం చేయండి
- రైతు వేదికల వద్ద అందుబాటులో ఉంచండి
- సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించండి
- వ్యవసాయంలో కూడా ఏఐ, టెక్నాలజీ వినియోగం పెరగాలి
- వ్యవసాయ వర్సిటీ నోడల్ ఏజెన్సీగా సాంకేతిక సహకారం
- వ్యవసాయరంగంపై ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్



హైదరాబాద్,జూన్16(సాక్ష్యం): ధాన్యం దిగుబడిపైన వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. నిర్దేశించిన వరిరకాల విత్తనాలను రైతు వేదికలో అందుబాటులో ఉంచాలని మార్గనిర్దేశం చేశారు. సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలని ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా

మిగతా 2 లో..

## పారదర్శకంగా యూరియా పంపిణీ

- ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇంటినుంచే బుకింగ్
- ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులకు లబ్ది
- క్యూ లైన్లు కట్టాల్సిన దుస్థితి రాకుండా నిర్ణయం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కామారెడ్డి,జూన్16(సాక్ష్యం): రైతులకు పారదర్శకంగా యూరియా పంపిణీ చేస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో మంత్రి మాట్లాడుతూ.. క్యూ లైన్లు అవసరం లేకుండా ఇంటి నుంచే యూరియా బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని రైతులకు కల్పిస్తామన్నారు. ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులు బుకింగ్ చేసుకున్నారని వివరించారు. మొత్తం13.22 లక్షల యూరియా బస్తాల బుకింగ్ చేసుకుంటే..

మిగతా 2 లో..

# మెట్రోకు కేంద్ర ప్రభుత్వం సహకారమందిస్తోంది

- తెలంగాణ అభివృద్ధిపై ఎవరి పాఠాలు అవసరం లేదు
- తెలంగాణ అభివృద్ధి పట్ల మా చిత్తశుద్ధి మాకుంది
- హైదరాబాద్ మెట్రోకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం
- మేం అడ్డుకుంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవు
- అన్ని విధాలుగా అనేక కార్యక్రమాలు చేపట్టాం
- రేవంత్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ,జూన్16(సాక్ష్యం): తెలంగాణ అభివృద్ధిపై తమకెవరూ పాఠాలు చెప్పాల్సిన పనిలేదని, ఎవరి కోసమో తాము తెలంగాణ అభివృద్ధికి పాటుపడడం లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా మిగతా మెట్రో రైలు ప్రాజెక్టుల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర ప్రభుత్వం సహకారమందిస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. సాంకేతిక, ఆర్థిక విషయాలపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే ప్రాజెక్టులు సాకారమవుతాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విమర్శల నేపథ్యంలో దిల్లీలో కిషన్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. తాను వద్దంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవని చెప్పారు. మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి అనేక మార్పులను

మిగతా 3 లో..




## ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్

నేడు ప్రారంభించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్,జూన్16(సాక్ష్యం): రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ స్కూల్‌ను బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో తన ఎక్స్ ఖాతా వేదికగా సిఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ' 'భారతదేశ భవిష్యత్తు తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుంది'.. అన్నది ఇకపై ఒక నినాదం మాత్రమే కాదు.. కళ్ల ముందు కనిపించే నిజం. ఆ నిజానికి సాక్ష్యం

మిగతా 2 లో..

## కేసీఆర్ హయాంలో స్కీంలు.. కాంగ్రెస్‌లో స్కామ్‌లు

- కరోనాలో కూడా కెసిఆర్ రైతుబంధు ఏనాడూ ఆపలేదు
- రేవంత్ ముమ్మాటికీ ఎగవేతల రేవంత్ అంటాను
- కేసులు పెట్టినా భయపడేది లేదన్న హరీష్ రావు

కరీంనగర్,జూన్ 16(సాక్ష్యం): తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక కేసీఆర్ హయాంలో స్కీంలు చేపడితే కాంగ్రెస్ పాలనలో రేవంత్ సర్కారు స్కాంలకు పాల్పడుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. ఎగవేతల రేవంత్ అంటే తనపై తిమ్మాపూర్ స్టేషన్ లో కేసు పెట్టినారని, ఇటీవల నోటీసులు ఇచ్చారని, ఆయన ఎగవేతల రేవంత్ అని మరోసారి అన్నారు. రైతు బంధు రూ.19వేల కోట్లు ఎగబెట్టారని అన్నారు. కేసీఆర్ హయాంలో కరోనా లాంటి క్లిష్ట

మిగతా 3 లో..



## బీజేపీకి లబ్ది చేకూర్చేలా సర్ ప్రక్రియ

- కేంద్రానికి తొత్తుగా మారిన ఎన్నికల సంఘం
- బెంగాల్లో 92 లక్షల ఓట్ల తొలగింపే నిదర్శనం
- బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో పీసీసీ చీఫ్

సంగారెడ్డి,జూన్16(సాక్ష్యం): కేవలం బిజెపికి లాభం చేకూర్చేలా సర్ ప్రక్రియ సాగుతోందని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మతతత్వ పార్టీలకు ప్రయోజనం చేకూరేలా ఎస్ఐఆర్ పక్రియ నిర్వహించే కుట్ర జరుగుతుందని విమర్శించారు. మంగళవారం సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్‌పై బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ పేరుతో 92 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారని వివరించారు. ఈ పక్రియలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డితోపాటు తన ఓటు గల్లంతు అయినా ఆశ్చర్య పోనక్కర్లేదని వ్యంగ్యంగా అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ అని ,అలాంటి దేశంలో

మిగతా 2 లో..

# సంపాదకీయం

## ఎరువులు, విత్తనాలపై భరోసా ఏదీ?

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నైరుతి ప్రవేశించినా ఇప్పటికీ ఆశించిన వర్షాలు పడడం లేదు. రైతులు ఖరీఫ్‌కు సన్నద్ధం అవుతున్నా, అప్పుడే తొందరపడవద్దని, విత్తనాలు వేసుకోవద్దని వ్యవసాయాధికారులు హెచ్చరి స్తున్నారు. మరోవైపు సన్నరకాలను, డిమాండ్ ఉన్న వంగడాలనే వేయాలని తెలంగాణ ప్రభుత్వం తాజాగా సూచించింది. నిజానికి ఏ పంటలు వేయాలో రైతులకు సూచించి, అందుకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలను సరఫరా చేసే విధానం అవలంబించి ఉంటే ఇవాళ వ్యవసాయ సంక్షోభం ఉండేది కాదు. ఏ భూములు ఏ పంటలకు అనువో ఇన్నేళ్లయినా గుర్తించి, రైతులను వ్యవసాయానికి అనుగుణంగా సన్నదం చేయడంలో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. మరోవైపు ఎల్‌నినో భయ పెడుతున్న వేళ రైతులకు తగిన సూచనలు, సలహాలు చేయడం లేదు. ప్రణాళికలు సిద్దం చేయడం లేదు. అందుకే ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఏటా రైతులు బలవుతున్నారు. నీటి లభ్యత, భూముల వివరాల ఆధారంగా పంటలు పండించే పద్దతి కానరావడం లేదు. రైతులు కూడా తమకు తెలిసిన వరిని పండిస్తున్నారు. డిమాండ్ ఉన్న పంటలు పండించి, ఆర్థికంగా ఎదగడం లేదు. కాగా ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే తక్కువ నమోదవుతుందని ఐఎండి. అంచనా వేసింది. ఎల్‌నినో రాష్ట్రంపై ప్రభావం చూపుతుందని రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు వెల్లడించాయి. అందుకు తగ్గ ప్రణాళికలతో సన్నద్ధం కావాలని ఆదేశించినా., అదేమిటో రైతులకు బోధపడడం లేదు. రాష్ట్రంలో అత్యధికంగా వ్యవసాయం సాగేది ఖరీఫ్‌లోనే. నిరుడు పంటల సరళిలో మార్పులు చోటు చేసుకున్నప్పటికీ మొత్తంగా విస్తీర్ణ పరంగా సాధారణ సాగు నమోదైంది. అయితే వర్షాభావం, అకాల, భారీ వర్షాలు, తుపాన్లతో పంట నష్టాలు సంభవించి అన్నదాతలను ఆర్థికంగా నష్టపరిచాయి. కీలక సమయంలో వర్షాల్లేక కొన్ని ప్రాంతాల్లో పంట నష్టం వాటిల్లింది. ఖరీఫ్‌లో డ్రై స్పెల్ వందల మండలాలల్లో తిష్ట వేసినా ప్రభుత్వం కేవలం పెద్దగా పట్టించుకోలేదు. ఎపిలో రబీలో దుర్భిక్ష పరిస్థితులు విస్తరించగా 51మండలాల్లో కరువును ప్రకటించి చేతులు దులుపుకుంది. ప్రకటించిన మండలాల్లో కూడా రైతులకు ఎలాంటి ప్రత్యేక సహాయమూ చేయలేదు. ఇంకో వైపు ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో రైతులకు ఏ పంటకూ ధర రాక, ధర ఇప్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టక రైతులు నష్టాలను చవిచూశారు. కేంద్రం కూడా ఒక పద్దతి ప్రకటించడం లేదు. ఎల్‌నినోతో ఏ పంటలు వేసుకోవాలో, దేనికి మద్దతు ఇస్తరో తెలియడం లేదు. తెలంగాణలో మక్కజొన్న, జొన్న పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. వాటికి గిట్టుబాటు ధరలు లేక తల్లడిల్లారు. పంటలు కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. ఖరీఫ్ ముంచుకొస్తున్నా, నేటికీ సక్రమంగా ధాన్యం సేకరణ జరగలేదు. ఇకపోతే ఈఖరీఫ్‌లో సేద్యానికి రైతులకు అత్యవసరంగా కావాల్సినవి నాణ్యమైన విత్తనాలు,ఎరువులు, క్రిమిసంహారక మందులు, పెట్టుబడులు. రైతులకు అవసరమైన మొత్తం విత్తనాల్లో ప్రభుత్వం రాయితీపై అందించేవి 30 శాతమే. అవీ కొన్ని పంటలకే పరిమితం. ఎపిలో వేరుశనగ విత్తనాల పంపిణీ ఏర్పాట్లు ఆలస్యమయ్యాయి. వరి, కందులు, ఇతర అపరాలూ అంతే. పచ్చిరొట్ట పంట విత్తనాలిస్తున్నామంటున్నా బహిరంగ మార్కెట్ ధరలే రాయితీ విత్తనాలకూ నిర్ణయించారు. రాయితీ విత్తనాల పంపిణీ యావత్తూ అదే తీరు. సీజన్ ప్రారంభా నికి ముందు నుంచీ కేంద్రం ఆదేశాలతో యూరియా, డిఎపి వాడకాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లని, కార్డులని, పైలెట్ ప్రాజెక్టులని ప్రహసనం లేవనెత్తి రైతుల్లో, ముఖ్యంగా కౌలు రైతుల్లో గుబులు రేపింది. నిరుడు ప్రభుత్వ ముందుచూపు లేక యూరియా దొరక్క రైతులు ఇబ్బంది పడగా, ఆ పరిస్థితులే ఇం కా కొనసాగుతున్నాయి. నకిలీ, కల్తీ, అనుమతుల్లేని పత్తి విత్తనాల బెడద ఉండనే ఉంది. కేంద్రం పెంచిన డీజిల్, పెట్రోలు ధరలు, ఎరువుల ధరలు రైతాంగాన్ని కుంగదీస్తున్నాయి. తొలకరి సంకేతాలతో రైతన్నలు సాగుకు సిద్ధమయ్యేందుకు కావాల్సిన పెట్టుబడులు సమకూర్చడంపై ప్రభుత్వంలో నెలకొన్న స్తబ్దత ఆందోళన కలిగిస్తుంది. ఎపిలో కౌలు రైతులకు రెండేళ్లల్లో ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఈసారైనా ఇస్తారో లేదో తెలీదు. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల ఊసే లేదు. నిరుడు అక్టోబర్‌లో మొంథా తుపాన్ రాగా నేటికీ రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదు. పంటల బీమా సొమ్ము లేదు. కరువు మండలాల్లో రైతులకు పరిహారం లేదు. రెండేళ్లల్లో రైతులకు సున్నా వడ్డీ రూపాయి కూడా విడుదల చేయలేదు. వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలు పుస్తకాలకే పరిమితం అయ్యింది. ప్రాజెక్టుల కింద నీటి విడుదలకు షెడ్యూల్ ఇచ్చినా ఎల్‌నినో, వర్షాభావాలను పరిగణనలోకి తీసుకోవాలి. సేద్యం సజావుగా సాగాలంటే రైతుల అవసరాలన్నింటినీ తీర్చేందుకు ప్రభుత్వంలో చిత్తశుద్ధి, ముందుచూపు, సన్నద్ధత అవసరం. ఇకపోతే తెలంగాణలో ప్రభుత్వం తీరు సక్రమంగా కనిపించడం లేదు. దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ మార్కెట్‌లోనూ డిమాండ్ ఉన్న 8 రకాల మేలైన వరి వంగడాలనే సాగు చేసేలా రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు, శాస్త్రవేత్తలు సూచించారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సబ్‌కమిటీ ఎనిమిది రకాల వంగడాలను సాగు చేయించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు మంత్రులకు సూచించారు. ఈ వంగడాలకు మార్కెట్‌లో ఉన్న డిమాండ్ వల్ల ప్రభుత్వ మద్దతు ధర కంటే చాలా ఎక్కువ ధర లభించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియా, యూర్‌పలలో ఈ బియ్యానికి విపరీతమైన ఆదరణ ఉందని, వీటికి విత్తనాల కొరత కూడా లేదని వివరించారు. అంతర్జాతీయ మార్కెట్ ధరల్లో వచ్చే ఒడిదొడుకుల నుంచి రైతులకు రక్షణ లభించాలన్నా ఈ 8 రకాల సాగు ఒక్కటే మార్గమని తెలిపారు. రాష్ట్రంలో సాగవుతున్న అన్నిరకాల సన్న బియ్యానికి మార్కెట్‌లో ఆదరణ లభించడం లేదని, కొన్నిరకాల ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తున్నప్పుడు నూకలు ఎక్కువగా వస్తున్నాయని పౌర సరఫరాల శాఖ అధికారులు మంత్రులకు వివరించారు. డిమాండ్ లేని రకాల సాగును క్రమంగా తగ్గించి, ఎగుమతులకు ఉపయోగపడే నిర్దిష్ట రకాలనే ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు. అయితే ఇది క్షేత్రస్థాయిలో రైతులకు చేరాలి. వారికి సక్రమంగా విత్తనాలు సరఫరాచేసి, అవే పంటలు పండించేలా ప్రోత్సహించేందుకు నడుం బిగించాలి. అప్పుడే సత్ఫలితాలు సాధించగలం.

## ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్

మొదటిపేజీ తరువాయి..

ఆరుట్లలోని 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'. మేధావుల సలహాలు, విజ్ఞుల సూచనలతో తెలంగాణ విద్యా వ్యవస్థ చరిత్రను విప్లవాత్మక సంస్కరణలతో తిరిగి రాయాలన్న నా సంకల్పానికి రూపం 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' అని పేర్కొన్నారు. చరిత్ర పుటల్లో కలిసిపోతున్న సర్కారు బడి ప్రజా పాలనలో నేడు మళ్లీ పూర్వ వైభవాన్ని మించిన వైభవంతో, సకల సౌకర్యాలతో, ఆధునిక వసతులతో, పిల్లల మేధో వికాస్ క్షేత్రంగా నిలవబోతోంది. తెలంగాణ బిడ్డల పాలిట సరస్వతీ కటాక్ష ఆలయంగా రూపుదిద్దుకున్నది. ఆకలి తీర్చి, అక్షరాలు నేర్పి, ఆటను ప్రోత్సహించి పిల్లల్లో మనోవికాసం వికసించేలా, మట్టిలో మాణిక్యాలను తీర్చి దిద్దే సకల హంగులతో రూపుదిద్దుకున్న నా మానస పుత్రిక ఈ పాఠశాల. 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'కు రూపం ఇచ్చే కార్యంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. విద్యార్థులకు అభినందనలు. ఆరుట్లలో ఆవిష్కృతమవుతున్న నేటి ఈ 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' ఆరంభం మాత్రమే. తెలంగాణ వ్యాప్తంగా భవిష్యత్‌లో వంద తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను నెలకొల్పడం తదుపరి మా కర్తవ్యం' అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.



# హోర్ముజ్ శాశ్వతంగా టోల్ రహితం

మొదటిపేజీ తరువాయి..

ట్యాంకర్లు, ఇతర వాణిజ్య నౌకలు మళ్లీ సముద్ర మార్గంలో ప్రయాణాలు ప్రారంభించాయని వెల్లడించింది. అమెరికా విధించిన నౌకాదళ దిగ్బంధనం సడలింపుకు ఇది సంకేతమని పేర్కొంది. ప్రస్తుతం మూడు ఇరానియన్ చమురు ట్యాంకర్లు ఉత్తర హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తుండగా.. మరో రెండు నౌకలు అవసరమైన సరుకులు, పశువుల మేతతో దక్షిణ ఇరాన్ నౌకాశ్రయాల వైపు వెళ్తున్నాయని ఇరాన్ మీడియా తెలిపింది. ఏప్రిల్ 13 నుంచి అమల్లో ఉన్న అమెరికా నౌకాదళ ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ నౌకల రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. అయితే తాజా ఒప్పందంతో ఆ దిగ్బంధనాన్ని ఎత్తివేసే పక్రియ అమలులోకి వచ్చిందని ఇరాన్ వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిణామం ప్రపంచ చమురు సరఫరా వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.




## ట్రంప్‌తో ప్రధాని మోడీ కరచాలనం

మొదటిపేజీ తరువాయి..

వేదికపై ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జీ7 సదస్సు ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశంలో మోదీ, ట్రంప్ ఒకరితో ఒకరు కరచాలనం చేసుకుని కాసేపు మాట్లాడుకున్నారు. గతేడాది ఫిబ్రవరి తర్వాత వీరిద్దరూ కలుసుకోవడం ఇదే మొదటిసారి. సదస్సులో వీరిద్దరూ పక్కపక్కనే కూర్చున్నారు. బుధవారం ఈ ఇరువురు నేతలు సమావేశం కాబోతున్నారు. భారత్-అమెరికా సంబంధాలు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, భద్రతా అంశాలు, ప్రాంతీయ పరిణామాలపై ఇద్దరు నేతలు చర్చించబోతున్నట్టు సమాచారం.జీ7 సదస్సుకు హాజరైన మోదీ ప్రపంచ నాయకులతో వరుసగా సమావేశాలు నిర్వహించనున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో పాటు కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ, బ్రిటన్ పీఎం కీర్ స్టార్మర్, యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌లతో పలు ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు.



# సబ్సిడీపై సన్న వడ్లు

మొదటిపేజీ తరువాయి..

వ్యవసాయ శాఖ అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 7 రకాల సన్న వడ్లను సబ్సిడీపైన ఇవ్వాలని మార్గనిర్దేశర చేశారు.

భద్రాద్రి కొత్తగూడం దమ్మపేట మండలంలో ప్రారంభించిన పైలెట్



ప్రాజెక్ట్‌ను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింతగా పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఏఐని మరింతగా వినియోగించాలని నిర్దేశిరచారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని సాంకేతికతను పెంచుకోవాలని సూచించారు. సీడ్స్ నుంచి కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించుకునే ప్రయత్నాలు చేయాలని పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్‌ను బలోపేతం చేసుకోవాలని తెలిపారు. అన్ని వ్యవసాయ మందులకు సంబంధించి ఓ యాప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా బుక్ చేసుకునే యూరియాను రైతు వేదిక ద్వారా పంపిణీ చేయాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు యూరియా పంపిణీ బాధ్యతను అప్పగించాలని ఆదేశించారు. యూరియా, ఇతర ఎరువుల కేటాయింపులపై ఎప్పటికప్పుడూ కేందప్రభుత్వానికి లేఖలు రాయాలని ఆదేశించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయిన ఎరువులు మొత్తం తెలంగాణకే ఇచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎరువుల పరిస్థితిపైన అన్ని పార్టీల ఎంపీలతో ఓ సమావేశం నిర్వహించి పరిస్థితిని వివరించాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## పారదర్శకంగా యూరియా పంపిణీ

మొదటిపేజీ తరువాయి..

84.6 శాతం పంపిణీ పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రంలో 90.22 లక్షల యూరియా బస్తాల భారీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతుల సూచనలతో ఫర్టిలైజర్ యాప్‌లో నిరంతర మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. స్మార్ట్ ఫోన్ లేని రైతులకు టోల్ ఫ్రీ ద్వారా యూరియా బుకింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ టోల్ ఫ్రీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ యాప్ వినియోగంలో నిజామాబాద్ జిల్లా రైతులు రాష్ట్రంలో ముందంజలో ఉన్నారని ప్రశంసించారు. యూరియా బ్లాక్ మార్కెటింగ్, అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకే ఈ డిజిటల్ విధానం అమల్లోకి తీసుకొచ్చినట్లు వివరించారు. నిజమైన రైతులకు మాత్రమే ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం ఉన్నా యూరియా కొరత రానివ్వమని రైతులకు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల భరోసా కల్పించారు. పెద్ద రైతులు ఆందోళన చెంద వద్దని.. అందరికీ సమానంగా ఎరువుల పంపిణీ చేస్తామన్నారు. అధిక యూరియా వినియోగం భూసారానికి హానికరం అని రైతులను ఆయన హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తక్కువ వర్షాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రైతులకు స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలంటూ రైతులకు మంత్రి తుమ్మల సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వరికి బదులు ఆయిల్ పామ్ వంటి లాభసాటి పంటల వైపు వెళ్లాలని రైతులకు స్పష్టం చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతాంగానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా కల్పించారు.

## బీజేపీకి లబ్ధి చేకూర్చేలా సర్ ప్రక్రియ

మొదటిపేజీ తరువాయి..

కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీకి తొత్తుగా మారిందని ఆరోపించారు. 2002లో ఎస్ఐఆర్ పక్రియ పారదర్శకంగా జరిగిందని.. కానీ ప్రస్తుతం వారికి ఓట్లు పడవనుకుంటే వాటిని తొలగిస్తుందన్నారు. తమ ఓట్లు క్షేమంగా ఉండాలంటే బీఎల్ఏ కీలకంగా పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. రాజకీయాల్లో తనకు దామోదర రాజనర్సింహ ఓనమాలు నేర్పించారని గుర్తు చేసుకున్నారు. ఈ దేశంలో అతికొద్దిమంది నిజాయితీ పరుల్లో మీనాక్షి నటరాజన్ ఒకరని పేర్కొన్నారు. అకారణంతోనే ఆమె రాజ్యసభ నామినేషన్ పత్రాన్ని తిరస్కరించారని తెలిపారు. బీజేపీ వాళ్లకి కనికరం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంతరం అధికారంలో ఉండి చక్రవర్తుల్లా ఉండాలని బీజేపీ నేతలు అనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. మీ కంటే పెద్ద చక్రవర్తులే నేలమట్టం అయ్యారు.. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలు ఎంత..? అని ప్రశ్నించారు. అధికారం శాశ్వతం అనుకుంటే.. వారు మూర్ఖులే అవుతారన్నారు. దేవుళ్లకు ఎవరు వ్యతిరేకం కాదు.. కానీ దేవుడి పేరు చెప్పనిదే బీజేపీ వాళ్లకు ఓట్లు పడవన్నారు.
ఏడాదిలో చాలాసార్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పూజలు నిర్వహిస్తారని.. కానీ దేవుళ్ల పేరుతో తాము ఓట్లు అడిగమన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని.. ఉన్న ఉద్యోగాలను తీసేస్తున్నారంటూ కేంద్రంపై టీపీసీసీ చీఫ్ నిప్పులు చెరిగారు. ఇకపోతే జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెనుక బీజేపీ ఉందని టీపీసీసీ చీఫ్ విమర్శించారు. కమలం పార్టీ ఆడించినట్టే.. ఆయన ఆడుతున్నారని ఆరోపించారు. మీ సానుభూతి తమకేం అవసరం లేదని పవన్‌కు స్పష్టం చేశారు. మీ కుట్రలు ప్రజలు గమనిస్తున్నారని పవన్‌కు సూచించారు. తెలంగాణ వచ్చినప్పుడు 10 రోజులు అన్నం తినలేదని పవన్ వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ 12 ఏళ్లలో తెలంగాణకు ఏం చేశారో చిట్టా ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. కేంద్రం నుంచి రాష్టానికి ఇంకా నిధులు రావాల్సి ఉందన్నారు. విభజన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదంటూ కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు మీరు సబర్మతి కట్టుకో వచ్చు..

## రాజకీయాలకు అతీతంగా ఉద్యమకారుల గుర్తింపు

మొదటిపేజీ తరువాయి..

స్మారక అమరజ్యోతిని ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సందర్శించింది. ఈ కమిటీ చైర్మన్ కె. కేశవరావు నేతృత్వంలో ఈ అమరజ్యోతి వేదికగా సమావేశమైంది. జూన్ 23వ తేదీ నుంచి ఉద్యమకారుల గుర్తింపుపై దశలవారీగా సంప్రదింపులు జరుపుతామని కమిటీ వెల్లడించింది. అందుకోసం విద్యార్థి జేఏసీ, కళాకారులు, రచయితలతో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపింది. అలాగే ప్రజా సంఘాలు, అడ్వకేట్లు, డాక్టర్ల అభిప్రాయాలను కూడా తీసుకుంటామని కమిటీ పేర్కొంది. 2001-2014 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారితో చర్చలు జరుపుతామని వివరించింది. ఈ ఉద్యమకారుల గుర్తింపుపై విస్తృత స్థాయిలో సూచనల సేకరిస్తామంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో అభిప్రాయాల స్వీకరణ జరపనున్నట్లు పేర్కొంది. ఉద్యమకారుల కోసం ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా కమిటీ ప్రకటించింది. ఉద్యమకారుల గుర్తింపు పక్రియను పారదర్శకంగా చేపట్టనున్నట్లు తెలిపింది. తెలంగాణ ఉద్యమ చరిత్రకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని వివరించింది. ఈ కమిటీ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ కోదండరాం తదితరులు పాల్గొన్నారు.

## జూలై 19నుంచి ఉజ్జయినీ మహంకాళి బోనాలు

మొదటిపేజీ తరువాయి..

ముస్తాబవుతోంది. ఈ ఏడాది నిర్వహించబోయే వార్షిక బోనాల జాతర కార్యక్రమాల అధికారిక షెడ్యూల్ వివరాలను ఆలయ చైర్మన్, అర్చక బృందం కలిసి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి అందజేశారు. జాతరను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు వీలుగా ముందస్తు ఏర్పాట్లపై చర్చించేందుకు ఈ వివరాలను మంత్రికి సమర్పించారు. ఆలయ దేవస్థానం ప్రకటించిన అధికారిక షెడ్యూల్ ప్రకారం.. జూలై 19వ తేదీ ఆదివారం సాయంత్రం 4:00 గంటలకు అమ్మవారి ఘటోత్సవం కార్యక్రమంతో ఈ మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. అనంతరం, జాతరలో అత్యంత కీలకమైన ప్రధాన బోనాల ఉత్సవాన్ని ఆగస్టు 2వ తేదీ ఆదివారం తెల్లవారుజామున 4:00 గంటల నుంచే ప్రారంభించనున్నారు. ఆ రోజంతా లక్షలాది మంది మహిళలు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకోనున్నారు. జాతర మరుసటి రోజైన ఆగస్టు 3వ తేదీ సోమవారం ఉదయం 8:30 గంటలకు భవిష్యవాణిని వినిపించే ప్రసిద్ధ రంగం కార్యక్రమం జరగనుంది. ఆ తర్వాత ఉదయం 10:30 గంటల సమయంలో అత్యంత కోలాహలంగా అమ్మవారి గజవాహన ఊరేగింపు మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.

## నీట్ రీ ఎగ్జామ్‌తో అప్రమత్తం

మొదటిపేజీ తరువాయి..

ఈ చర్యలు తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. జూన్ 22 వరకు భారతదేశంలో టెలిగ్రామ్ యాప్ యాక్సెస్‌పై నియంత్రణ ఉండనుంది. ఈనెల 21న దేశవ్యాప్తంగా నీట్ 2026 రీ-ఎగ్జామ్ నిర్వహించనున్న నేపథ్యంలో, పరీక్ష భద్రతను దృష్టిలో ఉంచుకుని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సిఫార్సు మేరకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.అలాగే, టెలిగ్రామ్‌లో ఈనెల 30 వరకు మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను పూర్తిగా నిలిపివేయాలని ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. పరీక్ష పూర్తయిన తర్వాత పాత టైమ్‌స్టాంప్‌లతో నకిలీ 'పేపర్ లీక్' ఆధారాలు సృష్టిస్తున్న ముఠాలను అడ్డుకోవడానికే మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌పై నిషేధం విధించినట్లు తెలుస్తోంది. పేపర్ లీక్ పేరుతో విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న నకిలీ టెలిగ్రామ్ ఛానళ్లపై ఇప్పటికే సైబర్ క్రైమ్ విభాగాలు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అహ్మదాబాద్‌లో 8 టెలిగ్రామ్ ఛానళ్లను నడుపుతూ రూ.1.5 కోట్ల మోసాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాను సైబర్ క్రైమ్ బ్రాంచ్ అరెస్ట్ చేసింది. జూన్ 21న జరగనున్న రీ-ఎగ్జామ్‌కు ముందు ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలపై ఎన్‌టిఎ స్పందించింది. అవన్నీ తప్పుడు ప్రచారాలేనని స్పష్టం చేస్తూ, విద్యార్థులు అధికారిక సమాచారం కోసం వెబ్‌సైట్ ను మాత్రమే అనుసరించాలని సూచించింది. ఎవరైనా మోసాలకు పాల్పడితే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కి ఫిర్యాదు చేయాలని కేంద్ర ప్రభుత్వం కోరింది.

## అవినీతి అనకొండ నరహరి

మొదటిపేజీ తరువాయి..

లాకర్లు, కారు ఉన్నట్లు అధికారులు తేల్చారు. రంగారెడ్డి జిల్లాల్లో 5 ఓపెన్ ఎ÷-లాట్లు, మహేశ్వరంలో 1.24 ఎకరాల వ్యవసాయ భూమి, పుప్పాలగూడలో ఓ అపార్ట్‌మెంట్ ఉన్నట్లు గుర్తించారు. నార్సింగిలోని అపార్ట్‌మెంట్‌లో రెండు ఎ÷-లాట్లు, రాజేంద్రనగర్‌లో మరో ఎ÷-లాట్, గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీలో జీప్లస్ 3 భవనం, ఛత్రినాకలో మూడంతస్తుల భవనం ఉన్నట్లు ఏసీబీ తేల్చింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ ఆస్తుల విలువ రూ.13.05 కోట్లు అని.. బహిరంగ మార్కెట్‌లో రూ.150 కోట్లకు పైనే ఉంటుందని అధికారులు వెల్లడించారు.



## జర్నలిస్ట్ కుటుంబాలకు నేడు ఆర్థిక సాయం

హైదరాబాద్,జూన్16(సాక్ష్యం): మరణించిన వర్కింగ్ జర్నలిస్టుల కుటుంబాలకు, అనారోగ్యం బారిన పడిన/ప్రమాదాలకు గురైన జర్నలిస్టులకు బుధవారం ఆర్థిక సహాయం అందించనున్నారు. బుధవారం ఉదయం 10:45 గంటలకు నాంపల్లి తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై చెక్కులను అందజేస్తారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ మరియు నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, ఐ అండ్ పిఆర్ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి పాల్గొంటున్నారు. మీడియా అకాడమి చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

## యూరియా యాప్ ఎత్తేయాలంటూ రైతుల ఆందోళన

నిజామాబాద్,జూన్16(సాక్ష్యం): యూరియా యాప్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మోర్తాడ్ సొసైటీ పరిధిలోని ఆరు గ్రామాల రైతులు మంగళవారం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ యాప్ విధానం వల్ల యూరియా సరైన సమయానికి అందడం లేదని యాప్ వాడడం తెలియక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితిలో ఏర్పడుతున్నాయని, కావున యాప్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ రైతుకు అవసరం ఉందని యూరియా సంచులను పాత పద్ధతిలో అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నిజామాబాద్,జూన్16(సాక్ష్యం): విత్తనాలు ఎరువులు ఎమ్మార్పీ కన్నా అధిక ధరలు, నకిలీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేయడంతో పాటు చట్టం పరమైన చర్యలు తీసుకుంటామని ఏవో కిషన్ హెచ్చరించారు. ఈ మేరకు విత్తనాలు, ఎరువుల దుకాణాల యజమానులకు హెచ్చరిక చేశారు. పెద్దకొడప్ గల్ మండల కేంద్రంలోని పలు విత్తనాలు ఎరువుల దుకాణాలను మంగళవారం ఆయన పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. దుకాణదారులు విత్తనాలు ఎరువుల వివరాలను ప్రతిరోజు తప్పకుండా రికార్డులో నమోదు చేయాలన్నారు. రైతులకు ఒరిజినల్ రసీదు ఇవ్వాలన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తయారీ గడువు తేదీ, సీల్, లాట్ నంబర్లు కలిగి ఉన్న విత్తనాలను కొనుగోలు చేయని రైతులకు సూచించారు.

## ఆర్థిక సంక్షోభంలో కూరుకున్న తమిళనాడు

చెన్నై,జూన్16(సాక్ష్యం): తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సమగ్ర శ్వేతపత్రాన్ని మంగళవారంనాడు విడుదల చేసింది. డీఎంకే ప్రభుత్వ హయాంలో రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని, ఖజానా ఖాళీ అయిందని ఆ శ్వేతపత్రంలో పేర్కొంది. రాష్ట్ర మొత్తం ఆర్థిక భారం రూ.13.18 లక్షల కోట్లకు చేరిందని తెలిపింది. ప్రత్యక్ష రుణభారం దాదాపు రూ.10 లక్షల కోట్లుగా పేర్కొంది. ఎంకే స్టాలిన్ సారథ్యంలోని గత డీఎంకే ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రాష్ట్ర రుణ భారం దాదాపు రెట్టింపయిందని, రాష్ట్రంలో పుట్టే ప్రతి చిన్నారిపై రూ.1.28 లక్షల అప్పుభారం పడుతోందని ఆ నివేదిక పేర్కొంది. రాష్ట్ర ఆర్థిక లోటు 78,324 కోట్లుగా నమోదైనట్టు తెలిపింది. ప్రభుత్వానికి వచ్చే ప్రతి రూపాయిలో 22.8 పైసలు అప్పులపై వడ్డీ చెల్లింపులకే పోతోందని శ్వేతపత్రం తెలిపింది. జీఎస్టీ ఆదాయ వృద్ధి కేవలం 5.45 శాతంగా ఉందని, ఆదాయానికి, అప్పులకు పొంతనే ఉండటం లేదని పేర్కొంది.

## యూరియా యాప్ తొలగించాల్సిందే

బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల ఆందోళన

నిజామాబాద్,జూన్16(సాక్ష్యం): యూరియా యాప్ తొలగించాలని బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ రూరల్ ఇంచార్జ్ బాజిరెడ్డి జగన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరికొండ మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో యూరియా యాప్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆయన మంగళవారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా 'యూరియా యాప్ పోవాలి.. రేవంత్ దిగిరావాలి' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు తక్షణమే యూరియా అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులపై కక్ష సాధింపు చర్యలో భాగంగానే యూరియా యాప్ తెచ్చి రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సకాలంలో రైతుబంధు ఇవ్వక రైతులను ప్రభుత్వం నట్టేట ముంచుతుందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతును రాజును చేసే ఘనత కేసీఆర్ కే దక్కిందని అన్నారు.

**డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-2 సమక్షమునకు**
**త్రివేణి కాంప్లెక్స్, హైదరాబాద్**
**O.A. No. 145 ఆఫ్ 2026**

ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్, చింతల్ బ్రాంచ్, కుత్బుల్లాపూర్ మం॥, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, ప్రతినిధిగా దాని అసిస్టెంట్ జనరల్ మేనేజర్
...దరఖాస్తుదారు
మరియు
శ్రీ సూరజ్ కుమార్ కుక్కాల మరియు ఇతరులు
...ప్రతివాదులు
కు మధ్య

**పత్రికా ప్రచురణ ద్వారా సమన్లు**

1. శ్రీ సూరజ్ కుమార్ కుక్కాల, తండ్రి శ్రీ నరసింహ మూర్తి కుక్కాల, వయస్సు: 52 సంవత్సరాలు, పురుషుడు, నివాసం: ఇంటి నెం. 8-244, భుజబాలరాయుని, చెరువు, కొనితివాడ, వీరవాసం (మం॥), రాయకుదూరు, పశ్చిమ గోదావరి, ఆంధ్రప్రదేశ్-534247.
2. శ్రీమతి ఐశ్వర్య కుక్కాల, భర్త శ్రీ సూరజ్ కుమార్ కుక్కాల, వయస్సు 44 సంవత్సరాలు, స్త్రీ, డి.నెం. 9-121, మునినారాయణ వీధి, పాతపేట, పాలమనేర్, చిత్తూరు, ఆంధ్రప్రదేశ్-517408.

పైన తెలిపిన ఓ.ఎ. నెం. 145/2026తో మీకు వ్యతిరేకముగా రూ. 53,29,870.50/- వసూలు చేసుకొనుట కొరకు దరఖాస్తుదారు దాఖలు చేసి ఈ సమన్లను జారీ చేయడమైనది. గౌరవనీయ ట్రిబ్యుల్ వారు ఈ సమన్లను తెలుగు/ఆంగ్ల దినపత్రికలలో పత్రికా ప్రచురణ ద్వారా జారీ చేయుటకు ఉత్తర్వు జారీ చేసి మరియు 20.07.2026 తేదీకి వాయిదా వేసినారు.
సదరు చట్టములోని సెక్షన్ 19 సబ్ సెక్షన్ (4)ను అనుసరించి ప్రతివాది అయిన మీకు ఈ క్రింది విధముగా సూచించడమైనది.
(i) ఈ సమన్లు జారీ చేయుట ద్వారా మీకు ఎందుకు ఉపశమనము కలిగించకూడదో తెలియజేస్తూ ముప్పై రోజులలోగా కారణము తెలియజేయవలెను.
(ii) ఒరిజినల్ దరఖాస్తు యొక్క క్రమ సంఖ్య 3ఎ క్రింద దరఖాస్తుదారు ద్వారా పొందుపరచిన ఆస్తులు మరియు ఆస్తులు కాని ఇతర ఆస్తుల యొక్క వివరములను వెల్లడించుట.
(iii) ఆస్తుల అటాచ్‌మెంట్ కొరకు దరఖాస్తు యొక్క వెల్లడి మరియు వాదనలు పెండింగ్‌లో ఉన్నందున ఒరిజినల్ దరఖాస్తు యొక్క క్రమ సంఖ్య 3ఎ క్రింద వెల్లడించిన ఆస్తులు మరియు ఇతర ఆస్తులు లేదా సెక్యూర్డ్ ఆస్తులతో అమ్మకము లేదా ఎటువంటి లావాదేవీలు జరుపుటకు మిమ్మల్ని నిషేధించినారు.
(iv) ట్రిబ్యునల్ వారి ముందస్తు అనుమతి లేకుండా ఒరిజినల్ దరఖాస్తు యొక్క క్రమ సంఖ్య 3ఎ క్రింద వెల్లడించిన లేదా పొందుపరచిన ఆస్తులను మరియు/లేదా ఇతర ఆస్తులతో సృష్టించిన సెక్యూరిటీ ఇంటరెస్ట్‌పై సాధారణ కోర్సు పద్ధతి మినహాయించి అమ్మకము, లీజు లేదా ఇతర విధములైన బదిలీలను చేయుటకు మిమ్మల్ని నిషేధించినారు.
(v) కావున బ్యాంకు లేదా ఆర్థిక సంస్థల వద్ద నిర్వహిస్తున్న ఖాతాలో సెక్యూరిటీ ఇంటరెస్ట్ గా కలిగి ఉన్న ఆస్తులపై సేల్ ప్రొసీడ్స్ ద్వారా డిపాజిట్స్ మరియు సాధారణ వ్యాపార కోర్సులలో సెక్యూర్డ్ ఆస్తులు లేదా ఇతర ఆస్తులు మరియు ఆస్తుల అమ్మకం ద్వారా తీర్చుటకు సేల్ ప్రొసీడ్స్‌కు మీరు బాధ్యులై ఉన్నారు.

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-II, 1వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్ వారికి సమక్షమునకు తేది: 20.07.2026న ఉ. 10.30 గం॥లకు వ్యక్తిగతముగా లేదా న్యాయవాది ద్వారా హాజరై మీకు ఎందుకు ఉపశమనం కలిగించాలో కోరుతూ కారణం చూపవలసిందిగా మీకు సూచించడమైనది.
విఫలమైనచో మీ గైర్హాజరు సమయమున సదరు దరఖాస్తుపై వాదనలు విని నిర్ధారించెదరు.
ఈ ట్రిబ్యునల్ సీలు వేసి నా ద్వారా 11 జూన్, 2026న జారీ చేయడమైనది.
(డిఆర్‌టి 2, హైదరాబాద్ ఆదేశానుసారం)
సమన్లు జారీ చేసే అధికారి సంతకం

# మెట్రోకు కేంద్ర ప్రభుత్వం సహకారమందిస్తోంది

మొదటిపేజీ తరువాయి..

రాష్ట్రానికి కేంద్రం సూచించిందన్నారు. ప్రాజెక్టులను దొడ్డిదారిన ఆపే సంస్కృతి భాజపాకు లేదని.. కాంగ్రెస్‌కే ఉండొచ్చని వ్యాఖ్యానించారు. ఎవరి కోసమూ ప్రాజెక్టులను అడ్డుకోబోమన్నారు. తెలంగాణ అభివృద్ధి పట్ల మాకు చిత్తశుద్ధి ఉంది. గతంలో మెట్రో ఫేజ్-1కు కేంద్రం రూ.1,250 కోట్లు మంజూరు చేసింది. అనాలోచితంగా, దుందుడుకు ధోరణిలో సీఎం మాట్లాడటం సమంజసం కాదు. నాతో పాటు ప్రధాని మోదీ, కేంద్రానికి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదు. మేం రేవంత్‌రెడ్డికి కాదు.. తెలంగాణ ప్రజలకు జవాబుదారీ. రాష్ట్ర అభివృద్ధి కోసం 12 ఏళ్లుగా పనిచేశాం.. ఇప్పుడూ పనిచేస్తాం. ఇచ్చిన హామీలను తు.చ. తప్పకుండా అమలు చేస్తున్నాం. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి పట్ల మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదన్నారు. తెలంగాణ బిడ్డగా ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాటం చేశాను. దిల్లీకి వచ్చి రెండుసార్లు ధర్నా చేశాం. బిల్లు ఆమోదం పొందిన తర్వాతే ఏపీ భవన్‌లో ఆమరణ దీక్ష విరమించా. రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్, నేడు రేవంత్‌రెడ్డికి లేఖలు రాశా. రేవంత్ కోరితే కాకుండా.. కేంద్ర ప్రభుత్వమే బాధ్యతగా తీసుకుని రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు చేపట్టింది. ఎంఎంటీఎస్ ఫేజ్-2కు నాడు కేసీఆర్ సహకరించలేదు. అయినప్పటికీ ప్రధాని చేతులమీదుగా ప్రారంభించాం. తెలంగాణకు రాదనుకున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీని సాధించాం. రాష్ట్రాల్లో ఏ పార్టీకి చెందిన ప్రభుత్వాలు ఉన్నా అందరికీ కేంద్రం సహకారం అందిస్తోంది. మోదీ ఇస్తుంటే కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారనడం దిగజారుడు రాజకీయాలని మండిపడ్డారు. 50 ఏళ్లు వడ్డీ లేకుండా రాష్ట్రానికి ఇటీవల సాస్కీ రుణాలను కేంద్రం మంజూరు చేసింది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు ఏడీబీ రుణానికి కేంద్రం ఎన్వోసీ ఇచ్చింది. ఎన్‌సీడీసీ ద్వారా పదేళ్లుగా తెలంగాణకు రూ.లక్ష కోట్లు మంజూరు చేశాం. ధాన్యం కొనుగోళ్లకు రూ.37వేల కోట్లు మంజూరు చేసి.. ఇప్పటికే రూ.34వేల కోట్లు అందించాం అని కిషన్‌రెడ్డి వివరించారు. తెలంగాణ అభివృద్ధిపై తమకు చిత్తశుద్ధి ఉందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మెట్రో అంశంలో బీజేపీపై బురదజల్లుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన మండిపడ్డారు. మెట్రో రైలు ప్రాజెక్ట్ ఆపాలని తానేందుకు చెబుతానంటూ ఈ సందర్భంగా అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణలో కేంద్రం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. ఒక లక్షా 75 వేల కోట్ల రూపాయలతో రహదారులను అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధి మా బాధ్యత' అని కిషన్ రెడ్డి పునరుద్ఘాటించారు. తనపై సీఎం రేవంత్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ అనాలోచితంగా మాట్లాడుతున్నారన్న ఆయన.. తమకు రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ ఏమీ అవసరం లేదన్నారు. అభివృద్ధి అంశంలో తమకు పాఠాలు నేర్పాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ నేతలకు సూచించారు.

# కేసీఆర్ హయాంలో స్కీంలు.. కాంగ్రెస్‌లో స్కామ్‌లు

మొదటిపేజీ తరువాయి..

పరిస్థితుల్లో సైతం ఏనాడు ఆపలేదని గుర్తు చేశారు. కరీంనగర్ జిల్లా అల్గునూర్ లో మానకొండూర్ నియోజకవర్గ స్థాయి డిజిటల్ సభ్యత్వ నమోదు తో పాటు సర్ పై విస్తృత స్థాయి సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన హరీష్ రావుకు అల్గునూర్ లో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పని కేసీఆర్ ప్రభుత్వంలో రైతు బంధు, రైతు భీమా, కళ్యాణ లక్ష్మీ లాంటి స్కీంలను కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తే సివిల్ సప్లైలో, సింగరేణిలో, హామ్ రోడ్లలో, పిల్లలకు అన్నం పెట్టే గుడ్లలో, బట్టలలో స్కాంలు రేవంత్ సర్కాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఉపాధి కూలీలకు రూ.12వేలు ఇవ్వడం లేదని, మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న రేవంత్ కుటుంబం కోటీశ్వరులు అవుతున్నారని విమర్శించారు. జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ సంక్షేమ మంత్రులకు తెలియకుండా స్కాంలు జరుగుతున్నాయని, జిల్లా పరువు పోతుందని, రూ.2వేల కోట్ల స్కాం జరిగినా వారికి తెలియలేదని, ఇందులో ఎనుమల వారిదే రాజ్యం నడుస్తోందన్నారు. పతకాల అమలుకు ఖజానా డిస్కంలను తీసుకురానున్నారని ఆరోపించారు. ఇలాంటి రేవంత్ కి రైతులు ఎవరైనా ఓటు వేస్తారా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ రైతులు సైతం కేసీఆర్ ని గుర్తు చేస్తున్నారని, రేవంత్ కి ఓటు వేసేందుకు సిద్దంగా లేరని అన్నారు. రీఎంబర్స్ మెంట్ ని నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల్లో సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని హరీష్ రావు ఆరోపించారు. బలహీన వర్గాల పిల్లలంటే రేవంత్ కి ఇష్టం లేదన్నారు. ఇప్పటి వరకు సీఎం, మంత్రులు రీ ఎంబర్స్ మెంట్ విషయం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉన్నత విద్యకు 30లక్షల మంది విద్యార్థులు దూరమై ఒక తరం వెనుకబడే ప్రమాదం ఉందన్నారు. కాంట్రాక్టర్లకు డబ్బులు ఇస్తున్న రేవంత్ సర్కారు పేద విద్యార్థులకు ఇవ్వడానికి మనస్సు రావడం లేదని విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పిన రేవంత్ కేవలం 16వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని, నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రాన్ని సస్యశ్యామం చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని, 23 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందంచినట్లు తెలిపారు. ప్రాజెక్టులు, ప్రధాన కాలువలు పూర్తి చేసినట్లు, పిల్ల



లేదంటున్న రేవంత్ ఫుట్ బాల్ ఆటకి, అందాల పోటీలకు, వాస్తు పేరుతో సచివాలయ పనులకు, పలుచోట్ల క్యాంపు ఆఫీసులకు వందల కోట్లు ఖర్చు చేస్తున్నాడని, ఆయనకు రైతులు, మహిళల పట్ల, పేదల పట్ల మనస్సు లేదని విమర్శించారు. మన సొమ్మును ఇతర రాష్ట్రాల్లో ప్రకటనలకు, ఎన్నికలకు, ఢిల్లీకి పంపిస్తున్నాడని ఆరోపించారు. కమిషన్లు రావని పేదల పథకాలు అమలు చేయడం లేదని, కమిషన్లు వచ్చే పనులను రేవంత్ చేపడుతున్నాడని విమర్శించారు. ఓట్లు పెట్టి దేవుణ్ణి మోసం చేసిన ఎగువేతల రేవంత్ రెడ్డి విద్యార్థులను, నిరుద్యోగులను, రైతులను. మోసం చేస్తున్నాడని అన్నారు. రైతు భీమా ప్రీమియం గడువు పూర్తయి నాలుగు నెలలు అయిందని, రైతులు చనిపోతే ఆ కుటుంభాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డిస్కం పేరుతో రైతులకు విద్యుత్తు కోతను తీసుకురానున్నారని ఆరోపించారు. రిజర్వాయర్లు, మెయిన్ కెనాల్స్ పూర్తి చేసి వేల ఎకరాలకు నీరిచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వముదేనని, పిల్ల కాలువలు పూర్తి చేస్తే మరిన్ని ఎకరాలకు నీరు అందించవచ్చన్నారు. అడుగడుగునా రైతులను వేధిస్తున కాంగ్రెస్ కి ఎవరైనా ఓటు వేస్తారా అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టి వేధిస్తున్న కాంగ్రెస్ ఓటమి అంచున ఉందన్నారు. వద్దుకొనే తెలివిలేని రేవంత్ బీఆర్ఎస్ ని మొలకెత్తనివ్వనని అంటున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ పరిస్థితి ఆయనకు అర్థమైందని, ఆయన పని అయిపోయినందునే అధికారులు ఆయన మాట వినడం లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ బాగుండాలంటే బీఆర్ఎస్ మళ్లీ గెలిచి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ఆయన అన్నారు. తెలంగాణ ఉద్యమంలో మానకొండూర్ నియోజకవర్గ ప్రజలు మనస్ఫూర్తిగా ఉద్యమం చేసినారని, 2001లో అన్నీ జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను గెలుపొందిన నియోజకవర్గములో కరుడుగట్టిన కార్యకర్తలున్నారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటల నాణ్యమైన కరెంటు ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వంలో పదకొండు గంటలకు తగ్గిందని, రైతు డిస్కంను ప్రవేశపెట్టి ఆరు ఏడు గంటలకే కుదించనున్నారని తెలిపారు. రైతు డిస్కం పేరిట సోలార్, విండ్ పవర్ ఇచ్చేలా చూస్తున్నారని, రాత్రి పూట కరెంటు ఎలా వస్తుందని ఆయన ప్రశ్నించారు. రైతుల ఉసురు తీసేందుకు రైతు



కాలువలు అక్కడక్కడా పూర్తి చేస్తే మరిన్ని ఎకరాలకు నీరు అందించవచ్చన్నారు. ప్రతీ 20 ఏళ్లకోసారి ఓటరు జాబితా సవరణ (సర్) ని ఎన్నికల కమిషన్ చేపడుతుందని, దీనిపై బీఆర్ఎస్ కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. విచారణ సమయంలో అధికారుల వెంట బీఆర్ఎస్ బూత్ ఇంచార్జీలు ఉండాలని సూచించారు. రివిజన్ సమయంలో ఇతర పార్టీల వారి పేర్లను తొలగించే ప్రమాదం ఉందని, జాగ్రత్తగా గమనించాలని తెలిపారు. ఈ సమావేశమంలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణా రావు, ఇంచార్జీ రవీందర్ రావు, కార్పోరేటర్ కాల్వ మల్లేశం, నాయకులు రవీందర్ సింగ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, చల్ల హరిశంకర్, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, రావుల రమేష్, సిద్దం వేణు, శేఖర్ గౌడ్, స్వామిరెడ్డి, ఏకానందం, నాయిని వెంకట రెడ్డి, రవీంధర్ రెడ్డి, వెంకన్న, మహిపాల్, రెడ్డి, పొన్నం అనిల్ గౌడ్, గడ్డం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఒప్పందంపై అనుమానాలు చక్కర్లు

ఇరాన్‌కు 300 మిలియన్ డాలర్ల పరిహారం అంటూ వార్తలు
అలాంటిదేమీ లేదని ట్రూత్‌లో వెల్లడించిన ట్రంప్
అణ్వాయుధాలపై ఖచ్చితమైన ఒప్పందం కోసం పట్టు

న్యూయార్క్,జూన్16(సాక్ష్యం): అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరినప్పటికీ ఇంకా అనుమానాలు తొలగడం లేదు. అయితే అణ్వాయుధాలను కలిగి ఉండబోమని ఇరాన్ అంగీకరించినట్లు సోమవారం డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఇక తమ శాంతి ఒప్పందంలో భాగంగా ఇరాన్‌కు 300 మిలియన్ల డాలర్ల ఇవ్వనున్నట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. ట్రంప్ తన ట్రుత్ సోషల్‌లో ఈ మేరకు స్పందించారు. ఇరాన్‌తో కుదిరే డీల్‌లో.. అణ్వస్త్రాలను డెవలప్ చేయబోమని ఆ దేశం అంగీకరించ నున్నట్లు ట్రంప్ చెప్పారు. ఇరాన్, అమెరికా మధ్య ఎంవోయూ కుదిరినట్లు వార్తలు వెలుబడుతున్న విషయం తెలిసిందే. జెనీవాలో శుక్రవారం అధికారికంగా రెండు దేశాల మధ్య సంతకాలు జరిగే అవకాశం ఉన్నది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదటి రోజు నుంచి స్పష్టంగా ఉన్నారని, ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండబోదని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఓ వీడియో సందేశంలో పేర్కొన్నారు. అణ్వాయుధ సేకరణ కోసం ఇరాన్‌కు అనుమతి ఇవ్వబోమని ఇజ్రాయల్ ప్రధాని బెంజిమన్ నెతన్యహూ కూడా స్పష్టం చేశారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండవద్దు అని దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నానని, దీన్ని జీవిత మిషన్‌గా భావించానని అన్నారు. డీల్ కుదిరినా, కుదరకపోయినా, ఇరాన్ వద్ద న్యూక్లియర్ వెపన్ ఉండబోదన్నారు. ఇజ్రాయెల్ ప్రధానిగా తాను ఉన్నంత కాలం ఇలా జరగబోదన్నారు. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంతో పశ్చిమాసియాలో సంక్షోభానికి తెరపడింది. అయితే, ఈ ఒప్పందం ట్రంప్ యంత్రాంగంలో విభేదాలను బయటపెట్టింది. అణ్వాయుధాలు విడిచిపెట్టాలన్న నిర్ణయానికి ఇరాన్ కట్టుబడి ఉంటుందా అనే విషయంపై కొందరు సీనియర్ అధికారులు అనుమానాలు వ్యక్తంచేసినట్లు అమెరికా మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఒప్పందం తుది దశకు చేరుకుంటున్న నేపథ్యంలో..ఇరాన్ ఉద్దేశాలపై నిఘావర్గాల అంచనాలు ఆందోళనను రేకెత్తిస్తున్నాయని సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ ట్రంప్‌తో సహా ఉన్నతాధికారులను హెచ్చరించారు. ఒప్పందం నేపథ్యంలో శుద్ధి చేసిన యురేనియం విషయంలో ఇరాన్ అధికారుల మధ్య చర్చలకు.. వారు మధ్యవర్తులకు చేరవేస్తున్న సమాచారానికి ఎక్కడా పొంతన లేదని తెలుస్తోందన్నారు. అమెరికా డిమాండ్ చేస్తున్నట్లు



అణ్వాయుధాలు విడిచిపెట్టేందుకు ఇరాన్ సిద్ధంగా లేదని నిఘా వర్గాలు సూచిస్తున్నాయని తెలిపారు. రాట్‌క్లిఫ్‌తో పాటు విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్ లు కూడా అంతర్గత చర్చల్లో ఇదే ఆందోళనను వ్యక్తంచేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, పశ్చిమాసియా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్‌లు మాత్రం ఒప్పందానికి తమ మద్దతు తెలిపారు. కాగా, వైట్‌హౌస్ అధికారి ఒకరు ఈ వార్తలను ఖండించారు. శాంతి ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకునే ముందు ట్రంప్ భిన్నాభిప్రాయాలు పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగిఉండకూడదని, శుద్ధి చేసిన యురేనియంను వారి వద్ద ఉంచుకోకూడదు అన్న కీలక షరతులతో ఈ ఒప్పందం చాలా స్పష్టంగా ఉందన్నారు. ఈ విషయంపై సీఐఏ, విదేశాంగ శాఖ స్పందించేందుకు నిరాకరించాయి.

## ఆర్థిక సహాయం అందజేత

మాద్దులపల్లి, జూన్ 16 సాక్ష్యం: మండలంలోని తోపుచర్ల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన బొప్పని రాములు, కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు, మాద్దులపల్లి మండల యంగ్ డైనమిక్ లీడర్ గడ్డం పురుషోత్తం రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి కుటుంబానికి 5,000 రూపాయలు



ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు గౌను నిరంజన్, ఉప సర్పంచ్ వేముల నరేష్, నన్నెబోయిన లింగయ్య యాదవ్, కట్ట శ్రీనివాస్ రెడ్డి, , సామ కోటయ్య, మీసాల నాగేందర్, మంగ శీను, రాచూరి యాదయ్య, ఎల్లయ్య, శంకర్, నాగరాజు, లింగయ్య, ఆంజనేయులు, సైదులు, మబ్బుల్, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## భూపాలపల్లిలో ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన పవన్‌కుమార్‌కు సన్మానం

భూపాలపల్లి జిల్లా జూన్ 16 (సాక్ష్యం); భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన కే. పవన్‌కుమార్‌ను జిల్లా పద్మశాలి సంఘం నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు.



జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు క్యాతం సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బీమనాదుని సత్యనారాయణ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఇటీవల జరిగిన పోలీసు శాఖ బదిలీల్లో భాగంగా మహదేవ్ పూర్ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహించిన పవన్‌కుమార్ భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. అలాగే యువత మత్తు పదార్థాలు, గంజాయి వంటి వ్యసనాలకు బానిస కాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అవసరమైన చోట కౌన్సెలింగ్ అందించి సమాజానికి ఆదర్శప్రాయమైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు బాగవతం భిక్షపతి, తౌటం ప్రభాకర్, గోనె భాస్కర్, కోశాధికారి వీరస్వామి, పట్టణ కార్యదర్శి షేర్‌కుమార్, కాటారం మండల అధ్యక్షుడు గాదె రమేష్, పినుమళ్ల రమేష్, సంతోష్‌తో పాటు పలువురు పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, SUNEETHA NAALLA (old name), W/o. N J N D SAI CHAND, H.No: 16-01-120, Bhagavandas Colony, Bhadrachalam, Bhadradri Kothagudem, Telangana - 507111, I have changed my name as SUNEETHA PEDAMALLA (New Name) W/o. N J N D SAI CHAND in Passport and all the records.

**కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్**
బ్రాంచ్: ఇంటి నెం. 58 ఎంఐజి, 1వ అంతస్తు, ఫేజ్-2 సైట్ 1, పోతిరెడ్డిపల్లి బైపాస్ రోడ్, సంగారెడ్డి- 502295,
ఫోన్ నెంబ. 08455 -277550,
ఇ-మెయిల్: Sangareddy@canfinhomes.com

**సవరణ**
సాక్ష్యం & ది సౌత్ ఇండియా టైమ్స్, హైదరాబాద్ ఎడిషన్‌లో 04-06-2026న ప్రచురించబడిన "స్థిరాస్తుల విక్రయ ప్రకటన"ను దయచేసి రెఫర్ చేయగలరు. ఇందులో రుణగ్రహీత/లు అయిన 1) దొమ్మా ఆనంద్ కుమార్ ఖాతాకు సంబంధించి వేలం తేది 08-07-2026గా చదవవలసిందిగా కోరుతున్నాము మరియు 2) షేక్ కరీం తండ్రి: షేక్ అమీర్ మరియు అహ్మదీ బేగం ఖాతాకు సంబంధించి దరఖాస్తుదారు షేక్ కరీం పేరు పొరపాటున ప్రకటనలో చేర్చబడలేదు. అన్ని ఇతర నియమ నిబంధనలు యాథావిధిగా చదువుకొనగలరు.
సం/- అధీకృత అధికారి
కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

**వృద్ధి ఫిన్‌సర్వ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్**
రిజిస్టర్డ్ & కార్పొరేట్ కార్యాలయ చిరునామా - 1వ అంతస్తు, నెం. 38, జికెఆర్ సప్తగిరి వైష్టధామ, 12వ క్రాస్, ఆఫీస్ సిబిఐ రోడ్, గంగానగర్, బెంగళూరు 560032

**డిమాండ్ నోటీసు**
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (ఇకపై 'చట్టం' అని పిలవబడును) లోని సెక్షన్ 13(2) కింద నోటీసు

**విషయం: వృద్ధి ఫిన్‌సర్వ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ ద్వారా మీకు మంజూరు చేయబడిన ఆర్థిక సహాయం,-అసలు, వడ్డీ మొదలైన వాయిదాల చెల్లింపులో మీరు విఫలమైనారు.**

మేము, **వృద్ధి ఫిన్‌సర్వ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్,** సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 లోని సెక్షన్ 13(2) క్రింద, దిగువ తెలిపిన విధంగా బ్యాంకుకు అందించిన చిరునామాలకు అక్నాలెడ్జ్‌మెంట్ డ్యూతో కూడిన రిజిస్టర్డ్ పోస్ట్ (RPAD) ద్వారా డిమాండ్ నోటీసులను జారీ చేయడమైనది. దిగువ పేర్కొన్న చిరునామాలలో గ్రహీతలు అందుబాటులో లేకపోవడం వల్ల/ RPAD ద్వారా పంపిన నోటీసుల సేవను తప్పించుకోవడం వల్ల నోటీసు తిరిగి వచ్చినవి. కావున నోటీసును అందజేయబడలేదు. బ్యాంకు ఇచ్చిన చిరునామాలలో సదరు డిమాండ్ నోటీసులను అంటించడం ద్వారా జారీ చేయబడినది. సదరు నోటీసులలోని విషయాలు దిగువన తెలుపబడినవి.

**రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/హామీదారు పేరు మరియు చిరునామా: 1. శ్రీ బోయ నరసింహులు** తండ్రి ఎన్ నారాయణస్వామి, ఇంటి నెం. 3-3-16/1, ఘంటా స్ట్రీట్, గద్వాల్ మం॥, గద్వాల్, మహబూబ్‌నగర్, తెలంగాణ-509125. **2. శ్రీమతి బోయ జయ లక్ష్మి** భర్త బోయ నరసింహులు, ఇంటి నెం. 3-3-16/1, ఘంటా స్ట్రీట్, గద్వాల్ మం॥, గద్వాల్, మహబూబ్‌నగర్, తెలంగాణ-509125. **3. శ్రీ బోయ నాగరాజు (హామీదారు)** తండ్రి కొల్లు జయరామయ్య, ఇంటి నెం. 3-3-16/1, ఘంటా స్ట్రీట్, గద్వాల్ మం॥, గద్వాల్, మహబూబ్‌నగర్, తెలంగాణ-509125. **4. శ్రీమతి బోయ ఈరమ్మ (హామీదారు)** తండ్రి గట్టు తిమ్మప్ప, ఇంటి నెం. 3-3-16/1, ఘంటా స్ట్రీట్, గద్వాల్ మం॥, గద్వాల్, మహబూబ్‌నగర్, తెలంగాణ-509125.

| క్ర.సం. | ఖాతా నెం. | మొత్తం (రూ.) | 08.06.2026 నాటికి మీరు తిరిగి చెల్లించవలసిన బకాయి మొత్తం |
|---|---|---|---|
| 1. | VHF1000000 09399 | 12,00,000/- | రూ. 10,28,000/- మరియు దానిపై 09/06/2026 నుండి వర్తింపుతో ఒప్పందపు రేట్ల ప్రకారం తదుపరి వడ్డీతో పాటు, చెల్లింపు లేదా వసూలు జరిగే వరకు అయ్యే ఖర్చులు, ఛార్జీలు, ఇతర వ్యయాలతో కలిపి. |

**08.06.2026 నాటికి బకాయి మొత్తం రూ. 10,28,000/- (రూపాయలు పది లక్షల ఇరవై ఎనిమిది వేలు మాత్రమే)** మరియు దానిపై **09.06.2026** నుండి వర్తింపుతో ఒప్పందపు రేట్ల ప్రకారం తదుపరి వడ్డీతో పాటు, చెల్లింపు లేదా వసూలు జరిగే వరకు అయ్యే ఖర్చులు, ఛార్జీలు, ఇతర వ్యయాలతో కలిపి.
**ఎన్‌పిఎ తేది: 05.06.2026** **డిమాండ్ నోటీసు తేది: 11.06.2026** **బ్రాంచ్: కర్నూలు**
**(రుణగ్రహీత యొక్క తాకట్టు పెట్టిన ఆస్తుల వివరాలు మరియు తనఖా పెట్టిన ఆస్తుల వివరాలు)**
శ్రీ బోయ నాగరాజు @ బి నాగరాజు గారు శ్రీ బోయ నరసింహులుకు అనుకూలంగా 18.11.2024న వ్రాసి ఇచ్చి 19.11.2024న నమోదు చేయబడిన రిజిస్టర్డ్ ఫ్యామిలీ గిఫ్ట్ (సెటిల్‌మెంట్) డీడ్ నెం. 12670/2024 గల ఆస్తి. రిజిస్టర్డ్ జిల్లా మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల్ రెవెన్యూ జిల్లా, గద్వాల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయము, గద్వాల్ మం॥, గద్వాల్ టౌన్, గంటా స్ట్రీట్, కూల్చివేసిన ఇంటి నెం. 3-3-16, ప్రస్తుతమున్న ఖాళీ స్థలం కొలత 37'×35' అడుగులు, మొత్తం 143.88 చ॥గ॥లు లేదా 120.30 చ॥మీ॥ల స్థలం. దీనిలో, గద్వాల్ మున్సిపాలిటీ పరిధిలోని పిటిఐ నెం. 1036000640 గల కూల్చివేయబడిన ఇల్లు, ప్రస్తుతం ఖాళీ స్థలం, సరిహద్దులు: తూర్పు: శీలా రాములు కు చెందిన ఇల్లు, పడమర: రోడ్డు, ఉత్తరం: పెద్ద వెంకన్నకు చెందిన ఇల్లు, దక్షిణం: రోడ్డు మరియు మేఘమాల భర్త ప్రతాప్ యొక్క ఇల్లు.

ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజుల వ్యవధిలోగా, పైన పేర్కొన్న సంబంధిత మొత్తాన్ని **వృద్ధి ఫిన్‌సర్వ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు** చెల్లించవలసిందిగా మిమ్మల్ని కోరడమైనది. విఫలమైనచో, **వృద్ధి ఫిన్‌సర్వ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారు రుణగ్రహీతలు మరియు హామీదారుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులను స్వాధీనం చేసుకోవడంతో సహా, సదరు చట్టంలోని నిబంధనల ప్రకారం సదరు సెక్యూర్డ్ ఆస్తులపై అవసరమైన చర్యలు తీసుకొనెదరు. చట్టం ప్రకారం **వృద్ధి ఫిన్‌సర్వ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు** అందుబాటులో ఉన్న అధికారాలలో (i) రుణగ్రహీత/హామీదారులు/తనఖాదారు యొక్క సెక్యూర్డ్ ఆస్తులను స్వాధీనం చేసుకునే అధికారం, సెక్యూర్డ్ ఆస్తులను వసూలు చేయడానికి లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం ద్వారా బదిలీ చేసే హక్కులతో సహా ఉన్నాయి మరియు **వృద్ధి ఫిన్‌సర్వ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** ద్వారా సెక్యూర్డ్ ఆస్తుల బదిలీ జరిగినప్పుడు, సదరు బదిలీ మీ ద్వారా జరిగినట్లుగా, బదిలీ చేయబడిన సెక్యూర్డ్ ఆస్తికి సంబంధించి లేదా దానిలో ఏదేని బదిలీ గ్రహీతకు హక్కులు సంక్రమిస్తాయి. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) నిబంధనల ప్రకారం, జతచేయబడిన డిమాండ్ నోటీసులో సూచించబడిన మరియు బ్యాంకుకు తనఖా/ తాకట్టు పెట్టబడిన సెక్యూర్డ్ ఆస్తులలో దేనినైనా, బ్యాంకు యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా, అమ్మకం, లీజు లేదా మరే ఇతర మార్గంలోనైనా (మీ సాధారణ వ్యాపార కార్యకలాపాలలో తప్ప) బదిలీ చేయడం మిమ్మల్ని ఇందుమూలంగా నిషేధించబడింది. ఈ నోటీసు సదరు చట్టంలోని సెక్షన్ (13)2 నిబంధనల ప్రకారం జారీ చేయబడింది.

**తేది: 15.06.2026** **సం/- అధీకృత అధికారి**
**ప్రదేశం: బెంగళూరు** **వృద్ధి ఫిన్‌సర్వ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్,**

# ఏయూలో ఆందోళన రేపుతున్న విజిలెన్స్ దర్యాప్తు

సాక్ష్యం , విశాఖపట్నం

రాష్ట్రంలో అత్యంత పురాతన, ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఒకటైన ఆంధ్రా యూనివర్సిటీలో కొనసాగుతున్న విజిలెన్స్ దర్యాప్తు కొత్త చర్చలకు తెరలేపింది. గతంలో జరిగిన నియామకాలు, పరిపాలనా నిర్ణయాలు, వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై జరుగుతున్న విచారణ ప్రస్తుతం యూనివర్సిటీ వర్గాల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. ముఖ్యంగా విచారణ నిర్వహిస్తున్న తీరుపై అధ్యాపకులు, సిబ్బంది అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. సాధారణంగా విశ్వవిద్యాలయాల్లో తీసుకునే కీలక నిర్ణయాలు పాలక మండళ్ల ఆమోదంతో అమల్లోకి వస్తాయి. వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌తో పాటు ప్రభుత్వ ప్రతినిధులు సభ్యులుగా ఉండే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియలు పూర్తవుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో గత నిర్ణయాలపై నేరుగా విజిలెన్స్ దర్యాప్తు చేపట్టడం అరుదైన పరిణామంగా విద్యావర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో ఏవైనా అభ్యంతరాలు వచ్చినప్పుడు ప్రాథమిక స్థాయిలో నిపుణుల కమిటీలు లేదా విశ్రాంత ఉన్నతాధికారులతో విచారణ జరిపి, నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే పద్ధతి అమల్లో ఉండేదని చెబుతున్నారు. అయితే, ఈసారి అలాంటి మధ్యంతర ప్రక్రియ లేకుండానే విజిలెన్స్ రంగంలోకి దిగడం చర్చనీయాంశమైంది. ముఖ్యంగా అధ్యాపక నియామకాలకు సంబంధించిన ఫైళ్ల పరిశీలనలో భాగంగా స్క్రూటినీ కమిటీ సభ్యులు, సబ్జెక్ట్ నిపుణులు, గతంలో వివిధ హోదాల్లో పనిచేసిన అధికారులు సైతం విచారణకు హాజరు కావాల్సిందిగా ఆదేశాలు అందుకున్నట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం నిర్వహించిన ఎంపిక ప్రక్రియల్లో పాల్గొన్న వారినే ప్రశ్నించడం వల్ల భవిష్యత్తులో నిపుణులు ఇలాంటి బాధ్యతలు స్వీకరించేందుకు వెనుకంజ వేసే పరిస్థితులు ఏర్పడతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా, విచారణ తీరుపై కొందరు అధ్యాపకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. విచారణ పేరుతో పలుమార్లు హాజరుకావాల్సి రావడం, ఎక్కువసేపు వేచి ఉండాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని వారు చెబుతున్నట్లు తెలిసింది. ఈ కారణంగా కొంతమంది సెలవులు తీసుకోగా, మరికొందరు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని యూనివర్సిటీ వర్గాలు పేర్కొంటున్నాయి. దళిత, గిరిజన వర్గాలకు చెందిన కొందరు అధ్యాపకులు తమకు ఎదురైన ఇబ్బందులపై సంబంధిత రాజ్యాంగ సంస్థలను ఆశ్రయించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. అయితే, దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

మరోవైపు, ప్రొఫెసర్ స్థాయి అధికారులతో వ్యవహరించే విషయంలో పాటించాల్సిన పరిపాలనా విధివిధానాలపై కూడా చర్చ మొదలైంది. విశ్వవిద్యాలయ యంత్రాంగం ద్వారా సమాచారాన్ని చేరవేయకుండా నేరుగా సంప్రదింపులు జరపడం సరైన పద్ధతి కాదని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే, విచారణలో పూర్తి సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, కానీ అది పరస్పర గౌరవం, నిబంధనల పరిధిలో జరగాలని పలువురు అధ్యాపకులు భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ప్రజాధనం వినియోగించే సంస్థల్లో పారదర్శకతను నిర్ధారించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మరో వర్గం అభిప్రాయపడుతోంది. అక్రమాలు జరిగి ఉంటే అవి వెలుగులోకి రావాల్సిందేనని, అదే సమయంలో విచారణ వల్ల విద్యాసంస్థల ప్రతిష్ఠ దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా రంగంలో కీలక స్థానంలో ఉన్న ఆంధ్రా యూనివర్సిటీలో కొనసాగుతున్న ఈ పరిణామాలు ఇప్పుడు విద్యావేత్తలు, విద్యార్థులు, పరిపాలనా వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి. నిష్పాక్షిక దర్యాప్తుతో పాటు విశ్వవిద్యాలయ స్వయంప్రతిపత్తి, విద్యావేత్తల గౌరవం కాపాడేలా ప్రభుత్వం సమతుల్య వైఖరిని అవలంబించాలని పలువురు కోరుతున్నారు

## విశాఖలో మోడిఫైడ్ సైలెన్సర్లపై ప్రత్యేక డ్రైవ్ :శంఖబ్రత బాగ్చి

–142 సైలెన్సర్లు స్వాధీనం.. 73 బైక్ రేసర్లపై కేసులు నమోదు

సాక్ష్యం , విశాఖపట్నం

విశాఖ నగరంలో యువత ఖరీదైన ద్విచక్ర వాహనాలకు కంపెనీ అమర్చిన





సైలెన్సర్లను తొలగించి అధిక శబ్దం, పొగను వెదజల్లే మోడిఫైడ్ సైలెన్సర్లను ఉపయోగించడం వల్ల ప్రజల్లో ఆందోళన నెలకొంటోందని నగర నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం పోలీస్ కమిషనర్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు ఈ శబ్ద కాలుష్యంపై పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 142 మోడిఫైడ్ సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నామని . అలాగే రాత్రి వేళల్లో ఎదురుగా వచ్చే వాహనదారులకు ఇబ్బందులు కలిగించే విధంగా అనధికారికంగా అమర్చిన 89 హై-బీమ్ లైట్లను తొలగించామని . ద్విచక్ర వాహనాలకు అమర్చిన మొబైల్ స్టాండ్లు డ్రైవర్ దృష్టి మరల్చి ప్రమాదాలకు దారితీస్తున్న నేపథ్యంలో 270 మొబైల్ స్టాండ్లను తొలగించామని తెలిపారు. మరోవైపు బీచ్ రోడ్డు సహా నగరంలోని పలు ప్రాంతాల్లో బైక్ రేసింగ్‌కు పాల్పడిన 73 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. వారి డ్రైవింగ్ లైసెన్సులను సస్పెండ్ చేయాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌కు సిఫార్సు చేసినట్లు వెల్లడించారు . మోటారు వాహన చట్టం-1988 ప్రకారం మోడిఫైడ్ సైలెన్సర్లు, హై-బీమ్ లైట్ల వినియోగంపై జైలు శిక్ష, జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ జప్తు వంటి కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. మొబైల్ స్టాండ్ల వినియోగం, బైక్ రేసింగ్‌లపై కూడా చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం స్వాదీనం చేసుకున్న మోడిఫైడ్ సైలెన్సర్లను ధ్వంసం చేసారు. ఇదిలా ఉండగా, రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మంజూరు చేసిన రూ.6.75 లక్షల నిధులతో ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి 450 వేసవి కిట్లను నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, అందజేశారు.

## పర్యాటక హబ్‌గా కైలాసగిరి అభివృద్ధి: వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

సాక్ష్యం , విశాఖపట్నం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు విశాఖపట్నంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ తెలిపారు. మంగళవారం సాయంత్రం అదనపు కమిషనర్ దాట్ల కీర్తి, ఓఎస్డీ కృష్ణ నాయక్, కార్యదర్శి మురళీకృష్ణలతో కలిసి ఆయన కైలాసగిరిని సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పరిశీలించిన ఆయన, దుకాణ సముదాయం నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం



చేయాలని అధికారులను ఆదేశించారు. త్రిశూల్ ప్రాంతానికి సందర్శకులు సులభంగా చేరుకునేలా బ్యాటరీ కార్లను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అలాగే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పర్యాటక ఆకర్షణల నమూనాలను ఏర్పాటు చేసే అవకాశాలపై ప్రతిపాదనలు రూపొందించాలని చెప్పారు.

అనంతరం కైలాసగిరి వ్యాపారులతో సమావేశమైన ప్రణవ్ గోపాల్, గ్లాస్ బ్రిడ్జి, త్రిశూల్ ఏర్పాట్లతో సందర్శకుల సంఖ్య గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. పర్యాటకులను మరింత ఆకట్టుకునే కొత్త ప్రాజెక్టులు త్వరలో అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. కైలాసగిరికి మంచి పేరు తీసుకువచ్చే విధంగా అందరూ సహకరించాలని వ్యాపారులకు సూచిస్తూ, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ జేసీపీ సింగ్, డీఈ శంకరరావు, మూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

## విశాఖకు నీరు, విద్యుత్ కొరత ఉండదు: ఎంపీ ఎం. శ్రీభరత్

– డేటా సెంటర్లపై అన్ని దుష్ప్రచారాలే

సాక్ష్యం , విశాఖపట్నం

గ్రేటర్ విశాఖపట్నం పరిధిలో ప్రతిపాదిత డేటా సెంటర్ల ఏర్పాటుతో నగరానికి నీరు, విద్యుత్ కొరత ఏర్పడుతుందన్న ఆందోళనలకు తావులేదని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీభరత్ స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విశాఖ పరిధిలో పరిశ్రమలు, టౌన్‌షిప్‌లు, గృహ అవసరాల కోసం రోజుకు 470–480 ఎంఎల్‌డీల నీటి అవసరం ఉండగా, 410 ఎంఎల్‌డీల సరఫరా జరుగుతోందని ఆయన తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయి, అదనపు మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తే రాబోయే రెండు నుంచి మూడు సంవత్సరాల్లో గ్రేటర్ విశాఖపట్నం పరిధికి 2,110 ఎంఎల్‌డీల నీటి సామర్థ్యం లభిస్తుందని పేర్కొన్నారు. డేటా సెంటర్లు, స్టీల్ ప్లాంట్ అవసరాలు తీర్చిన తర్వాత కూడా వందల ఎంఎల్‌డీల నీరు మిగులుతుందని వివరించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని సముద్రపు నీటి శుద్ధీకరణ (డిశాలినేషన్) ప్రాజెక్టులపైనా ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. పుడిమడక ప్రాంతంలో తొలి దశలో 100 ఎంఎల్‌డీల సామర్థ్యంతో డిశాలినేషన్ ప్లాంట్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలు సిద్ధమైనట్లు వెల్లడించారు. ఈ ప్లాంట్ ద్వారా శుద్ధి చేసిన నీటిని పారిశ్రామిక అవసరాలకు వినియోగించనున్నట్లు చెప్పారు.

విద్యుత్ కొరతపై వ్యక్తమవుతున్న ఆందోళనలను కూడా ఆయన తోసిపుచ్చారు. ప్రస్తుతం నగరంలో 1.5 నుంచి 2 గిగావాట్ల విద్యుత్ వినియోగం జరుగుతోందని, రాష్ట్రంలో అమలవుతున్న విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా 2029–30 నాటికి అదనంగా 50 గిగావాట్ల సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. డేటా సెంటర్లకు అవసరమయ్యే విద్యుత్‌ను ప్రధానంగా పునరుత్పాదక ఇంధన వనరుల నుంచే సమకూర్చనున్నట్లు తెలిపారు. పర్యావరణ అనుమతుల విషయంలో జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని శ్రీభరత్ స్పష్టం చేశారు. తర్లువాడ, రాంబిల్లి ప్రాంతాలకు 2026 ఏప్రిల్ 18న, ముడసరలోవ–అడవివరం ప్రాంతాలకు జూన్ 10న పర్యావరణ అనుమతులు లభించినట్లు వెల్లడించారు. డేటా సెంటర్ల వల్ల శబ్ద కాలుష్యం ఏర్పడకుండా అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం అకౌస్టిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థలు ఏర్పాటు చేస్తారని తెలిపారు.

డేటా సెంటర్లు దేశ భద్రత, డేటా స్థానికీకరణ పరంగా అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. భారతీయుల డేటా విదేశీ సర్వర్లపై ఆధారపడకుండా దేశంలోనే భద్రపరచడం ద్వారా వేగవంతమైన సేవలు, తక్కువ వ్యయం, అధిక భద్రత సాధ్యమవుతుందని వివరించారు. సెమీకండక్టర్ల తయారీ నుంచి డేటా నిల్వ వరకు ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు ఇవి దోహదపడతా



యని చెప్పారు.

గూగుల్ భాగస్వామ్యంతో సుమారు 15 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందని శ్రీభరత్ తెలిపారు. నిర్మాణ దశలో 40 వేల నుంచి 50 వేల మందికి ఉపాధి లభిస్తుందని, కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత ప్రత్యక్షంగా 1,000 నుంచి 2,000 ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ డేటా సెంటర్ల అభివృద్ధి ద్వార బ్యాంకింగ్, ఫిన్‌టెక్, కృత్రిమ మేధ (ఏఐ) స్టార్టప్‌లు, అనుబంధ ఐటీ సంస్థలు విశాఖకు తరలివచ్చే అవకాశముందని, దీంతో నగరంలో బలమైన డిజిటల్ ఎకోసిస్టమ్ ఏర్పడుతుందని తెలిపారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించి జరుగుతున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని, అన్ని అంశాలను శాస్త్రీయ అధ్యయనాలు, భవిష్యత్తు అవసరాల అంచనాల ఆధారంగానే ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని ఎంపీ శ్రీభరత్ స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పాల్గొన్నారు.

## బీసీ బాలికల విద్యకు భరోసా.. ఆరు గురుకుల పాఠశాలలు జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్

సాక్ష్యం, విశాఖపట్నం



బీసీ బాలికల ఉన్నత విద్యకు మరింత ప్రోత్సాహం కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం జీవో జారీ చేసినట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. విజయనగరం జిల్లా కొత్తవలస, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా గోలగముడి, అన్నమయ్య జిల్లా కలికిరి, వైఎస్సార్ కడప జిల్లా ఓనిపెంట, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా ఆత్మకూరు, శ్రీ సత్యసాయి జిల్లా నాసనకోటలోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఈ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ కోర్సులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఒక్కో గ్రూపులో 40 మంది విద్యార్థినులకు ప్రవేశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ప్రతి కళాశాలలో ఎనిమిది మంది పార్ట్‌టైమ్ అధ్యాపకులతో పాటు, ఒక కుక్, ఒక ల్యాబ్ అసిస్టెంట్‌ను అవుట్‌సోర్సింగ్ విధానంలో నియమించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లను కళాశాల ప్రిన్సిపాళ్లుగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు వివరించారు. బీసీ గురుకుల విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యతో పాటు భోజనం, వసతి సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని మంత్రి సవిత తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బాలికల విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా, త్వరలో రూ.500 కోట్ల వ్యయంతో మరో పది ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు.

# ఎంఎస్‌ఎంఈ రంగంలో ఏపీకి జాతీయ గుర్తింపు

సాక్ష్యం , విశాఖపట్నం.

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) రంగంలో ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించిందని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వంలో గత రెండేళ్లలో ఎంఎస్‌ఎంఈ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు అమలు చేసి పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి, ఆదాయ వృద్ధిని కేంద్రంగా చేసుకుని ప్రభుత్వం అభివృద్ధి వ్యూహాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో వేలాది ఎంఎస్‌ఎంఈ యూనిట్లు కార్యకలాపాలు నిర్వహిస్తూ లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయని చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు



చర్యలు చేపట్టిన ప్రభుత్వం ఇప్పటికే 792 పరిశ్రమలకు భూ కేటాయింపులు చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా లక్షకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు సృష్టించనున్నట్లు వెల్లడించారు. ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్ విధానం ద్వారా రూ.1,900 కోట్లకు పైగా పెట్టుబడులు, 16,500 మందికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎంఎస్‌ఎంఈలకు ఆర్థికంగా అండగా నిలుస్తూ గత రెండేళ్లలో రూ.1.90 లక్షల కోట్లకు పైగా బ్యాంకు రుణాలు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. సీజీటీఎంఎస్ఈ, ప్రధాన్ మంత్రి ముద్ర, పీఎంఎఫ్ఎంఈ, స్టాండ్-అప్ ఇండియా వంటి పథకాల ద్వారా వేలాది యూనిట్లకు మద్దతు అందించినట్లు చెప్పారు. యువతలో వ్యవస్థాపకతను ప్రోత్సహించేందుకు సీఎం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అడ్వాన్స్‌మెంట్ ప్రోగ్రామ్ (సీఎంఏపీ)ను అమలు చేస్తున్నామని తెలిపారు. సెర్ప్ ద్వారా మహిళా సాధికారతకు ప్రభుత్వం విశేష ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాలకు రూ.63 వేల కోట్లకు పైగా బ్యాంకు లింకేజ్ అందించగా, శ్రీనిధి ద్వారా రూ.9,300 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో ఐదు లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ప్రవాసాంధ్రుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న మంత్రి, ఏపీఎన్ఆర్‌టీఎస్ ద్వారా విదేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొన్న పలువురికి సహాయం అందించడంతో పాటు ఫిర్యాదుల పరిష్కారం, బీమా, చట్టపరమైన మద్దతు వంటి సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధిలో ఎంఎస్‌ఎంఈలు, మహిళలు, ప్రవాసాంధ్రులు కీలక పాత్ర పోషించేలా ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను కొనసాగిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

## ప్రాజెక్టును నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

వాణి ప్రసాద్ ఐఏఎస్

యాదగిరిగుట్ట, సాక్ష్యం న్యూస్:

యాదాద్రి భువనగిరి జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల పురోగతిని తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీమతి వాణి ప్రసాద్, ఐఏఎస్ గారు మంగళవారం పరిశీలించారు. ముందుగా యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలోని రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న హరిత హోటల్‌లో



జరుగుతున్న ఆధునీకరణ పనులను ఆమె పరిశీలించారు. సందర్శకులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని ప్రసిద్ధ సోమేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి, ఆ ప్రాంతంలో పర్యాటక రంగ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై , ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, పర్యాటక ఆకర్షణగా మరింత అభివృద్ధి చేసే అవకాశాలపై చర్చించారు. తదుపరి బస్వాపూర్ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి పరిశీలించారు. ప్రకృతి అందాలను వినియోగించుకుని పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అలాగే భువనగిరి కోట వద్ద ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న రోప్‌వే ప్రాజెక్టు పనులను పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టును నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో పర్యాటక శాఖ డైరెక్టర్ రంజిత్ నాయక్, ఆర్కియాలజీ డైరెక్టర్ అర్జున్ రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత తహసీల్దార్లు, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి మరియు జిల్లా పర్యాటక శాఖ ఇన్‌చార్జి అధికారి చిలుకూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి (సాక్ష్యం)జూన్ 16,:

రాష్ట్రంలో విద్యాభివృద్ధి దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని చెన్నూరు మండల కేంద్రంలో గల ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ



ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యావ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల- కళాశాలను సందర్శించి పాఠశాలలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి విద్యా సంవత్సరం ప్రారంభమైనందున పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు సోమనపల్లి గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పరిశీలించిన అనంతరం గ్రామంలో అసంపూర్తిగా ఉన్న అంగన్వాడి కేంద్రం భవన నిర్మాణాన్ని పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. గ్రామంలో వి.ఓ. భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేసి ప్రభుత్వ భూముల ఆక్రమణపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి మండలంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి వివరాలను సమీక్షించారు. మండలంలో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం చెన్నూర్ పట్టణంలో అమృత్ 2.0 పథకం కింద చేపట్టిన నీటి ట్యాంకు నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తో కలిసి పరిశీలించి పనులు వేగవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్, మండల పంచాయతీ అధికారి అజ్మత్ అలీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్‌పై ముమ్మర దర్యాప్తు

కాకినాడ,జూన్16: కాకినాడ జిల్లా తుని చిన్నారి జ్ఞానేశ్వరి కేసుపై పెద్దాపురం డీఎస్పీ తిలక్ కీలక విషయాలు వెల్లడించారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు. మంగళవారం డీఎస్పీ తిలక్ మీడియాతో మాట్లాడారు. 35 నిమిషాల వ్యవధిలో బాలిక మిస్సయిందని చెప్పుకొచ్చారు. చిన్నారి జ్ఞానేశ్వరి సమాచారం తెలిసిన వెంటనే గాలింపు చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. జీడీ పిక్కలు ఏరుకునే వారిని కూడా పిలిచి చిన్నారి గురించి విచారించామని తెలిపారు. పాప మిస్సయిన చోట బొమ్మలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. చిన్నారికి సంబంధించి తప్పుడు వార్తలను ప్రచురించే వారిపై లీగల్‌గా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తిలక్ హెచ్చరించారు. పాపను జంతువులు తీసుకెళ్లాయనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. జీడి పిక్కలను ఏరుకునే సంచార జాతుల వారిపై నిఘా పెట్టి విచారణ చేస్తున్నామని తెలిపారు.

# అద్భుత నగరంగా అమరావతి నిర్మాణం

- అంతర్జాతీయ మౌలిక వసతులతో తీర్చిదిద్దుతున్నాం
- పీపుల్ ఫస్ట్ మా విధానంలో నాలెడ్జ్ సిటీగా చేస్తున్నాం
- జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థల ఏర్పాటు
- క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రత్యేక ఆకర్షణలు
- లీడర్‌షిప్ ప్లీనరీ-2లో చంద్రబాబు ప్రసంగం
- సింగపూర్‌తో ఏపికి మంచి సంబంధాలు
- మూడు దశాబ్దాలుగా కలిసి పనిచేస్తున్నాం
- పార్ట్‌నర్‌షిప్ సన్నాహక సమ్మిట్‌లో చంద్రబాబు

అమరావతి,జూన్16: పీపుల్ ఫస్ట్ మా విధానమని... ఈక్విటీ, నేచర్, ఆపర్చునిటీ, లివబుల్ సిటీగా అమరావతి ఉంటుందని సీఎం చంద్రబాబు తెలిపారు. అంతర్జాతీయ మౌలిక వసతులతో, అవకాశాల వేదికగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామన్నారు. సింగపూర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో పాల్గొన్న సీఎం.. లీడర్‌షిప్ ప్లీనరీ-2లో 'కెన్ స్మార్ట్ సిటీస్ లవ్ హ్యూమన్స్' అనే అంశంపై ప్రసంగించారు. అమరావతిని నాలెడ్జ్ సిటీగా చేస్తున్నామని.. జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలను తీసుకువస్తున్నామని అన్నారు. క్వాంటం కంప్యూటింగ్ హబ్, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రత్యేక ఆకర్షణలన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా అమరావతి నిర్మాణం అవుతోందన్నారు. అమరావతిని సందర్శించి.. సరికొత్త ఆలోచనలతో అవకాశాలను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. 25 ఏళ్ల క్రితం ఐటీ గురించి మాట్లాడానని... ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్‌తో ఈరోజు తెలుగువాళ్లు తలసరి ఆదాయంలో ముందున్నారని తెలిపారు. ఇప్పుడు ఏఐ వచ్చిందన్నారు. నాడు సైబరాబాద్‌ను అభివృద్ధి చేశామని... నేడు తెలంగాణకు ప్రధాన ఆదాయవనరుగా మారిందని చెప్పారు. రాష్ట్ర విభజనతో మరో నగరాన్ని నిర్మించే అవకాశం వచ్చిందని... అమరావతిని గ్రీన్ ఫీల్డ్ సిటీగా నిర్మిస్తున్నామని వెల్లడించారు. కృష్ణానది, ఇన్నర్ - ఔటర్ రింగ్ రోడ్లు, ఐకానిక్ బ్రిడ్జిలతో అద్భుతంగా అమరావతి రూపుదిద్దుకుంటోందని వివరించారు. స్పోర్ట్స్, ఫైనాన్సియల్, నాలెడ్జ్, జస్టిస్, టూరిజం, హెల్త్, మీడియా వంటి కాన్సెప్ట్ తీసుకున్నామన్నారు. ఒకే ఒక్క పిలుపుతో రాజధాని కోసం రైతులు 35 వేల ఎకరాలను అప్పగించారని... వాటిలో కొంత భాగాన్ని అభివృద్ధి చేసి రైతులకు తిరిగి ప్లాట్లు ఇస్తున్నామన్నారు. 21 కి.మీ పొడవునా వాటర్ ఫ్రంట్ నగరంగా అమరావతి ఉంటుందని తెలిపారు. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్, అండర్ గ్రౌండ్ యుటిలిటీస్, గ్రీన్ ఎనర్జీ, నెట్ జీరో లక్ష్యంగా రాజధాని నిర్మాణం జరుగుతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. సైబరాబాద్‌లో నాడు ఎకరం రూ.2 లక్షలు ఉంటే... నేడు రూ.200 కోట్లకు పెరిగిందన్నారు. అభివృద్ధి జరిగితే సంపద సృష్టి సాధ్యమవుతుందనేందుకు సైబరాబాద్ నిదర్శనమని తెలిపారు. సింగపూర్‌తో భారత్‌కు, ప్రత్యేకించి ఏపీకి మంచి సంబంధాలు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ అంటే తనకు చాలా అభిమానమని పేర్కొన్నారు. మూడు దశాబ్దాల క్రితం నుంచే సింగపూర్‌తో కలిసి పనిచేస్తున్నామని వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్ షిప్‌నే నిర్మించామని ప్రస్తావించారు. మంగళవారం సింగపూర్‌లో సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026 బిజినెస్ రోడ్ షోకి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న పార్టనర్‌షిప్ సమ్మిట్ సన్నాహక సమావేశంగా సింగపూర్‌లో తొలి రోడ్ షోని సీఐఐ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత కొత్త రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్‌ని తయారు చేశామని తెలిపారు. బ్లూ, గ్రీన్ రాజధానిగా అమరావతి నిర్మాణం కోసం ఓ అద్భుతమైన బృహత్ ప్రణాళికను సింగపూర్ రూపొందించిందని వెల్లడించారు. ఏపీ రాజధాని అమరావతితో పాటు రాష్ట్రంలోని నగరాల అభివృద్ధి తదితర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. సింగపూర్ తర్వాత పెట్టుబడులు పెట్టాలనుకుంటే ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ప్రాంతమని స్పష్టం చేశారు. సింగపూర్ తర్వాత రెండో నివాసంగా అమరావతిని, ఏపీని మార్చుకోమని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. ఏపీలో భూమి, అనుమతులను వేగంగా జారీ చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ దిగ్గజ స్టీల్ కంపెనీ ఆర్సెలార్ మిట్టల్‌కు అన్ని అనుమతులు వేగంగా ఇచ్చామని చెప్పుకొచ్చారు. 2028 నాటికి ఆర్సెలార్ మిట్టల్ ఉత్పత్తి కూడా ప్రారంభించి ఏపీ నుంచి ఎగుమతులు చేస్తుందని తెలిపారు. అలాగే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటవుతుందని.. వారికి గ్రీన్ ఎనర్జీని సరఫరా చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. పెట్టుబడులు వచ్చిన మరుక్షణం నుంచే పరిశ్రమలు ప్రారంభించేలా ఓ నిర్దిష్టమైన కాలవ్యవధిని నిర్ణయిస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. గూగుల్‌తో పాటు దాదాపు 10 గిగావాట్ల సామర్థ్యం ఉన్న డేటా సెంటర్లను వివిధ కంపెనీలు ఏర్పాటు చేయబోతున్నాయని ప్రస్తావించారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కూడా రూ.7 వేల కోట్లతో శ్రీసిటీలో గృహోపకరణాల తయారీ యూనిట్‌ను ప్రారంభిస్తోందని తెలిపారు. ఏపీలో అమలవుతున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఇవి ప్రత్యక్ష ఉదాహరణలని చెప్పుకొచ్చారు. నైపుణ్యం ఉన్న మానవ వనరులను తయారు చేసేందుకు ఆపరేషనల్ స్కిల్ యూనివర్శిటీనీ కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. పనిచేస్తూనే నైపుణ్యాలు, ఉన్నత విద్యార్హతలను సాధించేలా ఈ ఆపరేషనల్ యూనివర్శిటీలు ఉపకరిస్తాయని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ విస్తృతి పెరిగిందని.. దీని ఆధారంగానే నిర్ణయాలు ఉంటున్నాయని చెప్పుకొచ్చారు. ఏపీలోనూ అదే తరహాలో డేటా డ్రివెన్ నిర్ణయాలను తీసుకుని పౌరసేవల్ని అందిస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.



## ఎపి అభివృద్ధికి ఇతోధికంగా చేయూత

### వాజ్‌పేయ్ పార్కులో స్వచ్ఛభారత్‌లో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి

విజయవాడ,జూన్16: కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కట్టుబడి ఉందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. ఒక రోజు పర్యటనలో భాగంగా విజయవాడ చేరుకున్న ఆయన.. నగరంలోని వాజ్‌పేయి పార్కులో స్వచ్ఛభారత్‌లో భాగంగా చీపురు పట్టి చెత్త ఊడ్చారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే సుజనా చౌదరితో కలిసి పార్కులో మొక్కలు నాటారు. అనంతరం పార్క్‌కు వచ్చిన వాకర్స్‌తో ముచ్చటించారు. దేశంలో అత్యధిక కాలం సేవలందించిన ప్రధానిగా.. నరేంద్ర మోదీ చరిత్రలో నిలిచిపోయారన్నారు. 2014కు ముందు భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత క్షీణ దశలో ఉందని.. మోదీ ప్రధాని అయ్యాక అత్యంత వేగంగా అభివృద్ధి చెందే ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపాంతరం చెందిందని పేర్కొన్నారు. రైల్వే ఎలక్ట్రిఫికేషన్ జరిగిన రెండో దేశం భారత్ అని వివరించారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు 8 రెట్లు పెరిగాయి. అమరావతి కోసం హడ్కో నుంచి రూ.11వేల కోట్లు ఇచ్చామన్న జోషి.. అమరావతి కనెక్ట్ చేస్తూ ప్రత్యేక రైల్వే లైన్ కోసం నిధులు సమకూర్చినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర అబివృద్ధి కోసం చంద్రబాబు, పవన్, మాధవ్ కలిసి బాగా పని చేస్తున్నారని ప్రహ్లాద్ జోషి కితాబిచ్చారు. రాజధాని అమరావతికి రోడ్, రైల్వే కనెక్టివిటీ పెంచుతున్నామని వెల్లడించారు. అమరావతి అభివృద్ధికి కేంద్రం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్టు చెప్పారు.

## హోంమంత్రి అనితపై గుడివాడ కామెంట్స్

### దిగజారిపోయి మహిళలపై విమర్శలు సరికాదు
### ఇది యావత్తు మహిళా లోకానికే అవమానం
### అమరన్‌నాథ్ వ్యాఖ్యలపై మండిపడ్డ డిప్యూటి సిఎం

అమరావతి,జూన్16: రాజకీయాల్లో విమర్శలు విధానపరంగానే ఉండాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితపై ఓ మాజీ మంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళల కట్టూబొట్టుపై కామెంట్స్ చేసే స్థాయికి ఆ నాయకుడి పార్టీవారు దిగజారిపోయారంటూ వ్యాఖ్యానించారు. స్త్రీల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఆ వ్యాఖ్యలు కేవలం హోం మంత్రిని అన్నట్టే కాదని.. సగటు మహిళలందరినీ కించపరచినట్లే అని పవన్ అన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారి నోటి నుంచి వచ్చే ప్రతి మాటను పౌర సమాజం గమనిస్తోందనే విషయాన్ని మరచిపోవద్దని పవన్ అన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు ఉంటాయని... అవి విధానపరంగానే ఉండాలన్నారు. ఒక పాలసీ నచ్చకపోతే ఆ పాలసీ విషయంపైనే విమర్శించాలన్నారు. వాచలత్వంతో ఇళ్లలోని స్త్రీలను కూడా కించపరచే నైజం ఉన్న పార్టీ చేసే కామెంట్స్‌లను బలంగా తిప్పికొట్టేటప్పుడు వాళ్లు చేస్తున్న వ్యాఖ్యల్లో ఎంతటి అభ్యంతరకరమైన విషయం ఉందో ప్రజలకు తెలియజెప్పాలని కూటమి నేతలకు సూచించారు. కూటమి నేతలందరూ పౌర సమాజం హర్షించే భాషలో మాట్లాడి బలంగా బదులివ్వాలన్నారు. అవతలి పార్టీవాళ్ల మాదిరి దిగజారుడు భాష, అర్థరహిత వ్యాఖ్యలు కూటమి నేతలకు అవసరం లేదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## దుర్గమ్మకు అగ్గిపెట్టెలో పట్టే చీర బహుకరణ

### ఇంద్రకీలాద్రిపై రూ.82 కోట్లతో విస్తరణ పనులు

విజయవాడ,జూన్16: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు.. సిరిసిల్లకు చెందిన చేనేత కార్మికుడు నల్ల విజయ్‌కుమార్ అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీరను బహూకరించారు. ఆలయ ఈవో శీనానాయక్‌కు మంగళవారం ఉదయం పట్టుచీరను అందజేశారు. ఇక్కత్ డిజైన్‌తో మగ్గంపై నేసిన ఈ చీర దాదాపు ఐదున్నర మీటర్ల పొడవు, 48 అంగుళాల వెడల్పు ఉంటుందని విజయ్‌కుమార్ తెలిపారు. దీని తయారీకి వారం రోజులు పట్టిందని చెప్పారు. ఇదిలావుంటే విజయవాడ ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. భక్తుల రద్దీ పెరగడంతో అందుకు అనుగుణంగా పనులు చేపట్టారు. దీంతో కనకదుర్గమ్మ ఆలయ స్వరూపం త్వరలోనే పూర్తిగా మారనుంది. రోజురోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయ అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా సుమారు రూ.82 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, ఆరు అంతస్తుల ప్రసాదం పోటు, నూతన అన్నప్రసాదం కాంప్లెక్స్ పనులు చాలా వరకు పూర్తయ్యాయి. జులై చివరి నాటికి ఈ సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

## జనసేనలో జాయినింగ్స్ కమిటీ ఏర్పాటు

### పార్టీలో చేరేవారి కోసం 14మందితో కమిటీ
### పార్టీ అధినేత పవన్ కల్యాణ్ వెల్లడి

అమరావతి,జూన్16: జనసేన పార్టీలో చేరికల సమన్వయానికి జాయినింగ్స్ కమిటీని నియమించినట్లు పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. జనసేన పార్టీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్న ఇతర పార్టీల నేతలు, విద్యావంతులు, సామాజికవేత్తలు, తటస్థులను పార్టీలోకి ఆహ్వానించేందుకు ప్రత్యేకంగా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 14 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీ చేరికలను సమన్వయం చేస్తుందన్నారు. ఢిల్లీ పర్యటన అనంతరం ఈ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి పార్టీలో చేరికలపై దిశానిర్దేశర చేయనున్నట్లు పవన్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ తరహాలోనే తెలంగాణలోనూ జాయినింగ్స్ కమిటీ నియామకానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కమిటీలో ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్, పంతం నానాజీ, ఎంపీ లింగమనేని రమేశ్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, సామినేని ఉదయభాను, పార్టీ సీనియర్ నేతలు కొటికలపూడి చినబాబు, డా.హరిప్రసాద్, డా.పెదపూడి విజయ్ కుమార్, కొరికాన రవికుమార్, వంపూరు గంగులయ్య, టీసీ వరుణ్, ఆరణి మదన్ సభ్యులుగా ఉంటారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## గాయని శ్రీలలిత నివాసానికి ప్రహ్లాద్ జోషి

విజయవాడ,జూన్16: విజయవాడలో వివిధ కార్యక్రమాలలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ యువ గాయని శ్రీలలిత నివాసానికి కేంద్ర మంత్రి విచ్చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని 12 ఏళ్ల సుపరిపాలన, సాధించిన విజయాలపై రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని శ్రీలలితకు అందజేశారు. కర్ణాటక, హిందుస్తానీ సంగీత శైలులు రెండింటిలోనూ రాణిస్తున్న శ్రీలలితను ప్రహ్లాద్ జోషి అభినందించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. రెండు విభిన్న సంగీత పక్రియలను నేర్చుకోవడం ఎంతో కష్టతరమన్నారు. గతంలో ప్రధాని మోదీ స్వయంగా శ్రీలలిత ప్రతిభను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రశంసించారని తెలిపారు. కర్ణాటకలో ధార్వాడ్.. హిందుస్తానీ సంగీతానికి ఎందరో మహానుభావులను అందించిందన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ సాధించిన అద్భుత ప్రగతిని, ప్రపంచ సంక్షోభాల సమయంలోనూ దేశాన్ని సమర్థవంతంగా నడిపించిన తీరు గురించి అందరూ తెలుసుకోవాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ఇక్కడి రాజధానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఉదయం ఇంద్రకీలాద్రి చేరుకున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు ఆలయ మర్యాదలతో ఆలయ అర్చకులు, దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని, వేద పండితుల చేత వేద ఆశీర్వచనం పొందారు.

## వెలిగొండ నిర్వాసితులకు ఈ నెలలోనే ఆర్‌అండ్‌ఆర్ పరిహారం

### అదనపు బడ్జెట్‌లో రూ.905 కోట్లు కేటాయింపు: మంత్రి నిమ్మల రామానాయుడు

సాక్ష్యం , విశాఖపట్నం
వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ఈ నెలలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆర్‌అండ్‌ఆర్ పరిహారం అందజేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. నల్లమలసాగర్ రిజర్వాయర్‌ను నీటితో నింపడమే లక్ష్యంగా



ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నామని, నిర్వాసితుల పునరావాసం కోసం అదనపు బడ్జెట్‌లో రూ.905 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. మంగళవారం డోర్నాలలో అధికారులతో కలిసి వెలిగొండ ప్రాజెక్టు జంట సొరంగాలను సందర్శించిన మంత్రి, టన్నెల్ లైనింగ్ పనులు, టన్నెల్ బోరింగ్ మెషిన్ (టిబిఎం) తొలగింపు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హెడ్ రెగ్యులేటర్ల రిటైనింగ్ వాల్, వింగ్స్, రిటర్న్స్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. కొల్లంవాగు నుంచి టన్నెల్స్‌లోకి 1 టీఎంసీ నీరు చేరేలా మక్ తొలగింపు పనులు కొనసాగుతున్నాయని, టన్నెల్-2లో లక్షా 80 వేల క్యూబిక్ మీటర్ల మక్‌లో ఇప్పటివరకు 58 వేల క్యూబిక్ మీటర్లు తొలగించినట్లు చెప్పారు. టన్నెల్-1లో లక్షా 20 వేల క్యూబిక్ మీటర్ల మక్ తొలగింపులో 40 వేల క్యూబిక్ మీటర్ల పనులు పూర్తయ్యాయని వివరించారు.
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టన్నెల్-2లో మొత్తం 7 కిలోమీటర్ల లైనింగ్ పనుల్లో 5.5 కిలోమీటర్లు పూర్తయ్యాయని, మిగిలిన 1.5 కిలోమీటర్ల పనులను జూలై చివరి నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో టన్నెల్‌లో చిక్కుకుపోయిన టిబిఎంను వెలికితీసే ప్రక్రియ కొనసాగుతోందని, మొత్తం ఏడు కంపార్ట్‌మెంట్లలో మూడు ఇప్పటికే బయటకు తీసుకువచ్చామని చెప్పారు. టిబిఎంలోని క్లిష్టమైన హెడ్ భాగాన్ని టన్నెల్‌లోనే పూడ్చిపెట్టే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఫీడర్ కెనాల్‌లో 5.3 కిలోమీటర్ల రిటైనింగ్ వాల్ పనులను ఐదు నెలల్లో పూర్తి చేశామని, 21 కిలోమీటర్ల లైనింగ్ పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. మేఘ తుఫాన్ ప్రభావంతో ఏర్పడిన గండిని సీసీ వాల్ నిర్మాణం ద్వారా పూడ్చనున్నట్లు వెల్లడించారు. తీగలేరు, ఈస్టర్న్ మెయిన్ కెనాల్, పర్మనెంట్ డైవర్షన్ రోడ్డు పనులు ఈ నెలాఖరుకు పూర్తికానున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సాగునీటి సీజన్ ప్రారంభానికి ముందే నల్లమలసాగర్ రిజర్వాయర్‌ను నింపేలా అన్ని పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, ఎర్రగొండపాలెం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు, జలవనరుల శాఖ సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు, వెలిగొండ ప్రాజెక్టు సీఈ రమేష్ బాబు, ఎస్ఈ అబూతలేం, ఇతర ఉన్నతాధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు

### మెడికల్ రిపోర్టులను సమర్పించాలని హైకోర్టు ఆదేశం

అమరావతి,జూన్16: వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎంపీ, ప్రస్తుత ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి తెలుగుదేశం ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణంరాజు సంబంధించిన కస్టోడియల్ టార్చర్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో మంగళవారం ఈకేసుపై విచారణ జరిగింది. ఈ కేసుకు సంబంధించిన అన్ని మెడికల్ రిపోర్టులను తమ ముందుంచాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించిన మెడికల్ బోర్డు నివేదికలు, వైద్య పరీక్షల పూర్తి రికార్డులు, ఇతర సంబంధిత పత్రాలను కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది. సీఐడీ అధికారులు తనను కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారని రఘురామ గతంలో ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై న్యాయస్థానం ఆదేశాల మేరకు మెడికల్ బోర్డు, వివిధ విభాగాధిపతులు నిర్వహించిన వైద్య పరీక్షల నివేదికలను తారుమారు చేయడానికి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రయత్నిస్తున్నారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాగే, తప్పుడు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మెడికల్ బోర్డును రక్షించేందుకు ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రయత్నిస్తున్నారని కూడా పిటిషన్‌లో రఘురామ ఆరోపించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో గతంలోనే సంబంధిత మెడికల్ రిపోర్టులను భద్రపరచాలని వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం ఆ రికార్డులన్నింటినీ న్యాయస్థానం ముందుంచాలని మరోసారి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విచారణను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది. అప్పటిలోగా అన్ని వైద్య రికార్డులు, మెడికల్ బోర్డు నివేదికలు, సంబంధిత పత్రాలను సమర్పించాలని అధికారులను ఆదేశించింది. ఈ కేసులో మెడికల్ ఆధారాలు కీలకంగా మారనున్న నేపథ్యంలో ఏపీ హైకోర్టు తాజా ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.


## దళిత మహిళా ప్రజాప్రతినిధిపై ఇంత అక్కసా

అమరావతి,జూన్16: హోంమంత్రి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనితపై అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలు వైసీపీ నేతల అసలు స్వరూపాన్ని బయటపెట్టాయని ధ్వజమెత్తారు. మంగళవారం అమరావతి వేదికగా మంత్రి లోకేశ్ మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో పాలన, అభివృద్ధి, శాంతిభద్రతలపై సమాధానాలు లేక వైసీపీ నేతలు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని ఆగ్రహించారు. మహిళా నేత, దళిత ప్రజాప్రతినిధిని లక్ష్యంగా చేసుకోవడం వైసీపీ నీచ రాజకీయ సంస్కృతికి నిదర్శనమని లోకేశ్ మండిపడ్డారు. అనిత రాజకీయ ప్రస్థానం, కష్టపడి ఎదిగిన మహిళా వ్యక్తిత్వానికి నిదర్శనమని లోకేశ్ ప్రశంసించారు. అనితకు, మహిళలకు, దళిత సమాజానికి వైసీపీ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని మంత్రి లోకేశ్ డిమాండ్ చేశారు. ఇదిలావుంటలే లోకేశ్ టెలికాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాష్ట్ర, జాతీయ కార్యవర్గంతో మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కూటమి పాలన రెండేళ్ల విజయాలపై ఈ నెల 25వ తేదీ నుంచి ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ నేతలు వెళ్లాలని పిలుపునిచ్చారు. మొత్తం 45 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. సుమారు రెండు గంటల పాటు ఈ సమావేశం కొనసాగింది. అన్ని నియోజకవర్గాల్లో ఇంటింటికీ వెళ్లాలని యువనేత దిశానిర్దేశర చేశారు. తమ ఇబ్బందులను కొంతమంది ఎమ్మెల్యేలు లోకేశ్‌కి వివరించారు. అర్హులైన వారు కొత్త పెన్షన్లు అడుగుతున్నారని తెలిపారు.

## పెంచిన ఆక్వా ఫీడ్ ధరల్ని తగ్గించాలి

### లేదంటే ఆక్వా రైతులకు మద్దతుగా పోరాటం
### ప్రభుత్వాన్ని హెచ్చరించిన వైఎస్ జగన్

అమరావతి,జూన్16: పెంచిన ఆక్వా ఫీడ్ ధరల్ని ఈ నెలాఖరులోగా తగ్గించాలని.. లేకుంటే జులై 1, లేదా 2న ఆక్వా రైతుల తరుపున పోరాటం చేస్తామని వైసిపి అధినేత జగన్ హెచ్చరించారు. తాను కూడా ఆక్వా రైతులకు మద్దతుగా వెళ్తానని హెచ్చరించారు. ఈ మేరకు చంద్రబాబు సర్కార్‌కు జగన్‌మోహన్‌రెడ్డి అల్టిమేటం జారీ చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ




ప్రధాన కార్యాలయంలో మంగళవారం వైఎస్ జగన్‌తో ఆక్వా రైతులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కూటమి సర్కార్ పాలనతో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని వైఎస్ జగన్‌కు వివరించారు. అనంతరం వైఎస్ జగన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతులు, ఆక్వా రైతులు దారుణమైన స్థితిలో ఉన్నారని.. రైతులు, ఆక్వా రైతులు సంతోషంగా ఉండాలనే ఉద్దేశ్యంతో తమ హయాంలో మంచి ఆలోచనలు చేశామన్నారు. 'రైతులు చేయిపట్టుకుని నడిపించే వ్యవస్థలో భాగంగా ఆర్బీకేలను అందుబాటులోకి తీసుకొని వచ్చాం. రాష్ట్ర వ్యాప్తంగా రూ.10వేలకుపైగా ఆర్బీకేలను తీసుకొచ్చాం. రాష్ట్రంలో వ్యాప్తంగా 10వేలకుపైగా ఆర్బీకేలు తీసుకు వచ్చాం. ఆక్వా రైతులకు తోడుగా 35 ఆక్వా ఇంటిగ్రేటెడ్ ల్యాబులు, 782 ఆర్బీకేల్లో ఫిషరీస్ అసిస్టెంట్లను పెట్టామన్నారు. అప్సడా చట్టాన్ని సైతం తెచ్చాం. ముఖ్యమంత్రినే అప్సడా ఛైర్మన్‌గా చేశాం. రైతులకు నష్టం రాకుండా సిండికేట్‌కు స్థానం లేకుండా చేశాం. రూపాయిన్నరకే యూనిట్ కరెంటును సబ్సిడీపై ఇచ్చాం. మన ప్రభుత్వమే ఇవ్వగలిగిందని గర్వంగా చెప్తున్నా. మేనిఫెస్టోలో చెప్పినట్టుగా ఆక్వా రైతులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ సరఫరా చేశాం. అలా 57 నెలల్లో రూ.3,306 కోట్లు విద్యుత్ సబ్సిడీ కింద చెల్లించాం. 2014-19 మధ్య చంద్రబాబు యూనిట్‌కు రూ.3.82లు వసూలు చేసేవాడు. మనం పాదయాత్రలో ఉనప్పుడు చివరి ఆరునెలల్లో యూనిట్‌కు రూ.2లకు ఇస్తానని ఒక జీవో విడుదల చేశాడు. కాని అక్కడ కూడా చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదు. చివరకు చంద్రబాబు కట్టాల్సిన బకాయిలు రూ.340 కోట్లు కూడా మనమే కట్టాం. చిత్తశుద్ధితో మనం చేసిన కార్యక్రమాల వల్ల ఆక్వా రంగం నిలదొక్కుతుంది. చంద్రబాబు హయాంలో 2018-19లో 38 లక్షల టన్నులు ఉన్న రొయ్య, మత్స్య ఉత్పత్తులు 2022-23 నాటికి ఏకంగా 51 లక్షల టన్నులకు పెరిగింది. 2021-22,2022-23లో రెండుసార్లు బెస్ట్ మెరైన్ అవార్డులు వచ్చాయి. ఫీడ్ కంపెనీలు రేట్లు పెంచితే, మూడు సార్లు ఉప సంహరించుకునేలా చేశాం. ఫిషరీస్ యూనివర్శిటీ ద్వారా ఆక్వాసాగుకు నిపుణులను తయారుచేసేలా ఏర్పాటు చేశాం. క్లాసులు కూడా మొదలు పెట్టించాం. చంద్రబాబు మిగిలిన పనులు చేయకుండా విడిచిపెట్టారు. ఆక్వా ఫీడ్, సీడ్, ప్రాసెసింగ్ యూనిట్లు అన్నీ చంద్రబాబు సానుభూతిపరులవే. సిండికేటై పంట చేతికి అందేనాటికి రేట్లు తగ్గించేస్తున్నారు. ఫిబ్రవరిలో ఫీడ్ రేట్లు కిలో రూ.4 పెంచారు. జూన్‌లో మరో రూ.10, రూ.12 పెంచారు. ఈ ప్రభుత్వానికి కచ్చితంగా బుద్ధిచెప్పాల్సిందేననని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.

## బీసీలపై కక్షపూరిత చర్యలకు పాల్పడ్డ జగన్

### అమర్‌నాథ్ గౌడ్ హత్యే ఇందుకు నిదర్శనం
### మంత్రి లోకేశ్ ఘాటు విమర్శలు

అమరావతి,జూన్16: జగన్ హయాంలో బీసీలకు అన్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఫైర్ అయ్యారు. వైసీపీ హయాంలో బీసీలపై కక్షపూరిత చర్యలకు పాల్పడ్డారని దుయ్యబట్టారు. బీసీలు అంటే జగన్‌కు ఎంత కక్షో అమర్నాథ్ గౌడ్ సజీవదహనం నిరూపించిందని పేర్కొన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలపై గొడ్డలి పార్టీ కక్షగట్టిందని ధ్వజమెత్తారు. మంగళవారం అమరావతి వేదికగా మీడియాతో మంత్రి లోకేశ్ మాట్లాడారు. తన అక్కను గొడ్డలి పార్టీ నేతలు వేధిస్తుంటే ప్రశ్నించినందుకు జూన్ 15, 2023న బడికి వెళ్తున్న 15ఏళ్ల బీసీ బాలుడు అమర్నాథ్ గౌడ్‌ను దారుణంగా కొట్టి, కట్టేసి సజీవ దహనం చేశారని మండిపడ్డారు. నాడు గొడ్డలి పార్టీ నిందితులను రక్షించేందుకు ప్రయత్నించిందని మంత్రి లోకేశ్ ఆగ్రహించారు. అన్యాయంగా అమర్‌నాథ్ గౌడ్‌ని చంపేశారని.. ఆయన మృతిచెంది మూడేళ్లు అవుతోందని తెలిపారు. గొడ్డలి పార్టీ వల్ల అన్నివిధాలా నష్టపోయిన అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి నారా లోకేశ్ భరోసా కల్పించారు. వైసీపీ పైశాచికత్వానికి పరాకాష్ట అమర్నాథ్ గౌడ్ హత్య అని మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. ఐదేళ్ల పాలనంతా బడుగు బలహీన వర్గాలను వేధించడమేనని ఆగ్రహించారు. చేయాల్సిన అరాచకాలన్నీ చేసి ఇప్పుడు వైసీపీ నేతలు నీతులు చెబుతున్నారని విమర్శించారు. కుట్రలతో రాష్ట్రంలో అలజడులే అజెండాగా జగన్ రెడ్డి అడుగులేస్తున్నారని దుయ్యబట్టారు. అమర్నాథ్ గౌడ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు మంత్రి కొల్లు రవీంద్ర.

## అమరవీరుల స్థూపం దగ్గర
# మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సమావేశం



**మహబూబాబాద్ జిల్లా కరస్పాండెంట్ ( జూన్.16)**
మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు ఏ పార్టీకి చెందిన వారైనప్పటికీ,తెలంగాణ కై తెగించిపోరాడిన వారందరికీ న్యాయం జరగాలని,ఈమధ్య ఉద్యమకారుల పేరిట చాలా సంఘాలు వస్తున్నందున ఉద్యమకారులు ఎటు ఉండాలో తెల్చుకోలేక పోతున్నారని,గతంలో ఎవరి ఆధ్వర్యంలో పనిచేశారో వారితో ఉండడమే మంచిదని, తెలంగాణ కై కష్టపడి,నష్టపోయిన తెలంగాణ ఉద్యమకారులను నిష్పక్షపాతంగా గుర్తించి, సంక్షేమ ఫలాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యమకారులు అహ్మద్ ఖాన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి ఉద్యమ నాయకులు దార్ల శివరాజ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి ఉద్యమంలో పాల్గొన్నందుకు విద్యార్థి ఉద్యమకారుల భవిష్యత్తు అంతా నాశనం అయ్యిందని, ఏ పార్టీలో లేని విద్యార్థి ఉద్యమకారులను నిర్లక్ష్యం చేయకుండా, ప్రభుత్వమే గుర్తించి సాయం చేయాలి. విద్యార్థి దశలో మేం కోల్పోయిన భవిష్యత్తును పొందలేమని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని "కమిటీల" పేరిట కాలయాపన చేయకుండా, తక్షణమే తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలంతో పాటు, గౌరవ ప్రదమైన స్థాయిలో పెన్షన్ మంజూరు చేసి ప్రభుత్వం ఎన్నికల కంటే ముందు మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాన్ని నెరవేర్చుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులు అహ్మద్ ఖాన్,పుచ్చకాయల రామక్రిష్ణ, దార్ల శివరాజ్, దేవోజి నాయక్, బొర్రాజు లింగన్న, ఖయ్యాం, చెక్కల అశోక్, పుచ్చ బాలకృష్ణ ,షేఖ్ సాదిఖ్, నరేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# సర్కిల్ ఇన్స్పెక్టర్ రాఘవేందర్‌కు పోపా సత్కారం





**హనుమకొండ, జూన్ 16 (సాక్ష్యం)**
వరంగల్ జిల్లా పోపా ఆద్వర్యంలో సి.ఐ. రాఘవేందర్ ని కలిసి శాలువ షీల్డ్ తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కర్తవ్య నిర్వహణతో పాటు సామాజిక సేవలో కూడా తన వంతు సహాయ సహకారాలతో ముందుకు సాగుతున్నానని ఈ తరుణంలో పద్మశాలి అఫిషియల్స్ ఉ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ వారు సన్మానించడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రతిభా పురస్కార్ కార్యక్రమానికి పద్మశాలి విద్యార్థులకు సహాయం సహకారాలు అందించి విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పాటునందిస్తున్న రాఘవేందర్ కు పోపా కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోపా రాష్ట్ర అధ్యక్షులు శామంతుల శ్రీనివాస్, వరంగల్ జిల్లా అధ్యక్షులు గుండు కామేశ్వర్, సహధ్యక్షులు మాటేటి సంతోష్ కుమార్, రాష్ట్ర నాయకులు మాటేటి అశోక్ కుమార్, గోషికొండ సుధాకర్, ప్రతినిధులు దిడ్డి అనిల్, గుండు రవి, గుండేటి సతీష్, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి పట్టివేత ఐదుగురు వ్యక్తులు అరెస్ట్



**భూపాలపల్లి జూన్ 15 (సాక్ష్యం) :**
భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బాంబులగడ్డ ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న గడ్డిగానిపల్లికి చెందిన సెగ్గం సాయి వర్ధన్, సెగ్గంపల్లికి చెందిన దాసరి వంశీ, దుర్గం మహార్షిలను అదుపులోకి తీసుకుని విచారించగా. వారు ఇచ్చిన సమాచారంతో గంజాయి సరఫరా చేస్తున్న ములుగు జిల్లా, ఏటూరునాగారం మండలం, రొయ్యూరు గ్రామానికి చెందిన జాడి మనోజ్, దుర్గం కిరణ్‌లను కూడా అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుండి మొత్తం 210 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు కొనసాగుతాయని, గంజాయి విక్రయాలు, రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## విద్యాహక్కు చట్టం ఉల్లంఘిస్తున్న
# ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి

■ ప్రైవేట్ స్కూళ్లలో పేద విద్యార్థులకు 25% సీట్లు కేటాయించాలి



**భూపాలపల్లి జూన్ 16 (సాక్ష్యం):**
డివైఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి భూక్యా నవీన్. ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు విద్యా హక్కు చట్టం ద్వారా 25 శాతం సీట్లు కేటాయించాలని డివైఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి భూక్యా నవీన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్మిషన్ల పేరుతో తల్లిదండ్రుల నుంచి భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేయడం, విద్యా హక్కు చట్టం ఉద్దేశాలకు విరుద్ధంగా కొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయని అన్నారు. కొంతమంది పాఠశాలలు విద్యార్థులకు అవసరమైన నోటుబుక్స్, పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ వస్తువులు ఇతర దుకాణాల్లో కొనుగోలు చేసే అవకాశం ఇవ్వకుండా తామే విక్రయిస్తున్నాయని ఆరోపించారు. దీంతో ఒక్క విద్యార్థి కోసం తల్లిదండ్రులు రూ.2000 నుంచి రూ.4000 వరకు అదనపు ఖర్చు భరించాల్సి వస్తోందన్నారు. విద్యా హక్కు చట్టం అమలు ఎక్కడ ఉందని ఆయన ప్రశ్నించారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర పేద పిల్లలకు 25% సీట్లు ఉచితంగా కేటాయించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉన్నప్పటికీ అమలు కావడం లేదన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విద్యా హక్కు చట్టం--2009 అమల్లోకి వచ్చినప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు కాలేదని పేర్కొన్నారు. అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో 25% రిజర్వేషన్ సీట్ల అమలుపై అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# క్షేత్రపాలకుడికి విశేషముగా ఆకు పూజ



**యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్..**
యాదాద్రి పుణ్యక్షేత్రంలో మంగళవారం నిత్యారాధనలతో పాటు క్షేత్రపాలకుడైన ఆంజనేయ స్వామిని కొలుస్తూ ఆకు పూజ పర్వాలను శాస్త్రో క్తంగా నిర్వహించారు. యాదాద్రి కొండ పై అనుబంధ శివాలయం చెంతన ఉన్న క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి ఆకు పూజను ఘనంగా నిర్వహించారు. హనుమం తుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. తమలపాకులతో అర్చించి లలితాపారాయణం చేశారు. ఆంజనేయస్వామికి ఇష్టమైన వడపప్పు, బెల్లం, అరటి పండ్లను నైవేద్యంగా సమర్పించారు. ఈ పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. మంగళవారం వివిధ కైంకర్యాలలో వచ్చిన ఆదాయం. 20,08,013/-

# పేదలకు ఇవ్వాల్సిన ప్రభుత్వ భూములు స్వాహా..?

■ అక్రమ నిర్మాణాలు తొలగించి కేసులు నమోదు చేయాలని ప్రజల డిమాండ్



**(మంచిర్యాల జిల్లా కరస్పాండెంట్, జూన్ 16)**
మంచిర్యాల జిల్లా బీమారం మండలం, బీమారం గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తగూడెం ప్రాంతంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి పాస్టర్ సొలొమోను కమర్షియల్ షట్టర్లు, చర్చి నిర్మాణం చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పేద ప్రజలకు పంపిణీ చేయాల్సిన విలువైన ప్రభుత్వ భూములపై నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు మౌనం వీడకపోవడం పట్ల గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే పలు వార్తాపత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు కనిపించకపోవడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పంచాయతీ కార్యదర్శి, ఎంపీవో, జిల్లా పంచాయతీ అధికారి, రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికుల ఆరోపణల ప్రకారం, కొందరు దళారుల అండదండలతో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఆక్రమణదారులు మరింత ధైర్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. భవిష్యత్తులో పేదలకు ఇళ్ల స్థలాలు, ప్రజా అవసరాల కోసం ఉపయోగపడాల్సిన భూములు వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించబడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వార్తలు వచ్చాయి. ఫిర్యాదులు వెళ్లాయి. కానీ చర్యలు మాత్రం శూన్యం" అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక విచారణకు ఆదేశించి, సంబంధిత భూముల రికార్డులను పరిశీలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆక్రమణలు జరిగినట్లు తేలితే అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించడంతో పాటు బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే ఫిర్యాదులు అందినా చర్యలు తీసుకోని అధికారులపై శాఖాపరమైన విచారణ జరిపి కఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ భూములను కాపాడండి. పేదల హక్కులను పరిరక్షించండి, అంటూ కొత్తగూడెం గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు

# తల్లిదండ్రులకు భారమవుతున్న ప్రైవేట్ చదువులు

■ ఎల్కేజీ కే 35-40 వేల ఫీజు ■ మరింత భారంగా పుస్తకాల ధరలు ■ కుదేలు అవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు






**ఆర్మూర్ సాక్ష్యం న్యూస్ జూన్16:**
ప్రైవేట్ చదువులు తల్లిదండ్రులకు పెను భారంగా తయారయ్యాయి. ప్రైవేట్ పాఠశాలల ఫీజులు వింటేనే విద్యార్థుల తల్లిదండ్రుల వెన్నులో వణుకు పుడుతుంది. ఎల్కేజీ విద్యార్థి కే 35 వేల నుండి 45 వేల ఫీజు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల దోపిడీకి కళ్ళెం వేసే నాథుడే లేడని విద్యార్థుల తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు. దీనికి తోడు తమ పాఠశాలలోనే పుస్తకాలు, టై బెల్టు మొదలుకొని యూనిఫాం వరకు కొనాలనే ఆంక్షలు చూస్తుంటే ప్రైవేట్ పాఠశాలల నిర్బంధ దోపిడీకి నిలువెత్తు నిదర్శనం అవుపిస్తుంది. ప్రతి ప్రైవేట్ పాఠశాల ఒక పుస్తకాల దుకాణాన్ని తెరిచి తమ పాఠశాలలో అడ్మిషన్ తీసుకుంటే తాము పెట్టిన తాత్కాలిక పుస్తకాలు దుకాణాలోనే కొనాలని ఆంక్షలు విధిస్తున్నారు. విద్యా వ్యాపారంతో పాటు పుస్తకాల వ్యాపారానికి కొత్తగా తెరలేపిన ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు బినామీ వారి పేరిట తాత్కాలిక పుస్తకాల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి తమ పాఠశాలకు ఆ పుస్తకాల వ్యాపారానికి ఏమి సంబంధం లేదన్నట్టు వ్యవహరిస్తున్నాయి. వాస్తవానికి ప్రైవేట్ పాఠశాలలు అడ్మిషన్లు మాత్రమే తీసుకొని చదువు చెప్పాల్సి ఉండగా, పుస్తకాల వ్యాపారాన్ని కూడా ఎందుకు వదులుకోవాలని ఆయా పాఠశాలలు పుస్తకాల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి విచ్చలవిడిగా ధరలు నిర్ణయించి విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థిక భారానికి గురి చేస్తున్నారు. ఈ విషయంపై విద్యార్థి సంఘాలు ఎంత గగోలుపెట్టిన సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తూ ఏం జరుగుతే తమకేంటి అని చూస్తూ చూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో ప్రైవేట్ పాఠశాలల యజమానులు మరింత బరితెగించి మెడలు వంచి మరి విద్యార్థుల తల్లిదండ్రుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఫీజుల నియంత్రణ లేకపోవడంతో ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారు. ఒక మధ్యతరగతి కుటుంబీకుడు ప్రైవేట్ పాఠశాలలో చదిపించాలంటే తలకు మించిన భారంతో ఆ కుటుంబం ఆవేదనకు గురవుతుంది. ఒక పాఠశాలకు చెందిన పాఠ్యపుస్తకాలు మరో పాఠశాలకు చెందిన పాఠ్యపుస్తకాల కు ఏ మాత్రం పొంతన లేకుండా ఎంత ఎక్కువ ధర ఉంటే అంత స్టాండర్డ్ కింద భావించి అధిక ధరల పుస్తకాల ద్వారా తమ వ్యాపారాన్ని మూడు పూలు ఆరుకాయలుగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. విద్యార్థుల మానసిక స్థితిపై కాకుండా పుస్తకాల స్టాండెడ్ పై ఆయా పాఠశాలలు దృష్టిని సారించడంతో విద్యార్థులు తీవ్ర మానసిక స్థితికి గురవుతున్నట్లు సమాచారం. ఇకనైనా విద్యను వ్యాపార ధోరణితో కాకుండా సమాజ సేవ దృష్టితో ఆలోచించి పాఠశాలల యాజమాన్యాలు ఆలోచించి విద్యార్థుల తల్లిదండ్రులను కొంత మేర క్షమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు భావిస్తున్నారు.

# తనపై ఫిర్యాదు చేస్తే.. తానే ఎంక్వైరీకి రావడమేంటి?

■ మహబూబాబాద్ తహసీల్దార్‌పై తీవ్ర ఆరోపణలు ■ తహసీల్దార్ తీరుపై బాధితుడి ఆవేదన.. కలెక్టర్‌కు రెండోసారి ఫిర్యాదు










**మహబూబాబాద్ జిల్లా రిపోర్టం సాక్ష్యం( జూన్.16)**
"దొంగనే దొంగ... దొంగఅని అరచినట్టుగా, ఒకఅధికారిపై ఫిర్యాదు చేస్తే అదే అధికారి స్వయంగా విచారణకు రావడం ఎంతవరకు సమంజసం?"అంటూ మహబూబాబాద్తహసీల్దార్ వ్యవహారశైలిపై బాధితుడు అహ్మద్ ఖాన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తనపైవచ్చిన ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారించాల్సిన అధికారే ఎంక్వైరీ పేరుతో భూమివద్దకు రావడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్‌కురెండోసారి ఫిర్యాదు చేశారు. మహబూబాబాద్ మండలం ఈధులపూసపల్లి హాగ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 447, 448లకు సంబంధించిన భూ వివాదం గత కొంతకాలంగాకొనసాగుతోంది. ఈ భూములకు సంబంధించి ఇప్పటికే రెవెన్యూ అధికారులకు పలు ఫిర్యాదులుఅందించినట్లు అహ్మద్ ఖాన్ తెలిపారు. కోర్టులో కేసు నడుస్తున్న భూమికిరిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయని, అలాగేభూమిపై ప్రత్యక్ష సర్వే నిర్వహించకుండానే "3 నాలా ఆర్డర్" కాపీలు ఏ విధంగా జారీచేశారనే అంశాలపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. గత వారం అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదుఅందజేయగా, ఆఫిర్యాదును ఏ.డి.ఈ. సర్వేయర్ ద్వారా విచారించాలని ఆదేశించినట్లు తెలిపారు. అయితే ఆవిచారణ పూర్తికాకముందే, తనపైఫిర్యాదు ఎదుర్కొంటున్న మహబూబాబాద్ తహసీల్దార్ జూన్ 12న సాయంత్రం సుమారు 6:30 గంటలకు భూమి వద్దకు వచ్చి తనతోదురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు."మీకు ఇక్కడ భూమే లేదు" అంటూ ఆగ్రహం వ్యక్తం చేయడమేకాకుండా, అక్కడికివచ్చిన పలువురి సమక్షంలో తనను అవమానించారని అహ్మద్ ఖాన్ ఆరోపించారు. అంతేకాకుండా,భూమి రికార్డుల నుంచిపేర్లు తొలగిస్తానంటూ హెచ్చరికలు చేసినట్లు తన ఫిర్యాదులో పేర్కొన్నారు.సర్వేనిర్వహించేందుకు అవసరమైన సర్వేయర్ అసిస్టెంట్, సర్వే పరికరాలు లేకుండానే అధికారులుభూమి వద్దకు రావడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆయన అన్నారు. చీకటి పడే సమయంలోఎంక్వైరీ పేరుతో భూమి వద్దకు రావడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. భూమిపైవాస్తవ సర్వే నిర్వహిస్తే నిజాలు బయటపడతాయనే భయంతోనే సర్వే ప్రక్రియను పక్కనపెట్టారని ఆరోపించారు.ఇప్పటికే తన పాస్‌బుక్‌లో డిజిటల్ సంతకం కోసం ఏడాదికి పైగాకార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానని, అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని అహ్మద్ ఖాన్ ఆవేదనవ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన అధికారే విచారణకు రావడం వల్ల నిష్పక్షపాత విచారణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు."ఒక అధికారిపై ఫిర్యాదు వస్తే స్వతంత్రఅధికారులు విచారణ చేయాలి. కానీ ఇక్కడ తనపైనే ఫిర్యాదు ఉన్న తహసీల్దారే ఎంక్వైరీపేరుతో రావడం చూస్తే విచారణ ఎంత నిష్పక్షపాతంగా జరుగుతుందో ప్రజలే అర్థంచేసుకోవాలి. ప్రభుత్వాధికారులారా.. మీరే చెప్పండి, తనపై ఫిర్యాదు ఉన్న అధికారి తానేవిచారణకు రావడం ఎంతవరకు న్యాయం?" అని అహ్మద్ ఖాన్ ప్రశ్నించారు.447, 448 సర్వే నంబర్ల భూములపై స్వతంత్ర సర్వేనిర్వహించి వాస్తవ హద్దులను నిర్ధారించాలని, "3 నాలా ఆర్డర్" కాపీలు జారీ చేసినవిధానంపై సమగ్ర విచారణ జరిపించాలని, అలాగే తన పాస్‌బుక్‌కు సంబంధించిన డిజిటల్ సంతకం ప్రక్రియనువెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు జూన్ 15న జిల్లా ప్రజావాణి కార్యక్రమంలోఫిర్యాదు సమర్పించినట్లు అహ్మద్ ఖాన్ తెలిపారు. తన ఫిర్యాదుపై ఉన్నతాధికారులునిష్పక్షపాతంగా విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

## యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ టీం
# సభ్యులను అభినందించిన హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



**హనుమకొండ, జూన్ 16 (సాక్ష్యం)**
ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ సుబేదారి, హనుమకొండ లో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం 2025 - 2026 సంవత్సరంలో రక్తదాన శిబిరాల ద్వారా అత్యధికంగా (107) యూనిట్లు రక్తాన్ని సేకరించి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకటరమణారెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈ.వీ శ్రీనివాస్ రావు జిల్లా స్థాయి ఉత్తమ ఎ నీ జ ఎ లో అ వా ర్డ్ ను యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ సభ్యులకు అందించడం జరిగింది. తమకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి, ముఖ్యంగా రక్తదాతలకు ఈ అవార్డును అంకితం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకటరమణారెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈ.వీ శ్రీనివాస్ రావు, రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, పొట్లపెల్లి శ్రీనివాస్, యువ నేతాజీ ఫౌండేషన్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్ , వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), గుల్లెపెల్లి శివ కుమార్ (రెడ్ క్రాస్), పోలీస్ కానిస్టేబుల్ బొట్టు కమలాకర్, ఉప్పరపల్లి రాజ్ కుమార్,ఊరటి రవి కుమార్, అలువాల పృధ్వీ , పల్లె రాజిరెడ్డి, మూనిగల రాము, గజ్జెల సుమన్ పాల్గొన్నారు.

### ఎరువుల దుకాణాలను
## ఆకస్మికంగా తనిఖీ చేసిన ఏడిఏ జగదీష్ రెడ్డి



**మాడుగులపల్లి జూన్ 16 సాక్ష్యం;**
మాడుగులపల్లి మండలంలోనీ కన్నెకల్ పరిధిలోని ఎరువుల దుకాణాలను మంగళవారం మిర్యాలగూడ వ్యవసాయ సహాయ సంచాలకులు కె. జగదీష్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు.గోదాం లోని ఎరువుల స్టాక్ ను అమ్మిన ఎరువుల బిల్లులు,స్టాక్ రిజిస్టర్,ఈ పాస్ మెషిన్ ను పరిశీలించారు.ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ మండలంలో డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు



అందించాలని,యూరియా మరియు ఇతర ఎరువులను ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని ఎవరైనా ఎరువులను అధిక ధరలకు అమ్మిన,బ్లాక్ మార్కెట్ చేసిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఆయన తెలియజేశారు.అదేవిధంగా కన్నెకల్ రెవిన్యూ పరిధిలోని సర్పంచులకు, రైతులకు యూరియా బుకింగ్ యాప్ మీద అవగాహన కల్పించడం తోపాటు వారి సందేహాలను నివృత్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కన్నెకల్ సర్పంచ్ సర్నాల నాగరాజు ,ధర్మపురం సర్పంచ్ కొత్త దశరథ, మండల వ్యవసాయ అధికారి శివరాం కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష,మరియు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బడిబాటలో భాగంగా ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం



**మహబూబ్‌నగర్, జూన్ 16 ( సాక్ష్యం బ్యూరో )**
నేటి బడిబాట కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి కొత్తగా ఒకటవ తరగతిలో చేరిన విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించి వారికి విద్యాభ్యాసానికి శుభారంభం కల్పించారు. జిల్లా విద్యాశాఖ అధికారి పీ.ఎస్. వెంకటేశ్వర కాలనీ, పీ.ఎస్. బోయపల్లి పాఠశాలలను సందర్శించి, కొత్తగా నమోదైన విద్యార్థుల చేత సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని విద్యా ప్రయాణాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎంవో సుధాకర్ రెడ్డి, మహబూబ్‌నగర్ అర్బన్ ఎంఈఓ లక్ష్మణ్ సింగ్, పీఎస్ బోయపల్లి ప్రధానోపాధ్యాయులు హరినాథ్, పీఎస్ వెంకటేశ్వర కాలనీ ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, ప్రతి బాలబాలికను పాఠశాలలో చేర్పించి విద్యాభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు.

### ఘనంగా బేటీ బచావో బేటీ పడావో, మహిళల చట్టాలపైన
## అవగాహన అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహణ





**భూపాలపల్లి జూన్ 16 (సాక్ష్యం):**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఘనపూర్ మండలం, ధర్మరావుపేట గ్రామంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు మరియు జిల్లా సంక్షేమ అధికారి మల్లీ శ్వరి సూచనల మేరకు బేటీ బచావో బేటీ పడావో అవగాహన మరియు అక్షరాభ్యాసం కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని సూపర్వైజర్ శ్రీమతి లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పూజారి రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య అనేది ప్రతి బిడ్డకు ప్రాథమిక హక్కు అని, బాలురు -- బాలికలు అనే తేడా లేకుండా ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందేలా తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. బాలికల విద్య కుటుంబాభివృద్ధికి, సమాజ పురోగతికి బలమైన పునాది అని పేర్కొన్నారు. ల్లా మహిళా సాధికారత కేంద్రం ఇంచార్జి మిషన్ కోఆర్డినేటర్ శ్రీ క్రిష్ణ గారు మాట్లాడుతూ మహిళల సాధికారత, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిర్మూలన, బాలికల విద్యాభివృద్ధి మరియు మహిళల భద్రత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. మహిళలు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకొని స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. అలాగే మహిళలు మరియు బాలికల కోసం అందుబాటులో ఉన్న 181 మహిళా హెల్ప్‌లైన్, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 112 అత్యవసర సేవలు మరియు 14567 సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్‌లిలి సేవలను అవసరమైన సందర్భాల్లో వినియోగించుకోవాలని తెలిపారు. జెండర్ స్పెషలిస్ట్ శ్రీమతి అనూష కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు, బాలికల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు.

## విపత్తుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

● జిల్లా కలెక్టర్ సత్య శారద



**వరంగల్,16 జూన్ (సాక్ష్యం)**
రానున్న వర్షాకాలంలో సంభవించే సహజ విపత్తులు, వరదల నివారణకు సంబంధించి అన్ని శాఖలు ముందస్తు చర్యలు చేపట్టి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖ అధికారులు అప్రమత్తం గా ఉండాలి జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.శిధిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు,గృహాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావును సూచించారు. గ్రామాలలో నాలుగు రకాల చేతలను సేకరించుటలో ఏదో ఒక చిన్న గ్రామాన్ని ఎంపిక చేసి పైలెట్ ప్రాజెక్ట్ గా ఎంపిక చేసి గ్రామాలలో నాలుగు చెత్త ద్వారా చెత్త సేకరణ చేపట్టాలని అన్నారు. ఎలక్ట్రికల్ శాఖ ఆధ్వర్యంలో రారున ప్రకృతి వైపరీత్యాల వలన ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని ఎలక్ట్రిసిని ఎస్సీ ఆనందం కు సూచించారు.అగ్నిమాపక శాఖ అధికారులు ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరుగును.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి,అదనపు కలెక్టర్ వై వి గణేష్, డిఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీవోలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఆరోగ్య సేవలకు ఆదివారం తాళం

- విధులకు డుమ్మా కొడుతున్న వైద్యులు, సిబ్బంది
- రాయపర్తి లో తెరుచుకోని 24/7 ఆసుపత్రి
- రోగులకు అందని అత్యవసర వైద్యం





**రాయపర్తి, జూన్ 16(సాక్ష్యం):**
అత్యవసర సేవలు అన్నారు అత్యవసరానికి తాళం వేశారు ఇది ఎక్కడో కాదు వరంగల్ జిల్లాకు అతి సమీపంలో ఉన్న రాయపర్తి మండల కేంద్రంలో 24 గంటలు అత్యవసర వైద్య సేవలు అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కు ఆదివారం తాళం వేసి ఉండటంతో రోగులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఆదివారం ఉదయం 10 నుంచి 12.30 నిమిషాల వరకు కు ఒకరు రాలేదు. రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన సాక్ష్యం కి తాళం వేసిన దృశ్యం దర్శన మిచ్చింది. అసలే వైద్యులు లేక ప్రజారోగ్యం పడకేసిన రాయపర్తి పీహెచ్ సి లో సిబ్బంది సైతం సమయ పాలన పాటించక పోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాయపర్తి మండలం లో పెద్ద దిక్కుగా ఉన్న పెద్దసుపత్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24గంటలు విధులు నిర్వర్తించాలి. ఇక్కడ ఒక మెడికల్ ఆఫీసర్ తో పాటు ఒక పార్మాసిస్ట్, ఒక సిఎచ్ఓ, ఒక ల్యాబ్ టెక్నిషన్, స్టాఫ్ నర్సులు నల్గురు, సూపర్ వైజార్ లు ఇద్దరు, ఒక అటెండర్, ఒక నైట్ వాచ్ మెన్, 9 మంది ఏఎన్ఎం లు, ఈ ఆసుపత్రి పరిధిలో 11 సబ్ సెంటర్స్, ఆయుష్ సెంటర్ లు ఉన్నాయి. 9 గ్రామాలల్లో పల్లె దవాఖాన లు సైతం ఉన్నాయి. అక్కడ ఇదే పరిస్థితులు ఏ సమయం లోనైనా ఆపదలో ఉన్నవారికి వైద్యం అందించడం డాక్టర్ల విధి. అన్ని ప్రాంతాల ప్రజలకు వైద్యసేవలు అందించాలని రాయపర్తి మండల కేంద్రంలో 1999లో అప్పటి ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి పేద నిరుపేద ప్రజలకు పెద్దసుపత్రిగా ఉండడం తో 24 గంటలు పేద ప్రజలకు ఏసమస్య ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తుంటారు. పీఎచ్ సిలల్లో డాక్టర్ తో పాటు సిబ్బం దిని అందుబాటులో ప్రభుత్వం ఉంచాగా వారు మాత్రం అడిగే వారే లేరని విధులకు దుమ్మాలు కొడుతూఎం చక్క ఎంజాయ్ చేస్తున్నారు. సమర్థవంతంగా వైద్యం అందించాలని ప్రభుత్వం కోరిక నెరవేరాక పోతుంది. అందుకు విరుద్ధంగా అక్కడి సిబ్బంది, డాక్టర్లు వ్యవహరించడం విడ్డూరం. సెలవురోజులు, ఆదివారాలతో పని లేకుం డా వైద్య సేవలు అందించాల్సిన వారు అందుబాటులో ఉండడం లేదు. కానీ విధులు నిర్వర్తించడం లో మాత్రం అలసత్వం ఎక్కువుంది. ఆదివారం పుట్టిన నొప్పికి సోమవారం వరకు వేచి ఉండు అన్నట్టుగా ఇక్కడి వ్యవస్థ ఇలా తయారైంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఈ ఆసుపత్రి పై ప్రత్యేక దృష్టి పెట్టి దుమ్మాకొట్టే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి మండల ప్రజలు కోరుతున్నారు.

**ఖాళీగా ఉన్న పోస్టులు**
24గంటల ప్రభుత్వ ఆసుపత్రి లో ఖాళీ గా ఉన్న పోస్టు భర్తీ చేయడం లేదని ఓ వైపు వైద్యులు అనడం విడ్డురంగా ఉంది. పార్మాసిస్ట్, సీఎచ్ఓ, అటెండర్ పోస్ట్ ఖాళీగా ఉండడం తో నైట్ వాచ్ మెన్ నైట్ ఉండకుండా డే లోనే విధులు నిర్వహిస్తున్నట్లు తెల్సింది. వైద్యాధికారి మాత్రం చుట్టపు చూపు గా అప్పుడప్పుడు దర్శనం ఇచ్చి వెళ్తుంటాడు అనే విమర్శలు వస్తున్నాయి.

**సండే కదా ఆలస్యం కావోచ్చు తెల్సుకుంటాలే..!**
**డాక్టర్ అరుణ్ చంద్**
**మెడికల్ ఆఫీసర్ రాయపర్తి**
సండే అని ఆలస్యం కావొచ్చు నేను యాక్షన్ తీసుకుంటా, నాకు పని ఉంది నేను వేరే ఇంక్వైరి కోసం బైటికి వచ్చాను, నేను తెలుసు కుంటలే ఈ రోజు డ్యూటీ ఎవరిదో అని అడుగుతే తెల్సుకుంటా , డిప్టేషన్, ట్రాన్సపర్స్ అవుతున్నాయి కదా మన దగ్గర ఖాళీ గా ఉన్న పోస్టుల గురించి రాయండి. మీకు మీ పేపర్ కు మంచి పేరు వస్తది. అని సమాధానం దాటా వేస్తూ నాకు ఆఫీస్ నుంచి ఫోన్ వస్తుంది అని నిర్లక్ష్యంగా కాల్ కట్ చేశాడు.

## జూన్ 19,20 తేదీల్లో రైతాంగ ధర్నాలు జయప్రదం చేయండి

● రైతు భరోసా ఎగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ● యూరియా బుకింగ్ యాప్ రద్దు చేయాలి ● రాపర్తి సోమయ్య జిల్లా అధ్యక్షులు



**పాలకుర్తి, జూన్ 16(సాక్ష్యం):**
తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జూన్ 19,20 తేదీలలో జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహించే రైతాంగ ధర్నాలను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాపర్తి సోమయ్య పిలుపునిచ్చారు.ఈ మేరకు పాలకుర్తి మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద రైతాంగ ధర్నాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రాపర్తి సోమయ్య మాట్లాడుతూ రైతు భరోసా పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. కేవలం 2 ఎకరాల వరకు మాత్రమే రైతు భరోసా జమ చేశారు.కాబట్టి పెండింగ్‌లో ఉన్న గత 2025 వానకాలం, ప్రస్తుత యాసంగీ రైతు భరోసా నిధులు, గతం మరియు ప్రస్తుత యాసంగి సన్న ధాన్యం బోనస్ బకాయిలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో విద్యుత్ ప్రైవేటీకరణకు దారితీసే రైతు డిస్కంను వెంటనే వెనక్కి తీసుకోవాలని, రైతులపై అదనపు భారం మోపే చర్యలను ప్రభుత్వం నిలిపివేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పొటాష్, భాస్వరం, కాంప్లెక్స్ ఎరువుల ధరలను తగ్గించి, జిల్లా అధికార యంత్రాంగం రైతులకు సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.యూరియా బుకింగ్ యాప్ కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ఆ యాప్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం బ్యాంకులు వ్యవసాయ రంగానికి 18 శాతం పంట రుణాలు అందించాలని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దేవిధంగా కిసాన్ సమ్మాన్ పథకాన్ని జిల్లాలోని అర్హులైన రైతులందరికీ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ూజుూ లు క్లస్టర్ స్థాయిలో క్రాఫ్ బుకింగ్ ఫీల్డ్ కు వెళ్ళి చేయాలనీ, నకిలీ కల్తీ విత్తనాలు అరికట్టడానికి సమగ్ర చట్టం చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను ప్రకారం మీూ కనీస మద్దతు ధరలు నిర్ణయించాలని రైతుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న జూన్ 19,20 తేదీల రైతాంగ ధర్నాలలో రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## రాజీతో సమస్యను పరిష్కరించుకోండి

● వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**హనుమకొండ, జూన్ 16 (సాక్ష్యం)**
జూన్ 20 శనివారం జరిగే రెండవ జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ జాతీయ మెగా లోక్ ఆదాలత్ సంబందించి వరంగల్ కమిషనరేట్ పోలీసులు రూపొందించిన వాల్ పోస్టర్లను వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం విడుదల చేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ నెల 20తేది శనివారం రెండవ జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు

**సివిల్ తగాదా కేసులు,**
**ఆస్తి విభజన కేసులు,**
**కుటుంబపరమైన కేసులు,**
**వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు,**
**బ్యాంకు రికవరీ,**
**విద్యుత్ చౌర్యం,**
**చెక్ బౌన్స్**

మొదలగు కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుంది అని, రాజీయే రాజమార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు మరియు ఇతర పోలీస్ సిబ్బంది రాజీపడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించడం జరుగుతుంది. కావున ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలి అనుకున్నవారు పోలీస్ అధికారులకు సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుంది అని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమం వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీ సత్యనారాయణ, పరకాల ఇన్స్ స్పెక్టర్ క్రాంతికుమార్, దామెర ఎస్.ఐ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

## అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి

● వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్

**హనుమకొండ, జూన్ 16 (సాక్ష్యం)**
ప్రజల భద్రతే లక్ష్యంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. తమ పరిసరాల్లో ఎవరైనా గుర్తు తెలియని లేదా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కాజీపేట రైల్వే స్టేషన్‌లో సీసీఎస్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనుమానితుల తనిఖీలను పోలీస్ కమిషనర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా తనిఖీల్లో పాల్గొని పోలీసుల పనితీరును సమీక్షించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా ఉత్తర భారతదేశానికి చెందిన కొందరు నేరస్థులు వరంగల్ నగరానికి చేరుకుని ఇళ్ల చోరీలు, చైన్ స్నాచింగ్‌లు మరియు ఇతర ఆస్తి నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలను కలిపే ప్రధాన రైల్వే జంక్షన్లుగా వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లు ఉండటంతో నేరస్థులు రైలు మార్గాల ద్వారా ఇక్కడికి చేరుకుని నేరాలకు పాల్పడి, అనంతరం తిరిగి తమ స్వస్థలాలకు వెళ్లిపోతున్నారని తెలిపారు. ఈ తరహా నేరాలను అరికట్టేందుకు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సీసీఎస్ పోలీసుల ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. వీటిలో రెండు బృందాలు వరంగల్ రైల్వే స్టేషన్‌లో, మరో రెండు బృందాలు కాజీపేట రైల్వే స్టేషన్‌లో ప్రభుత్వ రైల్వే పోలీసులు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సహకారంతో విధులు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు.దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి, ముఖ్యంగా ఉత్తర భారతదేశం నుంచి వచ్చే రైళ్లలో ప్రయాణించే అనుమానిత వ్యక్తులను ఈ ప్రత్యేక బృందాలు గుర్తించి వారి సామగ్రితో పాటు పూర్తిస్థాయిలో తనిఖీ చేస్తున్నాయని తెలిపారు.వారి వ్యక్తిగత వివరాలను సేకరించి, వేలిముద్రలు, ఫొటోలు తీసి, ఫేస్ రికగ్నిషన్ సాంకేతికతతో పాటు పోలీసు శాఖ వద్ద ఉన్న ఆధునిక డేటాబేస్‌లతో సరిపోల్చి పరిశీలిస్తున్నామని వివరించారు. తనిఖీల సమయంలో ఎవరైనా వ్యక్తి గతంలో నేరాలకు పాల్పడినట్లు రికార్డుల్లో ఉన్నట్లయితే, పోలీసుల వద్ద ఉన్న సాంకేతిక పరికరాల ద్వారా క్షణాల్లో ఆ వివరాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అటువంటి సందర్భాల్లో వెంటనే అప్రమత్తమై సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ కోసం పోలీస్ స్టేషన్‌కు తరలిస్తామని చెప్పారు.అదేవిధంగా తనిఖీల సందర్భంగా సేకరించిన అనుమానితుల వివరాలను రికార్డుల రూపంలో భద్రపరుస్తున్నామని, నాలుగు మంది సభ్యులతో కూడిన ప్రతి ప్రత్యేక బృందం షిఫ్ట్‌ల వారీగా నిరంతరం విధులు నిర్వహిస్తూ అంతర్రాష్ట్ర నేరస్థుల కదలికలపై నిఘా ఉంచుతోందని కమిషనర్ తెలిపారు. ఈ తనిఖీల్లో క్రైమ్ అదనపు డీసీపీ బాలస్వామి, ఏసీపీ సదయ్య, జీఆర్పీ డీఎస్పీ కృపాకర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, కాజీపేట ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ నరేష్ కుమార్, ఎస్ఐ అభినవ్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





## ప్రభుత్వ భూముల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హనుమకొండ, జూన్ 16 (సాక్ష్యం)**
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 61 డివిజన్ లోని వెంకటాద్రి నగర్, ప్రశాంత్ నగర్ లలో కోటి రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నాటికి డివిజన్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో 90 శాతం పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. శంకుస్థాపనలు చేయడం ప్రారంభోత్సవాలు నిర్వహించడం వరకే తమ బాధ్యత కాదని, నిర్ణీత గడువులో పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యేపేర్కొన్నారు.ప్రతి పనికి కాలపరిమితి నిర్ణయించి, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. కాజీపేట అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్న ఆయన, గత ప్రభుత్వాల మాదిరిగా హామీలకేపరిమితం కాకుండా పనులు చేసి చూపిస్తున్నామని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాజీపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను వేగవంతం చేశామని, త్వరలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా కాజీపేట బస్ స్టాండ్ నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు జరుపుతున్నామని తెలిపారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.

### స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని

## సమర్థవంతంగా అమలు చేయాలి

### – డీఎంహెచ్‌వో డా శ్రీనివాసులు



**మహబూబ్‌నగర్, జూన్ 16 ( సాక్ష్యం )**
బండ్లగేరి సమీపంలోని మాతా శిశు ఆరోగ్య సేవా కేంద్రం (ఎంసీహెచ్ సెంటర్)ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏ. శ్రీనివాసులు మంగళవారం సందర్శించి ఆరోగ్య సిబ్బందితో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు నుంచి ప్రారంభమైన "స్టాప్ డయేరియా" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఐదేళ్లలోపు చిన్నారులు డయేరియా బారిన పడకుండా ఆరోగ్యకరమైన ఆహారం, సురక్షితమైన తాగునీరు, పరిసరాల పరిశుభ్రతపై తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణీ స్త్రీల్లో రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా అందించాలని, టిటి ఇంజెక్షన్లను సమయానుకూలంగా ఇవ్వాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. అలాగే చిన్నారులకు 100 శాతం టీకాలు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మాతా శిశు సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు హనుమకొండకు

## ఎపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ రాక



**హనుమకొండ, జూన్ 16 (సాక్ష్యం)**
హనుమకొండకు చెందిన బాలుడు, పవన్ అభిమాని నిరంజన్ కు ప్రపంచంలో చికిత్స లేని జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్నాడు. తన చివరి కోరికగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలవాలని కోరాడు. విషయం తెలుసుకున్న పవన్ కళ్యాణ్.. బాలుడిని కలిసేందుకు బుధవారం హనుమకొండకు రానున్నారు. హనుమాన్ నగర్ పెగడపల్లి డబ్బాల సమీపంలోని బాలుడి నివాసంలో కలిసి పరామర్శించనున్నారు. అనంతరం వరంగల్ చారిత్రక భద్రకాళి అమ్మవారిని దర్శించుకోనున్నారు.

### నీలోఫర్ ఆసుపత్రికి బదిలీపై

## వెళ్తున్న ప్రొఫెసర్ డాక్టర్ నీలిమకు ఘన సన్మానం





**నాగర్ కర్నూల్ : జూన్ 16 (సాక్ష్యం)**
నాగర్ కర్నూల్ జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో గైనకాలజీ విభాగాధిపతిగా సేవలందించిన ప్రొఫెసర్ డాక్టర్ వి. నీలిమకు నీలోఫర్ ఆసుపత్రికి బదిలీ అయిన సందర్భంగా ఆసుపత్రి గైనకాలజీ వైద్యులు, నర్సింగ్ అధికారులు మరియు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సహచర వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మాట్లాడుతూ జిల్లాలో మాతా--శిశు ఆరోగ్య సేవల అభివృద్ధికి డాక్టర్ నీలిమ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. గర్భిణీలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఆమె ప్రత్యేక శ్రద్ధ చూపారని తెలిపారు. నాగర్ కర్నూల్ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో విధులు నిర్వహించిన కాలంలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తూ, మహిళల ఆరోగ్య సంరక్షణకు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నీలిమను శాలువాతో సన్మానించి, జ్ఞాపిక అందజేసి భవిష్యత్తులో రాష్ట్ర స్థాయిలో మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## స్వామివారిని దర్శించుకున్న వాణి ప్రసాద్ ఐఏఎస్



**యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్..**
యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్న వాణి ప్రసాద్ ఐఏఎస్ సెక్రటరీ టూరిజం ఆలయంలో వీరు ప్రత్యేక పూజలు పాల్గొని అనంతరం వేద మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి అక్షింతలు అందజేయగా, ఈవో భవాని శంకర్ లడ్డు ప్రసాదం స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. వీరి వెంట జంగయ్య, శ్రీను నాయక్ ఉన్నారు.

## వయోవృద్ధులపై వేధింపుల నివారణకు పూనుకోవాలి

### గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్



**భూపాలపల్లి జూన్ 16 (సాక్ష్యం):**
ప్రపంచ వయోవృద్ధులపై వేధింపుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వృద్ధాశ్రమం ని సందర్శించిన జిల్లా న్యాయసేవాధికార సంస్థ. పెద్దవారు కుటుంబాలకు పునాదుల్లాంటి వారని వారిని గౌరవించుకోవడం, వారిని వేధింపుల నుండి కాపాడడం అందరి బాధ్యత అని గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్ అన్నారు. ప్రపంచ వయోవృద్ధులపై వేధింపుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం భూపాలపల్లి పట్టణంలోని వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. వారి బాగోగులు అడిగితెలుసుకున్నారు. వయోవృద్ధుల సంక్షేమంకోసం కఠిన చట్టాలు ఉన్నాయని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది భూక్యా రమేష్ నాయక్, వయోవృద్ధులు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ ఆవరణంలో రాకేష్ రెడ్డి ఈ-క్లాసెస్ ఆప్ కరపత్రం ఆవిష్కరణ



**హనుమకొండ, జూన్ 16 (సాక్ష్యం)**
ఈ నెల 18న హన్మకొండలో విడుదల కాబోయే యాప్ ఆవిష్కరణకు విద్యార్థి, నిరుద్యోగ యువత తరలి రావాలని పిలుపు ఉన్నత విద్యావంతుడు, గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల కోచింగ్‌తో, పాటు ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే పేద, మధ్యతరగతి విద్యార్థుల కోసం అవసరమైన విద్యా, నైపుణ్యాలను అందించే రాకేష్ రెడ్డి ఈ-క్లాసెస్ ఆప్ ను ఉచితంగా అందించడం హర్షణీయం అని **బిఆర్ఎస్ సీనియర్ నాయకులు**
**డా. పాలమాకుల కొమురయ్య**
**కాకతియ యూనివర్సిటీ బిఆర్ఎస్వి ఇంచార్జ్**
**డా. జెట్టి రాజేందర్ తెలిపారు.**
ఈ నెల 18న, హన్మకొండ గోకుల్ నగర్ లోని అంబేద్కర్ భవన్ లో ఉదయం 10 గంటలకు యాప్ ఆవిష్కరణ, డెమో ప్రదర్శన ఉంటుందని, ఈ యాప్‌ను నిరుద్యోగ యువతను ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రముఖ విద్యావేత్త చక్రవర్తి ఈ-క్లాస్ రూమ్ వారి సహకారంతో రూపొందించడం జరిగిందని కావున కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని విద్యార్థులు, ఉమ్మడి వరంగల్ జిల్లా నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి యూనివర్సిటీ నాయకులు పిన్నింటి విజయ్ కుమార్, ఇండస్ ఫౌండేషన్ కార్యదర్శి పురుషోత్తం, ఫౌండేషన్ సభ్యులు పెండ్లి పురుషోత్తం రెడ్డి, ఐలోని అభిషేక్, రేవంత్, తిరుపతి, యువరాజ్, యూనివర్సిటీ ప్రముఖులు చంద్రమౌళి, చందు, రాజేష్, క్రాంతి, చిప్ప కావ్య, ఎలెందర్ తదితరులు పాల్గొన్నారు

## వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్, జూన్ 16 (సాక్ష్యం బ్యూరో)**
వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆధ్వర్యంలో వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఈఓ జడ్పీ (ఇన్‌చార్జి డీపీఓ), డీఎంహెచ్‌వో, డీఆర్‌డీఓ, పంచాయతీరాజ్ ఈఈ, జిల్లా వ్యవసాయ అధికారి, మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్, దేవరకద్ర మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులు అన్ని లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి గత సంవత్సరంలో ఎదురైన సమస్యలు, వాటి పరిష్కారాలు, ఈ ఏడాది తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై చర్చించాలని సూచించారు. వర్షాకాలంలో ప్రజలకు అవసరమైన సమాచారం అందించేందుకు మండల, గ్రామ స్థాయి అధికారులు తమ సంప్రదింపు వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రతి రెండు రోజులకు ఒకసారి గ్రామాల్లో టామ్‌టామ్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్లపై వర్షపు నీరు ప్రవహించే ప్రాంతాలు, కాజ్‌వేలు, ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఎక్కడైనా అనుకోని ఘటనలు జరిగితే వెంటనే స్పందించి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా ప్రతి మండలంలో ఎంపీడీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి వచ్చే సమాచారాన్ని మండల, డివిజన్ స్థాయి అధికారులకు వేగంగా చేరవేయడం ద్వారా సమస్యలను త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండల స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

## వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం

### – మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్ పర్సన్





**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్...**
యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయంలో వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ అధికారులతో మున్సిపల్ కమిషనర్, చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యుల అధ్యక్షతన అత్యవసర సమీక్షా సమావేశం ప్రజల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం -- విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి: రానున్న వర్షాకాలాన్ని (ముసురు, భారీ వర్షాలు) దృష్టిలో ఉంచుకొని పట్టణంలో ఎలాంటి విద్యుత్ అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్ విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ( ఏ ఈ ), లైన్‌మెన్లతో మున్సిపల్ కార్యాలయంలో ఒక ఉన్నత స్థాయి అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు.

**ముఖ్యమైన ఆదేశాలు:**
చెట్ల కొమ్మల తొలగింపు ( ట్రీ ట్రిమ్మింగ్ ): వర్షాలు, ఈదురుగాలుల వల్ల విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తక్షణమే మున్సిపల్ సిబ్బంది సహాయంతో తొలగించాలి. పట్టణంలోని వంగిపోయిన, తుప్పు పట్టిన ఇనుప విద్యుత్ స్తంభాలను గుర్తించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలి. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడినా లేదా స్తంభాలు విరిగిపడినా నిమిషాల వ్యవధిలోనే స్పందించి సరఫరా నిలిపివేసేలా 24/7 అత్యవసర బృందాలను ఎమర్జెన్సీ టీమ్స్ అందుబాటులో ఉంచాలి.పట్టణంలో ఎక్కడా లూజ్ వైర్లు వేలాడకుండా చూడాలి. వీధి దీపాల స్విచ్ బాక్సులకు ఇన్సులేషన్ సరిగ్గా ఉండేలా లైన్‌మెన్లు నిరంతరం పర్యవేక్షించాలి.

**ప్రజలకు మున్సిపల్ కమిషనర్ విజ్ఞప్తి:**
వర్షాకాలంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ కోరారు. వర్షం పడే సమయంలో విద్యుత్ స్తంభాల కింద నిలబడకూడదని, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు వెళ్లవద్దని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉంటే తక్షణమే విద్యుత్ శాఖ కి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఏఈ, సబ్-ఇంజనీర్లు, ఏరియా లైన్‌మెన్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి ఏరియా కేటీకే 5 ఇంక్లైన్‌లో సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై గని మేనేజర్ మాచర్ల రమేష్‌తో ఐఎన్టీయూసీ నాయకులు





**(సాక్ష్యం) జయశంకర్ - భూపాలపల్లి, జూన్ 16 :**
భూపాలపల్లి ఏరియా కేటీకే 5 ఇంక్లైన్ లో సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై గని మేనేజర్ మాచర్ల రమేష్ తో ఐఎన్టీయూసీ నాయకులు మాట్లాడారు. భూపాలపల్లి ఏరియా కేటీకే 5 ఇంక్లైన్ భూగర్భ గని నందు ఫిట్ సెక్రెటరీ గట్టు రాజు ఆధ్వర్యంలో.. భూపాలపల్లి ఏరియా ఐఎన్టియుసి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బేతెల్లి మధుకర్ రెడ్డి , జనరల్ సెక్రటరీ పశునుటి రాజేందర్ ,మహిళా విభాగం అధ్యక్షురాలు మద్దినేని శేషా రత్నం, డిప్యూటీ జనరల్ సెక్రటరీ రత్నం సమ్మి రెడ్డి గని నందు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్మికులతో మాట్లాడి తెలుసుకొని గని మేనేజర్ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా సమస్యల గురించి గని మేనేజర్ తో మాట్లాడుతూ... రక్షణతో కూడిన ఉత్పతికై సింగరేణియుల కుటుంబాల పరిరక్షణకై సుచనలను, సలహాలను స్వీకరించి నేషనల్ సేఫ్టీ గైడెలెన్స్ ప్రకారం చట్టబద్ధమైన రక్షణతో కూడిన ఉత్పత్తికి యాజమాన్యం కృషి చేయాలని కోరారు.. కేటీకే-5 ఇంక్లైన్ లో నూతనంగా కంపెనీలోకి వచ్చిన జనరల్ అసిస్టెంట్ ట్రైనీ గైడ్ హాజరు అవుతున్నారు. తగ్గించి రక్షణతో కూడినటువంటి ఉత్పత్తి తీయాలని కోరారు.. గత కొంత కాలంగా కేటీకే- 5 ఇంక్లైన్ నందు ఆర్వో వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడం వలన కార్మికులు త్రాగు నీరు లేక ఇబ్బంది పడుతున్నారు. మర్మతులు చేయించి వెంటనే తాగు నీరు అందించాలని, లేదా నూతన ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. కేటీకే - 5 ఇంక్లైన్ నందు కార్మికులకు నాణ్యమైన పని ముట్లు అందచెయ్యాలి.

### ఏఐ జ్ఞానంతో భవిష్యత్ అవకాశాలు

## అందిపుచ్చుకోవాలి: ప్రిన్సిపాల్ మదన్ మోహన్




**నాగర్ కర్నూల్: జూన్ 16 (సాక్ష్యం)**
తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఇంటర్న్షిప్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ సైన్స్ కళాశాలలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఎన్. మోహన్ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవగాహన, జ్ఞానం పెంపొందించుకోవడంతో పాటు ఆ అంశాలను పాఠశాల విద్యార్థులకు కూడా వివరించి సాంకేతిక పరిజ్ఞానంపై చైతన్యం కల్పించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ మదన్ మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి శిక్షణ అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో మరింత జ్ఞానం సంపాదించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ అంజయ్య, అధ్యాపకులు వనిత, ఉమాదేవి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.





### రైతులకు సరిపడా యూరియాను

## ముందస్తుగానే అందుబాటులో ఉంచాలి

### – సర్పంచ్ సర్నాల నాగరాజు



**మాడుగులపల్లి జూన్ 16 సాక్ష్యం;**
మాడుగులపల్లి మండల కన్నెకల్ గ్రామంలోని సర్పంచ్ సర్నాల నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం ఏవో శివరాం కు వినతిపత్రం అందజేశారు. కనేకల్ పాత గ్రామపంచాయతీ పరిధిలోని ఏడు గ్రామాలలో సుమారు పదివేల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది సుమారుగా 32 80 రైతులు ఉన్నారు. ఎకరానికి రెండు బస్తాల యూరియా అయిన పది ఎకరాలకు 20వేల బస్తాలు అవసరం కాగా రైతులకు అవసరమైన యూరియా బస్తాలను కనేకల్ పరిధిలోని ఎన్డిఎంఎస్,ఎఫ్పి ఓకు 80 శాతం యూరియాను కేటాయించి మిగిలిన యూరియాను ప్రైవేట్ షాపులకు కేటాయించి రైతులకు సరిపడా యూరియాను ముందస్తుగానే అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మపురం సర్పంచ్ దశరథ గ్రామ ప్రజలు రైతులు తదితరులు పాల్గొన్నారు.



# న్యూజిలాండ్‌తో డ్రా చేసుకున్న ఇరాన్

## ఈజిప్ట్‌తో 1-1తో డ్రా అయిన బెల్జియం
## సౌదీ అరేబియా, ఉరుగ్వే మ్యాచ్ డ్రా

ఫిఫా వరల్డ్‌కప్ 2026లో తొలి మ్యాచ్‌ల నుంచే అనూహ్య ఫలితాలు నమోదవుతున్నాయి. సోమవారం మూడు మ్యాచ్‌లు జరగ్గా, అన్నీ కూడా డ్రానే అయ్యాయి. అయితే ఈ మెగా టోర్నీకి ముందు రాజకీయ వివాదాలు, నిరసనలతో వార్తల్లో నిలిచిన ఇరాన్ జట్టు, మైదానంలోనూ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. ప్రపంచకప్‌లో అట్టడుగు ర్యాంక్‌లో ఉన్న న్యూజిలాండ్‌తో ఇరాన్ 2-2తో డ్రా కావడంతో నాకౌట్ అవకాశాలకు తొలి మ్యాచ్‌లోనే ఎదురుదెబ్బ తగిలింది. మరోవైపు బెల్జియం, ఉరుగ్వే వంటి జట్లు కూడా తమ తొలి మ్యాచ్‌ల్లో విజయం సాధించలేకపోయాయి. లాస్ ఏంజెలెస్‌లో జరిగిన గ్రూప్-జి మ్యాచ్‌లో ఇరాన్ రెండుసార్లు వెనుకబడినా పోరాడి 2-2తో డ్రా చేసుకుంది. మ్యాచ్ ఏడో నిమిషంలోనే న్యూజిలాండ్ ఆధిక్యంలోకి వెళ్లింది. క్రిస్ వుడ్ ఇచ్చిన పాస్‌ను ఎలిజా జస్ట్ అద్భుతంగా గోల్‌గా మలిచాడు. ఆరంభ షాక్ నుంచి కోలుకున్న ఇరాన్ ఎటాక్ పెంచింది. స్టార్ ఫార్వర్డ్ మెహదీ తారెమీ చేసిన ప్రయత్నం పోస్టును తాకి బయటకు వెళ్లింది. చివరకు 32వ నిమిషంలో రామిన్ రెజాయియాన్ సమం చేశాడు. అయితే ఆ తర్వాత మరోసారి ఎలిజా జస్ట్ గోల్ చేసి న్యూజిలాండ్‌కు ఆధిక్యం అందించాడు. ఇరాన్ ఓటమి దిశగా సాగుతున్న సమయంలో మహమ్మద్ మొహేబీ 64వ నిమిషంలో హెడ్డర్‌తో గోల్ చేసి స్కోరును 2-2గా మార్చాడు. చివరి అరగంటపాటు ఇరాన్ ఎటాక్స్ చేసినా విజయం అందుకోలేకపోయింది. దీంతో ప్రపంచకప్ నాకౌట్ దశకు తొలిసారి చేరాలన్న ఇరాన్ ఆశలకు తొలి మ్యాచ్‌లోనే గట్టి దెబ్బ తగిలింది. ఇరాన్ మ్యాచ్‌కు ముందు, తర్వాత రాజకీయ ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వందలాది మంది నిరసనకారులు స్టేడియం వెలుపల ఆందోళనలు నిర్వహించారు.

ఆ జట్టు ప్రజలకు ప్రాతినిధ్యం వహించడం లేదని వారు ఆరోపించారు. స్టేడియం లోపల కూడా అభిమానులు ఫిఫా నిబంధనలను ధిక్కరిస్తూ ఆందోళనలకు ముందు ఉపయోగించిన ఇరాన్ జెండాలను ప్రదర్శించారు. టీషర్టులు, బ్యానర్లు, జెండాల రూపంలో అవి కనిపించాయి. జాతీయ గీతం వినిపించినప్పుడు కొందరు అభిమానులు వెనుదిరిగి నిలబడగా, మరికొందరు నినాదాలు చేశారు. భద్రతా సిబ్బంది కొన్ని చోట్ల ఆంక్షలు విధించినప్పటికీ, మ్యాచ్ మొత్తం రాజకీయ సందేశాలు కనిపించాయి. సియాటెల్‌లో జరిగిన మరో గ్రూప్-జి పోరులో బెల్జియం, ఈజిప్ట్ 1-1తో డ్రా అయ్యాయి. మొహమ్మద్ సలాహ్ పాస్‌ను అందుకున్న ఎమామ్ అషూర్ 19వ నిమిషంలో గోల్ చేసి ఈజిప్ట్‌కు ఆధిక్యం అందించాడు. దీంతో ప్రపంచకప్‌లో తొలి విజయంపై ఈజిప్ట్ ఆశలు చిగురించాయి. మ్యాచ్ అంతా బెల్జియం ఆధిపత్యం ప్రదర్శించినా అవకాశాలను గోల్స్‌గా మలచలేకపోయింది.

65వ నిమిషంలో రొమెలు లుకాకు మైదానంలోకి అడుగుపెట్టిన కేవలం 22 సెకన్లకే ప్రభావం చూపించాడు. థామస్ మునియర్ ఇచ్చిన క్రాస్‌ను అడ్డుకునే క్రమంలో ఈజిప్ట్ ఆటగాడు మహ్మద్ హానీ గోల్ చేయడంతో బెల్జియం సమం చేసింది. చివరి నిమిషాల్లో ఇరు జట్లు విజయం కోసం ప్రయత్నించినా స్కోరు మారలేదు. దీంతో ప్రపంచకప్‌లో తొలి విజయాన్ని అందుకోవాలన్న ఈజిప్ట్ కల మరోసారి నెరవేరలేదు. మయామిలో జరిగిన గ్రూప్-హెచ్ మ్యాచ్‌లో ఉరుగ్వే 1-1తో సౌదీ అరేబియాతో డ్రా అయింది. మ్యాచ్ ప్రారంభం నుంచే ఉరుగ్వే బంతిపై ఆధిపత్యం ప్రదర్శించినా గోల్ చేయలేకపోయింది. 41వ నిమిషంలో అబ్దులెలాహ్ అల్ అమ్రీ గోల్‌తో సౌదీ అరేబియా ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో అర్ధభాగంలో ఉరుగ్వే స్పీడ్ పెంచింది. ఫెడెరికో వాల్వెర్డే, ఫెడెరికో వినాస్ పలుమార్లు అవకాశాలు సృష్టించినా సౌదీ గోల్‌కీపర్ మహ్మద్ అల్ ఓవైస్ అద్భుత సేవ్‌లతో నిలిచాడు. అయితే 80వ నిమిషంలో వినాస్ హెడ్డర్‌ను అడ్డుకున్న గోల్‌కీపర్ నుంచి వచ్చిన రీబౌండ్‌ను మాక్సిమిలియానో అరౌజో గోల్‌గా మలిచి ఉరుగ్వేకు ఊరటనిచ్చాడు. మ్యాచ్ ముగిసే సరికి ఇరు జట్లు చెరో పాయింట్‌తో సరిపెట్టుకున్నాయి.

## రూ.50కే ఉప్పల్ మ్యాచ్ టికెట్స్..

తెలంగాణలో యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) నిర్వహిస్తున్న టీజీ20 లీగ్ 2026 తొలి సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూన్ 21 నుంచి హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా ఈ టోర్నీకి తెరలేవనుంది. అయితే ఈ టోర్నీకి టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు. టైటిల్ స్పాన్సర్‌షిప్‌ను శ్రీనిధి యూనివర్సిటీ దక్కించుకుంది. లీగ్ ప్రారంభానికి సమయం దగ్గరపడటంతో అభిమానులను ఆకర్షించడానికి హెచ్‌సీఏ, ఫ్రాంచైజీలు క్యాంపైన్‌ను నిర్వహిస్తున్నాయి. తెలంగాణలో యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) నిర్వహిస్తున్న టీజీ20 లీగ్ 2026 తొలి సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూన్ 21 నుంచి హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా ఈ టోర్నీకి తెరలేవనుంది. అయితే ఈ టోర్నీకి టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు. టైటిల్ స్పాన్సర్‌షిప్‌ను శ్రీనిధి యూనివర్సిటీ దక్కించుకుంది. లీగ్ ప్రారంభానికి సమయం దగ్గరపడటంతో అభిమానులను ఆకర్షించడానికి హెచ్‌సీఏ, ఫ్రాంచైజీలు క్యాంపైన్‌ను నిర్వహిస్తున్నాయి. ఈ టోర్నీలో 8 జట్లు ఇతర టీమ్స్‌తో ఒక్కో మ్యాచ్ ఆడనున్నాయి. లీగ్ దశ ముగిసే సరికి టాప్-4లో నిలిచిన టీమ్స్ ప్లే ఆఫ్స్ ఆడుతాయి. జులై 11న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. పాలమూరు స్ట్రైకర్, అన్విత ఖమ్మం ఏసెస్ మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. మంగళవారం బేగంపేట్‌లో నిర్వహించిన



కార్యక్రమానికి హెచ్‌సీఏ కార్యదర్శి జీవన్ రెడ్డి, టీజీ20 గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ ఆగం రావు, హెచ్‌సీఏ, ఫ్రాంచైజీల యాజమానులు హాజరయ్యారు. టీజీ20 గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ ఆగం రావు లీగ్ వివరాలను వెల్లడించారు. విజేత జట్టుకు రూ. కోటి నగదు బహుమతి, రన్నరప్‌గా నిలిచిన టీమ్‌కు రూ.50 లక్షలు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.25 లక్షల చొప్పున ప్రైజ్‌మనీ అందజేస్తామని చెప్పారు. ఉప్పల్ స్టేడియంలో తొలి మ్యాచ్‌కు ముందు వేడుకలు ఉంటాయని చెప్పారు. మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మ్యూజిక్ కాన్సర్ట్, లేజర్ షో ఉంటుందని చెప్పారు. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ మినహా.. ఐపీఎల్ రూల్స్ అన్నీ ఈ లీగ్‌లో ఉంటాయని స్పష్టం చేశారు. డిస్ట్రిక్ యాప్‌లో మ్యాచ్‌ల టికెట్లు అందుబాటులో ఉన్నాయని, ఒక్కో టికెట్ ధర రూ.50 నుంచి 100గా నిర్ణయించామని చెప్పారు. ఈ మ్యాచ్‌లన్నీ స్టార్ స్పోర్ట్స్ తెలుగు ఛానెల్‌తో పాటు ఓటీటీ ఫ్లాట్‌ఫామ్ జియో హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి.

## రెండో వన్డేలో కుల్దీప్ యాదవ్ రీఎంట్రీ..?

అఫ్గానిస్థాన్‌తో మూడు వన్డేల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. బుధవారం లక్నో వేదికగా జరగనున్న రెండో వన్డేలో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టు పర్యాటక అఫ్గానిస్థాన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించి మూడు వన్డేల సిరీస్‌ను ఆఖరి మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో కైవసం చేసుకోవాలనే పట్టుదలతో




టీమిండియా ఉంది. తద్వారా ఆఖరి మ్యాచ్‌లో బెంచ్ బలాన్ని పరీక్షించాలని టీమిండియా మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఈ సిరీస్‌తోనే టీమిండియా వన్డే ప్రపంచకప్ 2027 సన్నాహకాలను ప్రారంభించింది. మెగా టోర్నీకి కావాల్సిన కాంబినేషన్ కోసం ప్రయోగాలు చేస్తామని సిరీస్ ప్రారంభానికి ముందే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశాడు. ఈ క్రమంలోనే రెండో వన్డేలో భారత తుది జట్టులో మార్పులు ఉంటాయనే చర్చ జరుగుతోంది. తొలి మ్యాచ్‌లో సీనియర్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను కాదని హర్ష్‌దూబేను టీమిండియా ఆడించింది. అతను అరంగేట్ర మ్యాచ్‌లోనే (3/47) మూడు వికెట్లతో సత్తా చాటాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో తీవ్రంగా నిరాశపర్చడం, అఫ్గాన్‌తో ఏకైక టెస్ట్‌లో వికెట్లు తీయకపోవడంతో కుల్దీప్ యాదవ్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అరంగేట్ర పేసర్ మానవ్ సుతార్ ఐదు వికెట్లతో సత్తా చాటగా.. కుల్దీప్ యాదవ్ ఆ స్థాయిలో రాణించలేకపోయాడు. కానీ కుల్దీప్ యాదవ్‌కు వన్డేల్లో మంచి రికార్డ్ ఉంది. ఈ క్రమంలోనే అతన్ని రెండో వన్డేల్లో బరిలోకి దించే అవకాశం ఉంది. తొలి వన్డేలో రోహిత్ శర్మ మణికట్టుకు గాయమైంది. మైదానంలోనే చికిత్స తీసుకున్న అతను ఆ తర్వాత ఆట కొనసాగించినా.. శుభ్‌మన్ గిల్‌తో సమన్వయ లోపం కారణంగా రనౌటయ్యాడు. తొడ కండరాల గాయం నుంచి ఇటీవలే కోలుకున్న రోహిత్.. తొలి వన్డేలో చాలా అసౌకర్యంగా కనిపించాడు. దాంతోనే అతను రెండో వన్డే ఆడటంపై సందేహాలు నెలకొన్నాయి. అతనికి విశ్రాంతి ఇస్తే యశస్వి జైస్వాల్ ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడు. జైస్వాల్ కూడా చాలా రోజుల నుంచి వన్డే టీమ్‌లో అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. ధర్మశాల వన్డేలో అరంగేట్రం చేసిన గుర్నూర్ బ్రార్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. మూడు వికెట్లతో అఫ్గాన్ పతనాన్ని శాసించాడు. జట్టులో ఉన్న మరో అన్‌క్యాప్‌డ్ ప్లేయర్ ప్రిన్స్ యాదవ్ ఆఖరి వన్డే వరకు వేచి చూడాల్సిందే. ఒకవేళ అతనికి అవకాశం ఇవ్వాలనుకుంటే గుర్నూర్ బ్రార్, ప్రసిధ్ కృష్ణలో ఒకరు బెంచ్‌కు పరిమితమవుతారు. మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పు జరిగే అవకాశం లేదు.

**అఫ్గాన్‌తో రెండో వన్డేకు భారత తుది జట్టు(అంచనా)**
శుభ్‌మన్ గిల్(కెప్టెన్), రోహిత్ శర్మ/యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్(కీపర్), వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ రెడ్డి, హర్ష్‌దూబే, గుర్నూర్ బ్రార్, అర్ష్‌దీప్ సింగ్,ప్రసిధ్ కృష్ణ/ప్రిన్స్ యాదవ్.

## ఆటపై దృష్టి పెట్టు వైభవ్..
### శ్రీలంక లెజెండ్ అనుర తెన్నెకూన్ సలహా..!

శ్రీలంక ఎ-జట్టుతో మ్యాచ్ ముగిసిన అనంతరం ఒక అద్భుత దృశ్యం వెలుగులోకి వచ్చింది. లంక తొలి వన్డే కెప్టెన్, 70 ఏళ్ల అనుర తెన్నెకూన్ భారత 15 ఏళ్ల యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ కోసం డ్రెస్సింగ్ రూమ్ బయట ఓపిగ్గా ఎదురుచూశారు. వైభవ్ బయటకు రాగానే లంక దిగ్గజం పాదాలకు నమస్కరించాడు. వైభవ్ ఐపీఎల్ బ్యాటింగ్‌కు తాను పెద్ద ఫ్యాన్‌నని చెప్పిన తెన్నెకూన్, బయటి విషయాలను పట్టించుకోకుండా ఆటపైనే దృష్టి పెట్టాలని అతడికి హితవు పలికారు. శ్రీలంక వేదికగా జరుగుతున్న ఏ-జట్ల ముక్కోణపు సిరీస్ 2026లో ఒక ఆసక్తికర సంఘటన వెలుగులోకి వచ్చింది. సోమవారం దంబుల్లా వేదికగా భారత్ ఏ, శ్రీలంక ఏ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. సూపర్ ఓవర్ వరకూ సాగిన ఈ మ్యాచులో తిలక్ వర్మ సారథ్యంలోని భారత జట్టు ఓడిపోయింది. అయితే మ్యాచ్ తర్వాత వైభవ్ సూర్యవంశీతో శ్రీలంక ఆటగాళ్లు గొడవకు దిగడం చర్చనీయాంశంగా మారింది. కానీ ఇదంతా జరిగిన తర్వాత స్టేడియంలో జరిగిన ఓ సంఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మ్యాచ్ ఓటమి తర్వాత టీమిండియా ఆటగాళ్లు తీవ్ర నిరాశతో డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లారు. స్టేడియంలోని



ప్రేక్షకులందరూ వెళ్ళిపోయారు. అయినప్పటికీ ఓ 70 ఏళ్ల మాజీ క్రికెటర్ మాత్రం టీమిండియా డ్రెస్సింగ్ రూమ్ బయటే ఎదురుచూశారు. ఆయనే శ్రీలంక క్రికెట్ దిగ్గజం అనుర తెన్నెకూన్ . శ్రీలంక క్రికెట్ చరిత్రలో తొలి వన్డే కెప్టెన్‌గా రికార్డు క్రియేట్ చేసిన అనుర తెన్నెకూన్.. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కోసం ఎదురుచూశారు. అతడితో మాట్లాడేందుకు ఓపిగ్గా నిలబడి ఉన్నారు. కాసేపటికే డ్రెస్సింగ్ రూమ్ నుంచి బయటకు వచ్చిన వైభవ్.. తెన్నెకూన్‌ను చూసి అక్కడే ఆగిపోయాడు. అనంతరం ఆయన పాదాలకు నమస్కరించాడు. నిజానికి మ్యాచ్ ముగిసిన కాసేపటికే ఆటగాళ్లు స్టేడియం నుంచి హోటల్‌కు వెళ్లిపోతారు. కానీ శ్రీలంక క్రికెటర్లతో వాగ్వాదం తర్వాత భారత క్రికెటర్లు డ్రెస్సింగ్ రూమ్‌లో కాస్త ఎక్కువ సమయం మాట్లాడుకున్నారు. వైభవ్ బయటకు రాగానే అనుర తెన్నెకూన్ అతనితో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా తెన్నెకూన్ విలేకరులతో మాట్లాడుతూ.. "వైభవ్ సూర్యవంశీ అసాధారణమైన టాలెంట్ గల ఆటగాడు. ఐపీఎల్ 2026లో అతను కొట్టిన సిక్సర్లు, ఫోర్లు చూసి నేను అతనికి పెద్ద అభిమానిని అయిపోయా" అని అన్నారు. "మ్యాచ్ తర్వాత నేను అతడికి ఒకటే సలహా ఇచ్చా. బయట వినిపించే ఎలాంటి విమర్శలను, గొడవలను అస్సలు పట్టించుకోవద్దు. కేవలం నీ ఆటపైనే దృష్టి పెట్టు. ఈరోజు నీకు బ్యాటింగ్‌లో కలిసి రాలేదు.. కానీ ఇదంతా ఆటలో ఒక భాగమే. ప్రతిరోజూ మనం అనుకున్నట్లు ఆడలేం" అని శ్రీలంక మాజీ కెప్టెన్.. వైభవ్‌కు సూచనలు చేశారు. కాగా వైభవ్ లాంటి యువ ఆటగాడి కోసం 70 ఏళ్ల క్రికెట్ దిగ్గజం ఎదురుచూడటం అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఇది వైభవ్ టాలెంట్‌కు ప్రతీక అని నెటిజన్లు పేర్కొంటున్నారు.

## గొడవపై వైభవ్ సూర్యవంశీకి జరిమానా

కేవలం 15 ఏళ్ల వయసు ఉందని చెప్పి



ఎలాంటి ప్రవర్తనకైనా మినహాయింపు లభించదు. భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ ఈ విషయాన్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సోమవారం జరిగిన భారత్-ఏ, శ్రీలంక-ఏ జట్ల మధ్య మ్యాచ్ అనంతరం సూర్యవంశీ ఓ శ్రీలంక ఆటగాడితో వాగ్వాదానికి దిగినట్లు, అనంతరం అతడిని తోసినట్లు వీడియోల్లో కనిపించింది. భారత్ సూపర్ ఓవర్‌లో ఓడిపోయిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకోవడంతో మ్యాచ్‌పై చర్చ మొత్తం ఈ వివాదం వైపు మళ్లింది. ఈ ఘటనపై న్యూస్18తో మాట్లాడిన మాజీ అంపైర్ అనిల్ చౌదరి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆటగాళ్లు భౌతికంగా ఒకరినొకరు తాకే పరిస్థితి రావడం సరైంది కాదని, మ్యాచ్ నిర్వహించిన ఫీల్డ్ అంపైర్లు కూడా పరిస్థితిని మరింత సమర్థంగా నియంత్రించాల్సి ఉండేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఐసీసీ నిబంధనలు ఏమంటున్నాయి? ఇప్పటివరకు అంతర్జాతీయ క్రికెట్ మండలి అధికారిక ప్రకటన విడుదల చేయకపోయినా, ఈ ఘటనను ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.12 కింద పరిశీలించే అవకాశం ఉంది. ఈ నిబంధన ప్రకారం మ్యాచ్ సమయంలో ఆటగాడు, సపోర్ట్ స్టాఫ్, అంపైర్, మ్యాచ్ రిఫరీ లేదా ఇతర వ్యక్తితో అనుచితంగా తాకడం ఉల్లంఘనగా పరిగణిస్తారు. అనిల్ చౌదరి ప్రకారం, వీడియోలో ఆటగాళ్ల మధ్య భౌతిక ఘర్షణ జరిగినట్లు స్పష్టంగా కనిపిస్తోందని, ఇప్పుడు ఈ వ్యవహారంలో మ్యాచ్ రిఫరీ పాత్ర కీలకంగా మారుతుందని చెప్పారు. మ్యాచ్ రిఫరీ ప్రదీప్ జయప్రకాశన్ ఈ అంశంపై త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. నిర్ణయం ఎలా తీసుకుంటారు? ఈ ఘటన వెనుక అసలు కారణాలు ఏమిటి, దాగడం వెనుక ఉద్దేశపూర్వకంగా జరిగిందా లేదా అనుకోకుండా జరిగిందా, దాన్ని నివారించే అవకాశం ఉందా వంటి అంశాలను మ్యాచ్ రిఫరీ పరిశీలిస్తారు. అంపైర్ల నివేదికను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. అలాగే క్రికెట్ రూల్స్ తీవ్రత ఎంత, ఎదుటి ఆటగాడికి గాయమైందా లేదా, వివాదం ఎంతవరకు వెళ్లింది వంటి అంశాలు కూడా తుది నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. సూర్యవంశీకి ఎలాంటి శిక్ష పడొచ్చు? అనిల్ చౌదరి అభిప్రాయం ప్రకారం, ఈ ఘటనను ఉల్లంఘనగా నిర్ధారిస్తే వైభవ్ సూర్యవంశీపై మ్యాచ్ ఫీజులో 50 శాతం వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అదనంగా ఒకటి లేదా రెండు డీమెరిట్ పాయింట్లు కూడా ఇవ్వవచ్చు. తక్కువ తీవ్రత కలిగిన కేసుల్లో అధికారిక హెచ్చరిక లేదా మందలింపు విధించే అవకాశమూ ఉంది. ఒక ఆటగాడు 12 నెలల వ్యవధిలో నాలుగు డీమెరిట్ పాయింట్లు సంపాదిస్తే మ్యాచ్‌ల నుంచి సస్పెన్షన్ విధించే అవకాశం ఉంటుంది. అసలు ఏమి జరిగింది? సూపర్ ఓవర్‌లో భారత్-ఏ జట్టుకు 17 పరుగుల లక్ష్యం లభించింది. అయితే సూర్యాంశ్ షెడ్గే, వైభవ్ సూర్యవంశీ జోడీ కేవలం 9 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో శ్రీలంక-ఏ జట్టు విజయం సాధించింది. మ్యాచ్ ముగిసిన తర్వాత మైదానం విడిచివెళ్తున్న సమయంలో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య మాటల యుద్ధం జరిగినట్లు సమాచారం. ఆ సమయంలో సూర్యవంశీ ప్రత్యర్థి బౌలర్ వైపు దూసుకెళ్లి, మధ్యలో జోక్యం చేసుకున్న మరో ఆటగాడిని కూడా తోసినట్లు తెలుస్తోంది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు సీనియర్ ఆటగాళ్లు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.

## శ్రీలంక ఆటగాళ్లే హద్దులు దాటారు..
### వైభవ్‌కు అండగా నిలిచిన తిలక్ వర్మ

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నాడు. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా శ్రీలంకతో ఏతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ సహనం కోల్పోయి ప్రత్యర్థి ఆటగాళ్లతో గొడవకు దిగిన సంగతి తెలిసిందే. ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో భారత్-ఏ సూపర్ ఓవర్‌లో ఓటమిపాలైంది. సూపర్ ఓవర్ ముగిసిన అనంతరం బయటకు వెళ్లే సమయంలో వైభవ్ సూర్యవంశీని శ్రీలంక ఆటగాళ్లు ఏదో అనగా.. అతను వారిపైకి దూసుకెళ్లాడు. ఓ ఆటగాడిని తన చేతులతో నెట్టేసాడు. అంపైర్లు, శ్రీలంక వికెట్ కీపర్ జోక్యం చేసుకొని ఇద్దర్ని విడదీసారు. ఈ ఘటన నేపథ్యంలో వైభవ్ సూర్యవంశీపై ఐసీసీ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు 15 ఏళ్ల వయసులోనే సహనం కోల్పోయి ప్రత్యర్థి ఆటగాళ్లతో గొడవపడిన వైభవ్ సూర్యవంశీని మాజీ క్రికెటర్లు తప్పుబట్టారు. ఇలాంటి వాటికి దూరంగా ఉండి ఆటపై ఫోకస్ పెట్టాలని హితవు పలికారు. అయితే ఈ విమర్శల నేపథ్యంలో కొందరు ఆకతాయిలు.. వైభవ్ సూర్యవంశీకి అండగా ఫేక్ పోస్ట్‌లు క్రియేట్ చేసి వైరల్ చేశారు. భారత్-ఏ కెప్టెన్ తిలక్ వర్మ అండగా నిలిచినట్లు ఓ ఫేక్ వార్త సృష్టించారు. ఈ మ్యాచ్ అనంతరం బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడుతూ తిలక్ వర్మ.. వైభవ్ సూర్యవంశీకి అండగా నిలిచాడనేది ఆ వార్త. ఈ పోస్ట్ ప్రకారం.. 'మ్యాచ్ ఆసాంతం శ్రీలంక ఆటగాళ్లు మమ్మల్ని నిరంతరం దూషిస్తూనే ఉన్నారు. చివరకు అంపైర్లు కూడా కొన్ని నిర్ణయాలు వారికి అనుకూలంగా తీసుకున్నారు. మేం వాటన్నింటినీ పట్టించుకోకుండా ఆటపై మాత్రమే ఫోకస్ పెట్టాం. కానీ, వైభవ్ డ్రెస్సింగ్ రూమ్‌కు తిరిగి వెళ్తున్న సమయంలో శ్రీలంక ఆటగాళ్లలో ఒకరు అనవసరంగా అతన్ని దూషించాడు. అది హద్దులు దాటడమే. దానికి వైభవ్ సూర్యవంశీ గట్టిగా బదులిచ్చాడు. అతను చేసింది సరైన పనే'అని తిలక్ వర్మ అన్నట్లుగా ఫేక్ పోస్ట్‌ను క్రియేట్ చేశారు. అయితే ఈ మ్యాచ్ అనంతరం తిలక్ వర్మ ఏ బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడలేదు. వైభవ్ సూర్యవంశీ గొడవ గురించి కూడా మాట్లాడలేదు. కానీ ఇది నిజమేనని పొరబడి కొందరు నెటిజన్లు ఈ పోస్ట్‌ను షేర్ చేస్తున్నారు. తిలక్ వర్మనే కాకుండా అతని చిన్న నాటి కోచ్ కూడా వైభవ్ సూర్యవంశీకి అండగా మాట్లాడినట్లు కూడా ఫేక్ పోస్ట్ క్రియేట్ చేశారు. 'నేను వైభవ్ సూర్యవంశీకి ఏడేళ్ల వయసు ఉన్నప్పటి నుంచి కోచింగ్ ఇస్తున్నాను.



అతని ప్రవర్తన గురించి నాకు బాగా తెలుసు. అసలు ఏం జరిగిందో తెలుసుకోకుండానే ప్రజలు అతనిపై ఒక నిర్ణయానికి వచ్చేస్తున్నారు. నిన్న రాత్రి నేను వైభవ్‌తో మాట్లాడాను. మ్యాచ్ ఆసాంతం శ్రీలంక ఆటగాళ్లు తనను నిరంతరం దూషించారని, చివరికి తనపై వ్యక్తిగత వ్యాఖ్యలు కూడా చేశారని అతను నాతో చెప్పాడు. అతను చాలా సేపటి వరకు ప్రశాంతంగానే ఉన్నాడు, కానీ ఎవరికైనా ఒక పరిమితి ఉంటుంది. పదే పదే రెచ్చగొట్టడం వల్లే అతను అలా స్పందించాల్సి వచ్చింది. అతనిని విమర్శించే బదులు, మనం అతనికి అండగా నిలవాలి. అలాగే ఏదైనా ఒక నిర్ణయానికి వచ్చే ముందు పూర్తి విషయాన్ని అర్థం చేసుకోవాలి.'అని వైభవ్ సూర్యవంశీ చిన్ననాటి కోచ్ చెప్పినట్లు ఓ ఫేక్ పోస్ట్ క్రియేట్ చేశారు.

# నాగబంధం' విజువల్ గా మెస్మరైజ్ చేస్తుంది

## ఆడియన్స్ కు గొప్ప థియేట్రికల్, డివైన్ ఎక్స్‌పీరియన్స్ అందిస్తుంది: డీవోపీ ఎస్. సౌందరరాజన్

విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం – ది సీక్రెట్ ట్రెజర్'. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సాహ్నీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జూలై 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా డీవోపీ ఎస్. సౌందరరాజన్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**నాగబంధం ప్రాజెక్టులోకి ఎలా వచ్చారు?**

–నేను ఇంతకుముందు అభిషేక్ గారితో డెవిల్ సినిమా చేశాను. అప్పటి నుంచి ఆయనతో చాలా మంచి అనుబంధం ఉంది. అభిషేక్ గారు చాలా పెద్ద విజన్‌తో ఈ కథను మొదలుపెట్టారు. నేను స్క్రిప్ట్ స్టేజ్ నుంచే ఈ ప్రాజెక్టులో ఇన్‌వాల్వ్ అయ్యాను. నాగబంధం ఐడియా మా అందరినీ ఎంతగానో ఉత్సాహపరిచింది. మొదట కథను లాక్ చేశాం. తర్వాత దాన్ని విజువల్‌గా ఎంత గ్రాండ్‌గా, ఎంగేజింగ్‌గా చూపించాలనే దానిపై ప్లాన్ చేశాం.

**ఇందులో మీకు చాలెంజింగ్‌గా అనిపించిన వర్క్ ఏంటి?**

–నేను ఇంతకుముందు ఫాంటసీ సినిమాలు చేశాను. విజువల్స్‌ను గ్లామరైజ్ చేసి, ఎలివేట్ చేసేలా కూడా చేసిన అనుభవం ఉంది. కానీ ఈ సినిమా మాత్రం చాలా ప్రత్యేకం. చాలా నేచురల్ స్టైల్లో ఈ సినిమా చేయడం జరిగింది. ప్రతి సన్నివేశానికి తగ్గట్టుగా సహజమైన లైటింగ్‌తో, కథలో లీనమయ్యేలా తీశాను. ఎక్కడా ఓవర్ గ్లామర్ చేయడం గానీ, అనవసరమైన డ్రామా సృష్టించడం గానీ చేయలేదు.

**చాలా భారీ బడ్జెట్, వీఎఫ్ఎక్స్‌తో వస్తున్న సినిమా కదా. డీవోపీగా మీకు ఎలాంటి ఛాలెంజ్‌గా అనిపించింది?**

–విజువల్ ఎఫెక్ట్స్‌ను మనం రెండు రకాలుగా వాడుతుంటాం. ఒకటి గ్రాండియర్ కోసం,



మరొకటి రియల్‌గా అనిపించేందుకు. అయితే ఆ విజువలైజేషన్ సహజంగా కనిపించడం చాలా పెద్ద టాస్క్. చాలామందిని తీసుకెళ్లి హిమాలయాల్లో షూటింగ్ చేయడం ప్రాక్టికల్‌గా సాధ్యం కాదు. అలాంటి సమయంలో విజువల్ ఎఫెక్ట్స్ ఉపయోగపడతాయి. కానీ వాటిని సహజంగా, నిజంగా కనిపించేలా చేయడం చాలా కష్టమైన పని. ఈ సినిమాలోని వీఎఫ్ఎక్స్ అన్నీ కూడా చాలా నేచురల్‌గా, రియల్‌గా ఉంటాయి.

**ఈ సినిమాలో విజువల్స్ అన్నీ చాలా రియల్‌గా కనిపిస్తున్నాయి. మీరు ఎలాంటి గ్రౌండ్ వర్క్ చేశారు?**

–నేను, డైరెక్టర్ గారు, ఆర్ట్ డైరెక్టర్ కలిసి చాలా దేవాలయాలు తిరిగాం. తిరువనంతపురంలోని శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించాం. అక్కడ ప్రతి అంశాన్ని డీటెయిల్‌గా ఫొటోగ్రాఫ్ చేశాం. అదే ఆలయాన్ని ఆధారంగా చేసుకున్నప్పటికీ సినిమాలో "శ్రీరంగపురం" అనే పేరు పెట్టాం. శ్రీరంగం, తిరువనంతపురం ప్రాంతాల వైభవాన్ని కలిపేలా ఆ పేరు నిర్ణయించాం. ఆ దేవాలయానికి సంబంధించిన అంశాలపై చాలా రీసెర్చ్ చేశాం. అలాగే ఆర్ట్ డైరెక్టర్ అశోక్ గారు అద్భుతమైన సెట్లు వేశారు. అనంత పద్మనాభ స్వామి టెంపుల్ సెట్‌లోకి అడుగుపెడితే నిజంగా ఆలయంలోకి వెళ్లిన అనుభూతి కలుగుతుంది. అంత అద్భుతంగా ప్రతి సెట్‌ను తీర్చిదిద్దారు.

–ఇంతకుముందు కూడా పెద్ద సినిమాలు చేశాను. కానీ ఇంత భారీ స్థాయిలో సెట్లు ఉన్న సినిమాను నేను ఎప్పుడూ చేయలేదు. అంత పెద్ద సెట్లను లైటింగ్ చేయడం, హై స్పీడ్‌లో షూట్ చేయడం చాలా చాలెంజింగ్ వర్క్. షూటింగ్ భారీ స్థాయిలో జరిగింది.

**డైరెక్టర్ అభిషేక్ గారి గురించి?**

–ఆయన అద్భుతమైన కథను రాసుకున్నారు. ఆ ఆలోచన మా అందరికీ ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. దర్శకుడిగా ఆయన అందరినీ సర్‌ప్రైజ్ చేశారు. ఆయన క్లారిటీ, విజువల్ సెన్స్, కోఆర్డినేషన్ అన్నీ అద్భుతం. ప్రతి విభాగం నుంచి బెస్ట్ ఔట్‌పుట్ రాబట్టుకున్నారు.

**ఇందులో ఒక ఎపిసోడ్ చేయడానికి 10 కోట్లు అయ్యిందని విన్నాం?**

అవును. మేము ఒక్కో అంశాన్ని ఇంప్రొవైజ్ చేసుకుంటూ వెళ్లాం. ఒక సెట్ డిజైన్ చేసిన తర్వాత ఇంకా గ్రాండ్‌గా ఉంటే బాగుంటుందనే ఆలోచనతో బడ్జెట్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా గొప్ప స్థాయిలో సినిమాను తెరకెక్కించాం.

**షూటింగ్ ఎక్కడ చేశారు?**

–హైదరాబాద్, కేరళ, తమిళనాడు, అలాగే హిమాలయాల్లోని కొన్ని ప్రాంతాల్లో కీలక సన్నివేశాలు చిత్రీకరించాం.

**నిర్మాతల గురించి?**

అభిషేక్ నామా గారి విజన్‌కు నిర్మాతలు ఎంతగానో సపోర్ట్ చేశారు. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా కథకు తగ్గట్టుగా చాలా గ్రాండ్ స్కేల్‌లో సినిమాను నిర్మించారు. మా నిర్మాతలకు సినిమా అంటే చాలా పాషన్. ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేలా ఈ సినిమాని నిర్మించారు.

**హీరో విరాట్ కర్ణ గురించి?**

విరాట్ కర్ణ చాలా కమిట్‌మెంట్ ఉన్న నటుడు. ఈ సినిమా కోసం ఎంతో అంకితభావంతో పనిచేశారు.
డిసెంబర్, నవంబర్ నెలల్లో తీవ్రమైన చలిలో కూడా అండర్‌వాటర్ సన్నివేశాల్లో పాల్గొన్నారు. జ్వరంతో కూడా షూట్ కి వచ్చారు. చాలా ఫ్లెక్సిబుల్‌గా ఈ సినిమా చేశారు. ఆయన కమిట్‌మెంట్ స్క్రీన్‌పై స్పష్టంగా కనిపిస్తుంది.

**ఈ సినిమా మేజర్ హైలట్ ఏమిటి?**

–ఈ సినిమా హైలైట్ అనంత పద్మనాభస్వామి టెంపుల్, అక్కడ జరిగే సన్నివేశాలు. అవి అద్భుతంగా ఉంటాయి. అలాగే క్లైమాక్స్ కూడా ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తుంది. అది చాలా బిగ్ స్కేల్‌లో ఉంటుంది.ఈ సినిమా భారీ విగ్రహాన్ని రూపొందించాం. ఈ వర్క్ లో దేశంలోని ప్రముఖ నిపుణులు పాల్గొన్నారు.

–ఇందులోని విజువల్స్ అన్నీ చాలా అథెంటిక్‌గా ఉంటాయి. షూటింగ్ సమయంలో కూడా ప్రతి ఒక్కరూ ఎంతో భక్తి భావంతో ఉండేవారు. చెప్పులు బయటే వదిలి సెట్స్‌లోకి వచ్చేవారు. అలాగే షూటింగ్ ప్రారంభానికి ముందు ప్రత్యేకంగా నియమించిన అర్చకుడు పూజలు నిర్వహించిన తర్వాతే షూటింగ్ చేసేవాళ్లం.

–ఈ సినిమాలో మైథాలజీ, ఫిక్షన్, డ్రామా అన్నింటినీ మిళితం చేస్తూ ఒక విజువల్ ఫీస్ట్‌లా మలిచాం. అలాగే ట్రావెన్కోర్ ప్రధాన అర్చకుడిని కలిసి ఎన్నో విషయాలు తెలుసుకుని, చాలా చిన్న చిన్న డీటెయిల్స్‌ను కూడా సినిమాలో పొందుపరిచాం.

**ఈ సినిమా కోసం కెమెరా వర్క్ పరంగా కొత్త ఎక్విప్‌మెంట్ ఏదైనా ఉపయోగించారా?**

–చాలా పెద్ద సెట్లలో తీసిన సినిమా ఇది. ఆ మొత్తం సెట్‌ను ఒకే షాట్‌లో చూపించడం నాకు చాలెంజ్‌గా అనిపించింది. అందుకోసం చాలా ఖరీదైన డ్రోన్‌ను ఉపయోగించాం. ఆలయ ప్రవేశ ద్వారం నుంచి పద్మనాభస్వామి విగ్రహం వరకు ఒకే షాట్‌లో చిత్రీకరించాం. దాని కోసం చాలా రిహార్సల్స్, అనేక టేక్స్ తీసుకున్నాం.
ఆ షాట్ అద్భుతంగా వచ్చింది.

**మ్యూజిక్ గురించి?**

–ఈ సినిమా మ్యూజిక్ కూడా చాలా డివైన్‌గా ఉంటుంది. మేము షూటింగ్ చేసినప్పుడే మ్యూజిక్ రిఫరెన్స్‌తో పాటు షూట్ చేసేవాళ్లం. ప్రతి ముఖ్యమైన సీక్వెన్స్‌కు మాకు ముందుగానే మ్యూజిక్ రిఫరెన్స్ ఉండేది. దాంతో కెమెరా వర్క్ కూడా మరింత ఎన్‌హాన్స్ అయింది.

**'నాగబంధం' విజువల్‌గా ఆడియన్స్‌కు ఎలాంటి అనుభూతిని ఇస్తుంది?**

–ఈ సినిమా ప్రేక్షకులను ఎంగేజ్ చేస్తూ, ఎంటర్‌టైన్ చేస్తూ, ఒక డివైన్ అనుభూతిని కూడా అందిస్తుంది. ఖచ్చితంగా ఇది ప్రేక్షకులకు అద్భుతమైన విజువల్ ఎక్స్‌పీర ియన్‌ను అందిస్తుంది.

## పర్సంటేజ్ సబ్ కమిటీ నుంచి సురేష్ బాబు, దిల్ రాజు తప్పుకోవాలి

### –ప్రెస్ మీట్ లో నట్టికుమార్ షాకింగ్ కామెంట్స్

"థియేటర్స్ లో పర్సంటేజ్ విధానం అమలుకు నిర్మాతలు సుముఖంగానే ఉన్నారు. అయితే నిర్మాతలకు, డిస్ట్రిబ్యూటర్స్ కు ఇబ్బందులు తలెత్తని రీతిలో అందరికీ ఆమోదయోగ్యమైన పర్సంటేజ్ ను నిర్ణయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది" అని సీనియర్ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ నట్టి కుమార్ స్పష్టంచేశారు. మంగళవారం హైదరాబాద్ లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడారు. రెంటల్ విధానంలో ఒక థియేటర్ కు రూ. 7,30,000/– వస్తుందని అనుకుంటే..ఆ థియేటర్ ఓనర్ సుమారు రూ.10,00,000/– వరకు పర్సంటేజ్ విధానంలో వచ్చేవిధంగా నిర్ణయించమని అడగడంలో తప్పులేదు.



అదే పాతిక లక్షలకు సమానంగా పర్సంటేజ్ ఇవ్వమని అడిగితే, అది ఎంతమాత్రం సహేతుకంగా ఉండదు. సినిమాలలో నష్టం వస్తే నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్ ను ఆదుకునే వారు ఎవరూ లేరు. కొన్ని సందర్భాలలో నష్టాల కారణంగా ఉన్న ఆస్తులు పోగొట్టుకుని, అప్పుల పాలవుతున్నారు. అఖండ–2 సినిమాకు నష్టాలు వస్తే నిర్మాత గురించి ఎవరు మాట్లాడారు. అలాగే చిన్న సినిమా నిర్మాతలకు ఇంకెంత ఇబ్బందులు ఉంటాయి. ఎగ్జిబిటర్ కు తన థియేటర్ అయినా ఒక ప్రాపర్టీ గా, సేఫ్టీ గా ఉంటుంది. హీరోలు తక్కువ సినిమాలు చేయటం వల్ల ఎగ్జిబిటర్స్ ఇబ్బందులు పడుతున్నారు. కారణాలు ఏవైనప్పటికీ సబ్ కమిటీ మీటింగ్ లో మాట్లాడేందుకు కొందరు ఇబ్బందులు పడుతున్నారు. అందువల్లే నేను మాట్లాడాల్సి వస్తోంది. ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకుని, ఇబ్బందులు ఎదురుకాకుండా తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఏర్పాటు చేసిన సబ్ కమిటీ లో నిర్ణయాలు జరగాలి. ఈ సబ్ కమిటీలో అధ్యక్షులుగా లీజు ఓనర్స్ అయిన డి.సురేష్ బాబు, దిల్ రాజులు ఉన్నారు. వ్యక్తిగతంగా వారిద్దరూ నాకు ఎంతో క్లోజ్. అయితే ఈ సబ్ కమిటీ వారి నేతృత్వంలో పనిచేస్తుండటం వల్ల వారు ఎగ్జిబిటర్స్ వైపు మొగ్గు చూపే అవకాశం ఉంటుంది. దానివల్ల నిర్మాతలకు, డిస్ట్రిబ్యూటర్స్ కు అన్యాయం జరిగే అవకాశం ఉందన్న అనుమానాలు నాకే కాదు పలువురు నిర్మాతలకు వస్తున్నాయి. అందుకే వారిద్దరూ ఈ కమిటీ నుంచి తప్పుకుని, వారి స్థానాలలో కె.ఎల్.నారాయణ, శ్యాంప్రసాద్ రెడ్డి వంటి వారిని నియమించాలి. వారిద్దరూ కావాలంటే సబ్ కమిటీలో ఎగ్జిబిటర్స్ వైపు నిలబడి మాట్లాడవచ్చు. నిజమైన బి.ఫారం కలిగిన లైసెన్స్ ఉన్న ఓనర్స్ కాకుండా లీజ్ ఓనర్స్ ఇప్పుడు చక్రం తిప్పుతున్నారు. అన్నీ వాళ్లకు అనుకూలమైన, వాళ్లకు భారీ లాభాలు ఉండేలా నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న కలవరం ఎంతోమంది నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్ లో ఏర్పడుతోంది. ప్రతి ఒక్కరి సమస్యలను సబ్ కమిటీ చర్చించి, శాశ్వతంగా పరిష్కరించాలి. గతంలో సబ్ కమిటీ మీటింగ్ జరిగాక కూడా ఎగ్జిబిటర్స్ రెండు సార్లు మాట్లాడారు కాబట్టి ఇప్పుడు నేను మాట్లాడుతున్నాను" అంటూ చెప్పుకొచ్చారు.

**పెద్ది కలెక్షన్స్ పై రూమర్స్ కరెక్ట్ కాదు :**

పెద్ది చిత్రం అద్భుతమైన కలెక్షన్స్ ను రాబట్టి, విజయవంతంగా ప్రదర్శింపబడుతోందని, కలెక్షన్స్ తగ్గాయని వస్తున్న రూమర్స్ ఎంతమాత్రం కరెక్ట్ కాదని ఇదే ప్రెస్ మీట్ లో అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా నట్టి కుమార్ బదులిచ్చారు. ఇంకా ఆయన మాట్లాడుతూ, పెద్ది సినిమా ఎగ్జిబిటర్స్ కు ఊపిరిపోసిందని అన్నారు. చాలాకాలంగా పెద్ద సినిమాలు ఎక్కువగా రాకపోవడం వల్ల, థియేటర్స్ రన్నింగ్ సరిగా లేక ఇబ్బందులు పడుతున్నటైమ్ లో పెద్ది సినిమా ఎగ్జిబిటర్స్ లో నూతనోత్సాహాన్నినింపిందని చెప్పారు. రామ్ చరణ్ తన పాత్ర కోసం ఎంతో కష్టపడటమే కాదు, పాత్రకు జీవం పోశారని ఆయన చెప్పారు. సినిమా ప్రేక్షకాదరణతో, మంచి రన్నింగ్ తో నడుస్తోందని అన్నారు.

## జూన్ 19న రాబోతోన్న 'మా ఇంటి బంగారం' అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది

### ప్రీ రిలీజ్ సెలెబ్రేషన్స్‌లో సమంత
### 'మా ఇంటి బంగారం' పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను
### ప్రీ రిలీజ్ సెలెబ్రేషన్స్‌లో నిర్మాత డి.సురేష్ బాబు

ట్రాలాలా పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మించిన సినిమా 'మా ఇంటి బంగారం'. సమంత ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి నందినీ రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ మూవీ జూన్ 19న విడుదల కాబోతోంది. ఇప్పటికే టీజర్, ట్రైలర్‌లతో సినిమా టీం ప్రేక్షకుల్లో అంచనాలు పెంచేసింది. ప్రమోషన్స్‌లో భాగంగా సోమవారం నాడు ప్రీ రిలీజ్ సెలెబ్రేషన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్మాతలు డి.సురేష్ బాబు, స్వప్నా దత్, జాన్వీ నారంగ్, డైరెక్టర్ దేవా కట్టా తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ ఈవెంట్‌లో.. నిర్మాత డి.సురేష్ బాబు మాట్లాడుతూ .. ''మా ఇంటి బంగారం'తో సమంతకి మంచి విజయం దక్కాలి. 'ఓ.. బేబీ'తో సమంత, నందినీ కలిసి నాకు మంచి సక్సెస్ ఇచ్చారు. ఈ చిత్రం కూడా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నారు. రాజ్, హిమాంక్ చాలా కష్టపడ్డారు. జూన్ 19న ఈ సినిమా రాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి' అని అన్నారు. సమంత మాట్లాడుతూ .. 'నేను ఇకపై ఏడాదికి రెండు సినిమాలు అభిమానులకు అందించాలని అనుకుంటున్నాను. ఇప్పుడు అయితే ఓ మంచి చిత్రాన్ని చేశాం. ఇప్పటి వరకు నేను నటిగా ఎంతో ఎంజాయ్ చేశారు. నిర్మాతకు ఉండే కష్టాలు ఇప్పుడు తెలుస్తున్నాయి. గత వారం రోజులుగా మా టీం నిద్రపోవడం లేదు. ప్రతీ ఒక్క డిపార్ట్మెంట్ ప్రాణం పెట్టి పని చేసింది. రాజ్ అండ్ డీకే, నందినీ రెడ్డి నాకు ఎంతో సపోర్ట్‌గా నిలిచారు. రాజ్ అండ్ డీకే ఎప్పుడూ కష్టపడుతూ పని చేస్తూనే ఉంటారు. మా కోసం వచ్చిన ప్రతీ ఒక్క అతిథికి ధన్యవాదాలు. నా మీద ఇప్పటికీ అదే ప్రేమను చూపిస్తున్న అభిమానులకు ఎప్పుడూ రుణపడి ఉంటాను. జూన్ 19న రాబోతోన్న 'మా ఇంటి బంగారం' అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది' అని అన్నారు. నిర్మాత రాజ్ నిడిమోరు మాట్లాడుతూ .. 'మా కోసం వచ్చిన సురేష్ గారు, స్వప్నా, జాన్వీలకు థాంక్స్. ప్రేమ, పిచ్చి అనేది తెలుగు పరిశ్రమలోనే ఎక్కువగా ఉంటుంది. 'మా ఇంటి బంగారం'



చిత్రానికి వసంత్, ధర్మేంద్ర పిల్లర్స్‌లా నిల్చున్నారు. ఈ జర్నీలో ఎంతో మంది గొప్ప టెక్నీషియన్లను, ఆర్టిస్టులను కలుసుకున్నాం. నందినీ గారితో పని చేయడం ఆనందంగా ఉంది. మేం రాయడం ఒకెత్తు అయితే.. సమంత నటించడం ఇంకో ఎత్తు. సమంత ఓ అద్భుతమైన నటి. మేం హిందీలో ఎన్నో సినిమాలు చేశాం. కానీ దీనికి వస్తున్న రెస్పాన్స్, ఎగ్జైట్మెంట్ నాకు ఎక్కడా కనిపించలేదు. అందరూ ఫస్ట్ డే ఫస్ట్ షో చూస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు. డైరెక్టర్ నందినీ రెడ్డి మాట్లాడుతూ .. ''మా ఇంటి బంగారం' కోసం గత కొన్ని రోజులుగా ఎంతో మంది నిద్ర లేకుండా పని చేస్తున్నాం. అద్భుతమైన టీం నిరంతరం శ్రమించడం వల్లే ఇదంతా సాధ్యమైంది. ఈ ఇండస్ట్రీలో నేను ఎంతో మంది స్నేహితుల్ని సంపాదించుకున్నాను. అదే నా బలం. రాజ్‌తో పని చేయడం ఎంతో సులభంగా అనిపించింది. టీంగా మేం పని చేయడం వల్ల ఎంతో నేర్చుకున్నాం. నేను ఇచ్చిన మాట ప్రకారం సినిమాని ది బెస్ట్‌గా తీశానని అనుకుంటున్నాను. హిమాంక్ ఈ మూవీని భుజానికి ఎత్తుకున్నారు. నా మీద సమంత పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని అనుకుంటున్నాను. జూన్ 19న మా చిత్రం రాబోతోంది. ఇంత వరకు చూసిన సమంత కంటే.. పది రెట్ల సమంతను చూస్తారు' అని అన్నారు. నిర్మాత జాన్వీ నారంగ్ మాట్లాడుతూ .. ''మా ఇంటి బంగారం' ఈవెంట్‌కు రావడం ఆనందంగా ఉంది. నందినీ గారి మేకింగ్ అంటే నాకు చాలా ఇష్టం. సమంత కోసమే ఈ సినిమా వచ్చినట్టుగా ఉంది. టీం అందరికీ కంగ్రాట్స్' అని అన్నారు. నిర్మాత స్వప్నా దత్ మాట్లాడుతూ .. ''మా ఇంటి బంగారం' ట్రైలర్ బాగుంది. నందినీ రెడ్డి నాకు ఫస్ట్ బెస్ట్ ఫ్రెండ్. రాజ్‌కి నేను ఫస్ట్ ఫ్రెండ్. ఈ మూవీ బ్లాక్ బస్టర్ కానుంది. మేం మళ్లీ ఈ చిత్రంతోనే డిస్ట్రిబ్యూషన్‌లోకి వస్తున్నాం' అని అన్నారు. మైత్రి వై.రవి శంకర్ మాట్లాడుతూ .. ''మా ఇంటి బంగారం' అనే టైటిల్‌లోనే ఓ వైబ్రేషన్ ఉంది. సమంత గారు మాకు కూడా ఓ బంగారం లాంటివారే. మా బ్యానర్‌లో సమంత చేసిన ప్రతీ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయింది.
అలా సమంత గారు మా ఇంటి బంగారం అయ్యారు. శారీలో ఆ యాక్షన్ సీక్వెన్స్ అదిరిపోయాయి. టీజర్, ట్రైలర్ చూసి షాక్ అయ్యాను. పెద్ద ఓపెనింగ్స్ వస్తాయి. ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. హిమాంక్ మాట్లాడుతూ .. 'రాజ్ గారు ఈ లైన్ చెప్పినప్పుడు, టైటిల్ చెప్పినప్పుడు రిజల్ట్ ముందుగానే ఊహించాను. రాజ్, సమంత, నేను ముందుగా కూర్చుని రెడీ చేశాం. ఆ తరువాత వసంత్, నందినీ ఇలా అందరూ జాయిన్ అయ్యారు. జూన్ 19న మా సినిమాని చూసి అందరూ ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు.
డైరెక్టర్ డీకే మాట్లాడుతూ .. 'సమంతతో ఇది వరకు రెండు సిరీస్‌లకు పని చేశాం. ప్రతీ సారి ఆమె ప్రాణం పెట్టి నటిస్తారు. ఇందులోనూ వంద శాతం ఇచ్చారు. ట్రైలర్ చూశాక నేను ఎగ్జైట్ అయ్యాను. అందరితో కలిసి సినిమా చూడాలని నేను కూడా ఎదురు చూస్తున్నాను. నేను లేకుండా రాజ్ మొదటి సారి ఈ ప్రాజెక్ట్ చేశారు. ఈ చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. డైరెక్టర్ దేవాకట్టా మాట్లాడుతూ .. 'రాజ్, డీకే, నేను కలిసి షార్ట్ ఫిల్మ్స్ తీసే టైం నుంచీ స్నేహితులం. సమంత నిజంగానే బంగారం. గ్లింప్స్, టీజర్ వచ్చినప్పటి నుంచే బంగారం రాబోతోన్నట్టుగా అర్థమైంది. నందినీ రెడ్డి గారి మేకింగ్ అంటే నాకు చాలా ఇష్టం. 'మా ఇంటి బంగారం' బ్లాక్ బస్టర్ హిట్ కాబోతోంది' అని అన్నారు.

## కాజల్ అగర్వాల్, శ్రేయస్ తల్పడే 'ది ఇండియా స్టోరీ' అఫీషియల్ పోస్టర్ రిలీజ్


జీ స్టూడియోస్ సమర్పణలో, ఎంఐజీ ప్రొడక్షన్ & స్టూడియోస్ సహకారంతో తెరకెక్కుతున్న 'ది ఇండియా స్టోరీ' చిత్రానికి సంబంధించిన తొలి అధికారిక పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లతో ఆసక్తిని పెంచిన చిత్రబృందం, తాజాగా విడుదల చేసిన ఈ పోస్టర్‌తో సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. ఈ పోస్టర్‌లో కాజల్ అగర్వాల్ ఓ న్యాయవాదిగా, శ్రేయస్ తల్పడే ఆందోళనలో




ఉన్న తండ్రిగా కనిపిస్తున్నారు. అలాగే శ్రేయస్ కుమార్తె పాత్రలో కనిపిస్తున్న చిన్నారి ద్వారా, లక్షలాది కుటుంబాలను ప్రభావితం చేస్తున్న ఒక తీవ్రమైన సమస్య వెనుక ఉన్న మానవీయ కోణాన్ని పోస్టర్ బలంగా ఆవిష్కరించింది. ముంబై హైకోర్టు నేపథ్యంతో రూపొందించిన ఈ పోస్టర్‌లో, సాక్షుల బోనులో ఉంచిన పురుగుమందు సిలిండర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆహార కల్తీ అనే అత్యంత కీలకమైన సమస్యపై సాగే కోర్ట్‌రూమ్ డ్రామాకు ఇది సంకేతంగా కనిపిస్తోంది. ఈ చిత్రానికి చెట్టన్ డీకే దర్శకత్వం వహించగా, సాగర్ బి. షిండే కథ, స్క్రీన్‌ప్లే అందించి నిర్మిస్తున్నారు. జూలై 24, 2026న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. భారతదేశంలో ప్రజారోగ్యానికి సంబంధించిన అత్యంత కీలకమైన, తరచూ నిర్లక్ష్యానికి గురయ్యే ఆహార కల్తీ సమస్యను ఈ చిత్రం ప్రధానాంశం. సాధారణ ప్రజలు ప్రతిరోజూ వినియోగించే ఆహార పదార్థాల వెనుక దాగి ఉన్న ప్రమాదాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, సమాజంలో అవగాహన పెంచే ప్రయత్నం చేయనుంది. ఈ చిత్రానికి సహ నిర్మాతలుగా స్వాతి వినాయక్ సైందానే, అనితా జాధవ్, వినాయక్ సైదానే, కల్పేష్ షా, దేవయాని ఖోరాటే, ప్రేమ్ జోషి వ్యవహరిస్తున్నారు. సినిమాటోగ్రఫీని నిశాంత్ భాగవత్, సంగీతాన్ని మంగేష్ ధాక్డే, ఎడిటింగ్‌ను ఆశిష్ మ్హాత్రే, సాహిత్యాన్ని షకీల్ అజామీ, సౌండ్ డిజైన్‌ను అన్మోల్ భావే అందిస్తున్నారు.

## తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన విశాల్

తమిళనాడు ముఖ్యమంత్రిగా జోసెఫ్ విజయ్ పదవీ బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఆ క్షణం నుంచి కోలీవుడ్ ప్రముఖులంతా ఒక్కొక్కరిగా వెళ్లి ముఖ్యమంత్రి విజయ్‌ని మర్యాదపూర్వకంగా



కలుస్తూనే ఉన్నారు. తాజాగా విశాల్ తన స్నేహితుడు అయిన సీఎం విజయ్‌ని కలిశారు. ఈ మేరకు ఆయన ఈ భేటీ గురించి పోస్ట్ చేశారు. 'లయోలా కాలేజీలో మన పరిచయం ఏర్పడిన నాటి నుంచి నేను మిమ్మల్ని 'డార్లింగ్' అని పిలుస్తూనే ఉన్నాను.. అందులో ఎలాంటి మార్పు రాలేదు. ఓ సాధారణ హీరోగా మొదలైన మీ ప్రయాణంలోని అన్ని అడ్డంకులను, విమర్శలను ఎదుర్కొని, మీ మౌనంతో, విజయంతో వాటన్నిటినీ పక్కకు నెట్టేశారు. ఒక సూపర్‌స్టార్‌గా మీరు ఉన్నత శిఖరాలకు ఎదిగి ఈనాడు తమిళనాడు గౌరవ ముఖ్యమంత్రి అయ్యారు. ఈ రోజు పదవి, హోదా మారాయి కానీ మీరు మాత్రం మారలేదు. మిమ్మల్ని కలవడం ఎంతో ఆనందాన్నిచ్చింది, అదే ఆప్యాయతను మళ్లీ అనుభూతి చెందాను. ఎంజీఆర్ గారి నుంచి.. జయలలిత అమ్మ వరకు, స్టాలిన్ అంకుల్ నుండి నా ప్రియ సోదరుడు ఉదయ నిధి స్టాలిన్ వరకు.. మన రాష్ట్ర ముఖ్యమంత్రిని 'డార్లింగ్' అని పిలవడం ఎంతో ముచ్చటగా అనిపించింది. నాలోని ఈ మధుర క్షణాలు ఎప్పటికీ నిలిచి ఉంటాయి. మీ కోసం తీసుకు రావాల్సిన బొకే, శాలువాకి బదులుగా ఆ డబ్బును మీ తరపున, మీ పేరు మీద తమిళనాడులోని ముగ్గురు అర్హులైన నిరుపేద బాలికల చదువు కోసం ఉపయోగించినందుకు మీకు ధన్యవాదాలు. వారు మిమ్మల్ని చూసి గర్వపడతారు, మిమ్మల్ని ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటారు. మరోసారి నా హృదయపూర్వక ధన్యవాదాలు. మీకు అంతా మంచే జరగాలని కోరుకుంటున్నాను. మీ పాలనలో తమిళనాడు అత్యుత్తమంగా రాణించాలని ఎదురుచూస్తున్నాను' అని అన్నారు.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/26/A2380